ఫిబ్రవరి
2021

178

సంపుటి : 15 సంచిక : 9 వెల రు. 10/-

ఈ సంచికలో........

ప్రాంతీయ పార్టీలు : ముందున్న సవాళ్లు
భారత వ్యవసాయం ఆధునీకరణలో ప్రత్యేక వైరుధ్యాలు
ఆగ్జిల్లరీ గ్రూపుల పని విధానం
ఆకలి నిర్మూలనలో వైఫల్యం
బొలీవియాలో సామాజిక శక్తులకు విజయం
భారత్‌లో అమెరికా జీవాయుధ ప్రయోగాలు
ప్రయివేటు పరమౌతున్న సైనిక వర్క్‌షాపులు
వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న పర్యావరణ విధ్వంసం
త్రిపుర గిరిజన పోరాటం

**భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ వ్యాసావళి**

# త్రిపుర గిరిజన పోరాటం

**1940**వ సంవత్సరం మొదట్లో కమ్యూనిస్టు పార్టీ త్రిపురలో కొన్ని పట్టణాలు, గిరిజనేతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. ఈ కాలంలో, అంటే రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత పన్నెండు మంది చదువుకున్న యువకులు కలిసి 1945, డిసెంబర్ 27న జన శిక్షణా సమితి (వయోజన విద్య నేర్పటం కోసం)ని ప్రారంభించారు. అక్షరాలు నేర్పించడమే కాక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడడం నేర్పించడం, ఆనాడు గిరిజనులలో ఉన్న అనేక సామాజిక రుగ్మతలను గుర్తింపజేయటం, మూఢవిశ్వాసాలను తొలగించడం కూడాజన శిక్షణా సమితి లక్ష్యంగా ఉండేది. యుద్ధకాలంలో నిత్యావసర వస్తువులను దాచిపెట్టడానికి, అధికధరలకు మార్కెట్లో విక్రయించడానికి వ్యతిరేకంగా కూడా పనిచేసింది. జన శిక్షణా సమితి వందలాది ప్రాథమిక పాఠశాలలను తెరిచింది (ఒక లెక్క ప్రకారం 488 బడులను ప్రారంభించింది.). పేద గిరిజన గ్రామీణ ప్రజలు వీటి నిర్మాణానికి, నిర్వహణకు కూడా సహకరించారు. సంకుచిత భావాలతో కాకుండా జన శిక్షణా సమితి ఒక విశాల వేదికగా పనిచేసింది. అందువలన విద్యావంతులైన గిరిజనేతరులు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. జన శిక్షణా ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ కూడా భాగస్వామి అయింది.

అక్షర జ్ఞానం నేర్పించడానికి మొదలయిన ఉద్యమం ఆ తరువాతి కాలంలో భూస్వామ్య వ్యవస్థని. రాచరికాన్ని, దివాన్ల పాలనను వ్యతిరేకించే రూపాన్ని సంతరించుకుంది. ప్రజాస్వామికంగా ఎన్నికయిన ప్రభుత్వ ఏర్పాటు కోసం పోరాటం చేసింది. ఈ క్రమంలోనే దశరథ్‌దేవ్ లాంటి జన శిక్షణా సమితి కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీకి పరిచయమయ్యారు. 'ప్రజలు చదువుకోవడం చూసి' భయపడిన రాజు జన శిక్షణా సమితిని ఆదిలోనే ధ్వంసం చేయడానికి పూనుకున్నాడు. అయినా ఈ ఉద్యమం ఆగలేదు సరికదా త్రిపుర సమాజంలో ఒక మైలురాయిగా నిలిచి, అనేక ప్రజాపోరాటాలకు నాంది పలికింది.

జన శిక్షణా సమితి కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం అనేకరకాల ప్రయత్నాలు చేసింది. జన శిక్షణా సమితి నాయకులను పి డి చట్టం కింద ఖైదు చేసింది. ఇటువంటి కీలక సమయంలో జన శిక్షణా సమితి సమావేశమై, గణముక్తి పరిషత్ (ప్రజా విమోచన సంస్థ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 1948లో గిరిజనులకు ఇదొక రాజకీయ వేదికగా ఉపయోగపడింది. వెట్టి చాకిరీ, వడ్డీ వ్యాపారుల, వ్యాపారుల దోపిడీ, గిరిజనుల భూమి అన్యాక్రాంతం కావడం, నీతి బాహ్యమైన కుటుంబ పన్ను, గడ్డి పన్ను ,రాజ్యం ప్రోత్సహిస్తున్న తీవ్రవాదం మొదలయిన ప్రధానమైన సమస్యలపై పనిచేస్తూ, గిరిజనుల సమస్యలను పరిష్కరించటం కోసం గణముక్తి పరిషత్ పోరాటం చేసింది. గణముక్తి పరిషత్‌ను ఏర్పరచడంలో కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించింది.

గణముక్తి పరిషత్ ప్రతి గ్రామంలోనూ గిరిజనులు పోలీసుల, సైన్యం యొక్క దాష్టీకాలను ఎదుర్కొని పోరాడటానికి సహకరించింది. 1948 ఆగష్టు 15న అగర్తలకు పాదయాత్ర నిర్వహించటానికి గణముక్తి పరిషత్ వేలాది గిరిజనులను ఒక గిరిజన పట్టణంలోకి సమీకరించింది. ఆ పట్టణమంతా గిరిజనులతో నిండి పోయింది– ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ఉండాలి, దివానీ పాలన అంతమవ్వాలి, రాజకీయ ఖైదీలను ముందస్తు షరతులు లేకుండా విడుదల చేయాలి, అరెస్టు వారంట్లను రద్దు చేయాలి, పోలీసుల హింసను నిలిపివేయాలి, ఏ రకమైన విచారణ లేకుండా అరెస్టులు చేయకూడదు, ఇంక్విలాబ్ జిందాబాద్ తదితర నినాదాలతో పట్టణం హోరెత్తి పోయింది. పట్టణం నడిబొడ్డులో ప్రదర్శన జరిగింది. సుశిక్షితమైన ఆ ప్రదర్శన. ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని నింపి, తరువాత జరగబోయే పోరాటాలకు వారిని సన్నద్ధం చేసింది. ప్రభుత్వం, పోలీసులు, సైన్యంతో దాడులు చేయించిన తరువాత గణముక్తి పరిషత్ బలహీన పడిందని భావించింది. కానీ ఈ ప్రదర్శన వారి అంచనాలు తప్పని నిరూపించింది. ఈ ప్రదర్శన తరువాత గణముక్తి పరిషత్ ప్రజలలో మరింత ప్రాచుర్యం పొందింది.

1948లో త్రిపురలో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడింది. ఆ రోజుల్లో గిరిజన ప్రాంతాలలోని ఆర్థిక వ్యవస్థ అంతా వడ్డీ వ్యాపారుల ఆధ్వర్యంలో నడిచేది. గణముక్తి పరిషత్ నాయకత్వంలో గిరిజనులు ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. దివాని పాలకులు పోలీసులను ఉపయోగించి గిరిజనుల నిరసలను అణిచివేసే ప్రయత్నాలు చేశారు. గోలాఘాటిలో జరిగిన కాల్పులలో ఏడుగురు గిరిజనులు చనిపోగా ఎంతోమంది గాయపడ్డారు. వడ్డీ వ్యాపారులకు, భూకబ్జాదారులకు, నల్లబజారులో అమ్మకాలు చేసేవారికి, పోలీసు అధికారులకు, భారతదేశ పరిపాలకులకు మధ్య ఉన్న అపవిత్ర సంబంధాన్ని ఈ సంఘటన బట్టబయలు చేసింది.

కమ్యూనిస్టులను అణచివేయడానికి 1949 మార్చి 9న మిలిటరీ పాలన విధించారు. అరెస్టుల నుండి తప్పించుకోడానికి గణముక్తి పరిషత్ నాయకులు రహస్య జీవితం గడపాల్సి వచ్చింది. 1949 మార్చి 28వ తేదీన సైన్యం పద్మబిల్ గ్రామంలో ముగ్గురు గిరిజన బాలికలను అతి సమీపం నుండి తుపాకులతో కాల్చి చంపింది. అధికారుల సామాన్లను ఉచితంగా మోసుకెళ్లడానికి నిరాకరించడమే వారి నేరం. త్రిపుర ప్రజాఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన తొలి మహిళలు వీరే. వారి హత్యలు త్రిపుర ప్రజలలో మరింత ఆగ్రహావేశాలు నింపాయి.

పరిస్థితిని సమీక్షించిన జన శిక్షణా సమితి నాయకులు ప్రతిఘటనా పోరాటాన్ని కొనసాగించడం తప్ప వేరే గత్యంతరం లేదనే నిర్ణయానికి వచ్చారు. తెలంగాణలో జరుగుతున్న రైతాంగ సాయుధ పోరాటం, కాక్‌ద్వీప్‌లో జరుగుతున్న రైతాంగ పోరాటం గణముక్తి పరిషత్‌లో పోరాట స్ఫూర్తిని నింపాయి. గెరిల్లా దళాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకుగాను గిరిజనుల వద్ద నున్న ఆయుధాలను సమీకరించారు. సాయుధ పోరాటంతో పాటు రాచరిక, భూస్వామ్య వ్యవస్థలపై సైద్ధాంతిక పోరాటం కూడా జరపాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలోనూ మార్క్సిజం–లెనినిజం పుస్తకాలు, కరపత్రాలు చదవటాన్ని ప్రోత్సహించారు. ఇందుకుగాను చురుకైన కార్యకర్తలకు మార్క్సిజంలోని ముఖ్యాంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. మతోన్మాదం, బెంగాలీ వ్యతిరేకత

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. త్రిపుర గిరిజన పోరాటం ........... 2

2. ప్రాంతీయ పార్టీలు : ముందున్న సవాళ్లు
ప్రకాశ్ కరత్......... 4

3. భారత వ్యవసాయం ఆధునీకరణలో ప్రత్యేక వైరుధ్యాలు
కె దీపక్ ................ 8

4. ఆగ్జిల్లరీ గ్రూపుల పని విధానం
ఎస్ వీరయ్య ....... 13

5. ఆకలి నిర్మూలనలో వైఫల్యం
ఎ కోటిరెడ్డి ......... ..... 15

6. బొలీవియాలో సామాజిక శక్తులకు విజయం
తథాగతన్ రవీంద్రన్............20

7. భారత్‌లో అమెరికా జీవాయుధ ప్రయోగాలు
పికె రాజగోపాలన్.....24

8. ప్రయివేటు పరమౌతున్న సైనిక వర్క్‌షాపులు
రవి శర్మ .........29

9. వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న పర్యావరణ విధ్వంసం
షామిలా జోషి .........33



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ఫెడరలిజం

ఇండియా, అంటే భారత్, రాష్ట్రాల సమాఖ్య... అంటూ ప్రారంభమవుతుంది మన రాజ్యాంగంలోని మొదటి అధికరణం. భారత భూభాగం అంటే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, తదుపరి భారత్ కలుపుకునే ప్రాంతాలు అని కూడా నిర్వచించింది. మన రాజ్యాంగం కేంద్ర, రాష్ట్రాలకు మధ్య అధికారాలు, బాధ్యతలను స్పష్టంగా పంచడంతోపాటు వాటి పరిమితులు ఏమిటో కూడా నిర్ణయించింది. అవి తమ పరిధులు దాటినప్పుడు సుప్రీం కోర్టు, లేక రాష్ట్రాల హైకోర్టులు జోక్యం చేసుకుని రాజ్యాంగానికి అనుగుణంగా పరిస్థితిని చక్కదిద్దుతాయి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం నేడు సరిగ్గా రాజ్యాంగపు ఈ ఫెడరల్ స్వభావం మీద దాడిని ఎక్కుపెట్టింది. మొదటిది, రాష్ట్రాల పరిధిలోని అంశాలపై కేంద్రం ఏకపక్షంగా చట్టాలు చేస్తోంది. కార్మికకోడ్‌లు, నూతన వ్యవసాయ చట్టాలు, నూతన విద్యా విధానం వంటివన్నీ రాష్ట్రాలపరిధిలోనివే అయినా కేంద్రం చట్టాలు చేసింది. రెండు, జిఎస్‌టిని చేజిక్కించుకుని రాష్ట్రాల ఆదాయమార్గాలపై దెబ్బకొట్టింది. మూడు, అనేక పథకాలలో కేంద్ర వాటా తగ్గించడం ద్వారా ఆర్థిక భారాన్ని రాష్ట్రాలపై మోపుతున్నది. నాలుగు, అప్పుచేసుకోడానికి అనుమతులను అడ్డుపెట్టుకుని రాష్ట్రాలపై అనేక ప్రజా వ్యతిరేక చట్టాలను బలవంతంగా రుద్దుతున్నది. అయిదు, కాశ్మీర్ విభజన వంటి అంశాల్లో రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించి రాష్ట్రాల హక్కులు హరిస్తున్నది. ఆరు, తనకు ఇష్టంలేని ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై వివక్ష ప్రదర్శిస్తున్నది. ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలను సాగించుకోడానికి మోడీ ప్రభుత్వం కోర్టులను కూడా ప్రభావితం చేస్తున్నది. ఎందుకిలా చేస్తున్నది?

భారత పాలక వర్గాలకు నాయకత్వం వహిస్తున్న బడా బూర్జువా వర్గాలకు, విదేశీ పెట్టుబడిదారులకు సంక్షోభ కాలంలో కూడా గరిష్ట లాభాలు సమకూర్చడం కోసమే మోడీ ప్రభుత్వం ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు నిస్సిగ్గుగా పాల్పడుతున్నది. దేశంలోని అన్ని రంగాలూ ప్రయివేటు పరమయి, దేశవ్యాపితంగా ఒకే మార్కెట్ ఉంటే ఆ మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకుని లాభాలు పోగుచేసుకోవడం స్వదేశీ, విదేశీ కార్పొరేట్‌లకు సులువవుతుంది. ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆశలు, ఆకాంక్షలు వాటికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, చేసే చట్టాలు ఈ వర్గాల లాభాకాంక్షకు విరుద్ధమైనవి. అందుకే ఫెడరల్ వ్యవస్థను నాశనం చేసి, అధికారాలన్నీ కేంద్రం గుప్పెట్లో పెట్టుకోడానికి ఈ వర్గాలు స్వాతంత్ర్యానంతరం నిత్యం ప్రతియత్నిస్తూనే ఉన్నాయి. ఒకే దేశం, ఒకే జెండా, ఒకే భాష నినాదంతో దేశంలో మతతత్వ రాజ్యాన్ని నిర్మించడానికి పూనుకున్న ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి లక్ష్యానికీ, ఒకే మార్కెట్, ఒకే చట్టం నినాదంతో దేశాన్ని దోచుకోడానికి పూనుకున్న స్వదేశీ, విదేశీ కార్పొరేట్‌లకూ లంకె కుదిరింది గనుకనే బిజెపి అధికారంలోకి రావడానికీ, అధికారం నిలుపుకోడానికీ కార్పొరేట్ శక్తులు శాయశక్తులా ప్రోత్సహిస్తుంటే వారి దోపిడీకి బిజెపి అన్ని విధాలా సహకరిస్తోంది. మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తున్నదీ, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా చట్టాలు చేస్తున్నదీ, ఫెడరల్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదీ ఈ దోపిడీ శక్తుల కోసమే.

ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటన ప్రారంభమైంది. కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. రైతాంగం రెండు మాసాలుగా ఢిల్లీని ముట్టడించింది. ప్రజలు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ప్రజా ప్రతిఘటనలు గమనించే బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ నుండి ఒక్కో పార్టీ బయటికి వస్తున్నాయి. విచిత్రమేమంటే ఇలాంటి పరిస్థితుల్లో కూడా మన రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు - తెలుగు దేశం, వైసిపి- బిజెపి అనుగ్రహం కోసం పోటీ పడుతున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కింది స్థాయిలో ప్రజాఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలోని రెండు ప్రాంతీయ పార్టీల కళ్లు తెరిపించాలి, బిజెపి భరతం పట్టాలి.


**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా రూ. **120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# పార్లమెంటరీ - పార్లమెంటరీయేతర పోరాటాలు


**బివి రాఘవులు**

**బూ**ర్జువా పార్లమెంటరీ వ్యవస్థ ఉన్న దేశాలలో కమ్యూనిస్టులు పార్లమెంటరీ – పార్లమెంటరీయేతర పోరాటాలు, వీటి రెండింటి ప్రాధాన్యతలూ, వాటి మధ్య వుండాల్సిన సంబంధం గురించి చర్చించడం చూస్తాం. స్వాతంత్ర్యానంతరం మనదేశం కూడా పార్లమెంటరీ నమూనాను ఎంచుకున్నది. ఆనాటి నుండి ఈ పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థ పట్ల ఎటువంటి వైఖరి తీసుకోవాలన్న దానిపై కమ్యూనిస్టు పార్టీల మధ్య చర్చ జరుగుతున్నది. నగ్జలైట్ల పేరుతో ముందుకొచ్చిన వారు పార్లమెంటరీ వ్యవస్థను బహిష్కరించాలన్న వైఖరి తీసుకున్నారు. ఇప్పటికీ మావోయిస్టులు ఆ వైఖరినే కొనసాగిస్తున్నారు. మిగిలిన కమ్యూనిస్టు పార్టీలు తరతమ వ్యత్యాసాలతో ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. అయితే వీటిలో కూడా ప్రజా ఉద్యమంలో పార్లమెంటరీ రంగానికి, ఇతర రంగాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతలపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థ ఉనికిలో ఉన్న దేశాలలో దాని విషయమై మార్క్సిస్టు అవగాహనకు సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలు ఈ వ్యాసంలో చర్చిస్తాను.

రాజ్యం గురించి, బూర్జువా ప్రజాస్వామ్యం గురించి మార్క్సిస్టు అవగాహనను క్లుప్తంగా పరిశీలిద్దాం.

రాజ్యం వర్గ ఆధిపత్య సాధనం. రాజ్యం యొక్క రూపం ఏదైనా దాని సారాంశం మాత్రం వర్గ ఆధిపత్యాన్ని పరిరక్షించడమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం పెట్టుబడి ఆధిపత్యాన్ని నిలబెడుతుంది. రాజ్యం రూపం నిరంకుశత్వమైనా, ప్రజాస్వామ్యమైనా దాని స్వభావం అదే.

రాజరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో బూర్జువా ప్రజాస్వామ్యం రూపొందింది. ఫ్యూడల్ శక్తులను ప్రతిఘటించే సాధనాలుగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నినాదాలు ముందుకొచ్చాయి. ప్రస్తుతం మనం చూస్తున్న బూర్జువా ప్రజాస్వామ్య రూపం రావడానికి, దాన్ని అంగీకరించడానికి చాలాకాలం పట్టింది. చాలా ఉద్యమాలు, ఆందోళనలు అవసరం అయ్యాయి. సుదీర్ఘ ప్రయాణంలో బూర్జువా ప్రజాసామ్యం ఒక స్థూలమైన వ్యవస్థీకృత రూపం తీసుకుంది. నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు జరగడం, ఈ ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు ఎన్నికవడం జరుగుతుంది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కూడిన ప్రాతినిధ్య సంస్థలు వివిధ స్థాయిల్లో (మన దేశంలో పార్లమెంటు, శాసన సభ, జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయితీ) వుంటాయి. ఇది ప్రధానంగా 'శాసన' కార్యకలాపాలు నిర్వహిస్తే, ఈ సంస్థలు ఎంపిక చేసిన బృందాలు ప్రభత్వ నిర్వహణ బాధ్యతను నెరవేరుస్తాయి. ఈ మూడింటిని (ఎన్నికలు, ప్రాతినిధ్య సంస్థలు, ప్రభుత్వాలు) కలిపి పార్లమెంటరీ రంగం అంటారు. ఈ రూపాలు ఏర్పడడం కోసం ఆనాడు జరిగిన పోరాటాలన్నింటిలో అప్పుడప్పుడే ఆవిర్భవిస్తున్న కార్మికవర్గం చురుకైన పాత్ర నిర్వహించింది. కార్మికవర్గం, రైతాంగం తోడ్పాటే లేకపోతే బూర్జువావర్గం ఫ్యూడల్ నిరంకుశత్వంపై విజయం సాధించేదే కాదు.



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

ప్రజలకు, పేదలకు ఓటుహక్కు ఇవ్వడం ప్రమాదం అని పెట్టుబడిదారులు, వారి మేధావులు మొదట భావించారు. ఓటుహక్కుకై జరిగిన ఉద్యమాలను వ్యతిరేకించారు. 20వ శతాబ్దం ప్రారంభానికి గానీ సార్వజనీన ఓటుహక్కును ఎక్కువమంది ఆమోదించలేదు. అస్థిగల మగవారికే మొదట ఓటుహక్కు వుండేది. అనేక ఉద్యమాల తర్వాత మాత్రమే అస్థిలేని మగవారికి, మహిళలకు, బానిసలకు, నల్లజాతి వారికి ఓటుహక్కు వచ్చింది. సార్వజనీన ఓటుహక్కు ఉన్నా పెట్టుబడిదారీ ఆధిపత్యానికి ఇబ్బంది లేదన్న భావన అనుభవం ద్వారా పొందిన తర్వాతనే అటువంటి ఆమోదం లభించింది.

దోపిడీ, అణచివేతకు గురయ్యే వర్గాలు, తరగతులకు పరిపాలనలో పాత్ర లేకుండా దూరంగా వుంచేందుకు పెట్టుబడిదారీ వర్గం తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. చదువు, సంపద, సామర్థ్యం, నైపుణ్యం లేని ప్రజలు పరిపాలన చెయ్యలేరన్నది పాలకవర్గాల, మేధావుల వాదన. వారి పాత్రను పరిమితం చేసేందుకు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఉత్తమం అని భావించారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులు, వారితో ఏర్పడిన సభలు వర్గ ఆధిపత్యాన్ని దెబ్బతీయకుండా ఉండే విధంగా అనేక ఏర్పాట్లు చేశారు. శాసన, పరిపాలన న్యాయ విభాగాల మధ్య విభజన, రాజ్యాంగం ద్వారా అస్థిహక్కుకు రక్షణ, చట్టబద్ధ పాలన వగైరా అనేక మార్గాల ద్వారా ప్రజాస్వామ్య హక్కుల వలన ప్రమాదం లేకుండా చేసుకోగలిగారు. నిర్ణీత కాలంలో పరిపాలకులను మార్చుకోవడం, తమకు నచ్చిన పద్ధతిలో పరిపాలన చేసుకోవచ్చునే భ్రమలను ప్రజలకు కల్గించగల్గారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ప్రజలను ప్రేక్షక పాత్రకు

> “ కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు సరియైన అవగాహనతో వినియోగించుకున్నపుడే పార్లమెంటరీ రంగం విప్లవోద్యమానికి తోడ్పడుతుంది. పార్లమెంటరీ రంగ వర్గ స్వభావం, దాని పరిమితులు, దానిలో ఉండే ప్రమాదాలను విస్మరిస్తే వ్యవస్థలోకి ఇమిడిపోయి వర్గ సామరస్య ధోరణులు పెరుగుతాయి. కమ్యూనిస్టు పార్టీలలో పార్ల మెంటరీయిజం, పెడధోరణి పెరిగిపోయి వర్గపోరాటాన్ని మొద్దు బారుస్తుంది. పార్లమెంటరీ వ్యవస్థను విప్లవోద్యమానికి వినియో గించుకోవడం కాకుండా రాయితీలకు పరిమితమయ్యే స్థితి వస్తుంది. ఇది క్రమేణా విప్లవోద్యమం బలహీన పడడానికి దారితీస్తుంది. ”

పరిమితం చేస్తుంది. బూర్జువా వ్యవస్థ స్థిరంగా కొనసాగడంలో ముఖ్య పాత్ర నిర్వహిస్తుంది. అందుకే బూర్జువా ప్రజాస్వామ్యంలో ప్రజలకు కొన్ని ప్రజాస్వామిక హక్కులు ఉన్నా దాని అసలు సారాంశం బూర్జువా ఆధిపత్యమేనన్న విషయం వెల్లడించడం కోసం బూర్జువావర్గ నియంతృత్వం అన్న భావనను మార్క్సిస్టులు వాడడం జరిగింది.

విప్లవోద్యమ దృష్టిలో చూసుకున్నపుడు నిరంకుశ రూపాల కన్నా బూర్జువా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కొంత మెరుగైంది. దానిలో ప్రజాస్వామిక హక్కులు, సార్వజనీన ఓటింగ్ హక్కు, రాజ్యాంగం, చట్టబద్ధ పాలన వంటివి వుంటాయి. ఇది కార్మికవర్గ ఉద్యమానికి పీడిత వర్గాలు తమ పోరాటాలకు కొంతమేరకు ఉపయోగపడుతుంది.

అయితే ప్రజా ఉద్యమాల నుండి వర్గ ఆధిపత్యానికి ప్రమాదం వచ్చినప్పుడు ప్రజాస్వామిక హక్కులను, ఓటింగ్ హక్కును కాలరాయడానికి, నిరంకుశత్వం వైపు మళ్ళడానికి పాలక వర్గాలు వెనుకాడవు. అప్పుడు ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ సంస్థలపై దాడి జరుగుతున్నప్పుడు, వాటిని కాపాడుకోవడం కార్మిక వర్గం యొక్క కర్తవ్యం.

పార్లమెంటు రంగం విశాలమైన ప్రజానీకం చెంతకు తన వాణిని తీసుకువెళ్ళేందుకు ఉపయోగపడుతుంది. బూర్జువా పార్టీల భావజాల ప్రభావం నుండి ప్రజలను దూరం జేసేందుకు తోడ్పడుతుంది. పెట్టుబడిదారీ విధాన దుర్మార్గ స్వభావాన్ని, ప్రభుత్వ వర్గ స్వభావాన్ని ఎండగట్టవచ్చు. బూర్జువా పార్టీల కార్యక్రమాలతో వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల కార్యక్రమాలను పోల్చి వివరించవచ్చు. సోషలిజం ఔన్నత్యాన్ని, సామ్రాజ్యవాద దుష్టత్వాన్ని వివరించవచ్చు. ఈ కృషి ద్వారా బూర్జువా పార్లీమెంటరీ వ్యవస్థ పరిమితులను బహిర్గతం జేసి ప్రజల్లోని భ్రమలను తొలగించవచ్చు.

ఎన్నికల సందర్భాలు మెజారిటీ ప్రజలను చేరుకోవడానికి, వారిని చైతన్యపర్చడానికి, సంఘటితం చేసుకునేందుకు వినియోగపడతాయి. ప్రాతినిధ్య సంస్థల్లో ప్రవేశించిన కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు, కార్మిక, కర్షక, తదితర పీడిత వర్గాల ప్రయోజనాలను ఛాంపియన్ జేయవచ్చు. ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం, నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా బలహీనవర్గాల పీడన, అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను ప్రాతినిధ్య సంస్థల్లో ప్రజాప్రతినిధులు ప్రతిబింబించవచ్చు. ప్రతిధ్వనింపజేయవచ్చు.

వివిధ స్థాయిల్లో ప్రభుత్వాలను, పరిపాలనా సంస్థలను నిర్వహించే అవకాశం వచ్చినప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ ప్రభుత్వాల ద్వారా మౌలిక మార్పు తీసుకురావడం సాధ్యం కాకపోయినా, విప్లవోద్యమ పురోగమనానికి వినియోగించవచ్చు. నిజమైన అధికారం బూర్జువా, భూస్వామ్య వర్గాల చేతుల్లో ఉందన్న విషయం ప్రజలకు చెప్పి వారి చైతన్యాన్ని పెంచవచ్చు.

పైన పేర్కొన్న ప్రయోజనాలన్నీ ఉన్నప్పటికీ, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు సరియైన అవగాహనతో వినియోగించుకున్నపుడే పార్లమెంటరీ రంగం విప్లవోద్యమానికి తోడ్పడుతుంది. పార్లమెంటరీ రంగం యొక్క వర్గ స్వభావం, దాని పరిమితులు, దానిలో ఉండే ప్రమాదాలను విస్మరిస్తే వ్యవస్థలోకి ఇమిడిపోయి వర్గ సామరస్య ధోరణులు పెరుగుతాయి. కమ్యూనిస్టు పార్టీలలో పార్లమెంటరీయిజం, పెడధోరణి పెరిగిపోయి వర్గపోరాటాన్ని మొద్దుబారుస్తుంది. పార్లమెంటరీ వ్యవస్థను విప్లవోద్యమానికి వినియోగించుకోవడం కాకుండా రాయితీలకు పరిమితమయ్యే స్థితి వస్తుంది. ఇది క్రమేణా విప్లవోద్యమం బలహీనపడడానికి దారితీస్తుంది.

ఇటువంటి పరిస్థితి దాపురించకుండా ఉండాలంటే బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ స్వభావాన్ని, పాలకపార్టీల వర్గ స్వభావాన్ని ప్రజల ముందు బట్టబయలు చేయడం ఒక ముఖ్య లక్ష్యం. ప్రజలలో ఉన్న భ్రమలను దృష్టిలో ఉంచుకుని వారి చైతన్యాన్ని పెంచాలి. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి.

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

కమ్యూనిస్టులు ఈ వ్యవస్థలోకి ప్రవేశించినపుడు, అది ప్రజలపై విధించే పరిమితులను బద్దలు కొట్టాలి. ప్రజల పాత్రను బుద్ధిపూర్వకంగా అభివృద్ధి చేయాలి. అప్పుడే ప్రజా చైతన్యం పెరుగుతుంది. పరిపాలనా వ్యవస్థ స్వభావాన్ని స్వీయానుభవం నుండి ప్రజలు గమనించేటట్లు చేయగలం.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ముసుగును తొలగించాలంటే ప్రజలకు వాస్తవాలు తెలియాలి. వాస్తవాలను, సమాచారాన్ని ప్రజల ముందుంచాలి. అవసరం వచ్చినప్పుడు చెప్పడం కాకుండా ప్రజలకు నిరంతరం సమాచారం అందించేట్లుగా వ్యవస్థాగత ఏర్పాట్లు చేయాలి.

బూర్జువా రాజ్యాంగ యంత్రాంగంలో ఉండే సహజసిద్ధమైన వర్గ స్వభావం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రెడ్‌టేపిజం వగైరాలను ఎదిరించేందుకు మనం బాధ్యతల్లో వున్న చోట మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రజలను పాలనా విషయాలలో నిరంతరం కదిలించాలి.

ప్రజాప్రాతినిధ్య సంస్థల్లో ప్రవేశించిన కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ఈ సంస్థలను ఆందోళనా వేదికలుగా ఉపయోగించుకోవాలి. వాటి వర్గ స్వభావాన్ని బట్టబయలు చేయాలి. బయట జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు లోపల ప్రాతినిధ్యం వహించేట్లుగా ఉండాలి. ప్రభుత్వాలను పోరాట సాధనాలుగా వినియోగించుకోవాలి. ప్రజా ఉద్యమ అభివృద్ధికి, ప్రజా సమీకరణ చెయ్యడానికి, బూర్జువా వ్యవస్థ అసలు రంగు బట్టబయలు చేయడానికి సాధనంగా వినియోగించుకోవాలి. అవకాశం వున్న మేరకు ప్రజలకు మేలు జేసే సంక్షేమ చర్యలు తీసుకోవాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూలమైన మార్పు కోరే శక్తులకు చెందిన ప్రజాప్రతినిధులు నిరంతరం జాగరూకతో ఉండాలి. బూర్జువావర్గ ప్రయోజనాలకు తగినట్లుగా ప్రజాప్రతినిధులు వ్యవహరించేట్లు చేయడానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అనేక అవకాశాలున్నాయి. అనేక విధాల రాజ్యమే ప్రలోభాలు కల్పిస్తున్నది. సరళీకరణ విధానాలు ప్రవేశించిన తర్వాత పార్లమెంటరీ వ్యవస్థల నామకా చేయడంతో పాటు ప్రజాప్రతినిధులను లోబర్చుకోవడం ఎక్కువైంది. తమ వ్యవస్థలోకి కోఆప్ట్ చేసే అన్ని పద్ధతులు, ప్రయత్నాలను ఛేదించుకుంటూ పనిచేయాలి. ప్రజా ప్రతినిధుల ప్రయోజనం బయట ప్రజా పోరాటాల

# వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

(రూలు 8వ ఫారం IV ప్రకారం)

మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు

| | | |
|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం : | విజయవాడ |
| 2. | ఏ రకమైన పత్రిక : | మాసపత్రిక |
| 3. | ముద్రాపకుని పేరు: | బి.వి.రాఘవులు |
| | చిరునామ : | 1-1-60/2,ఎం.బి.భవన్,<br>ఆర్.టి.సి క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ -20. |
| 4. | ప్రచురణ కర్త పేరు : | బి.వి.రాఘవులు |
| | చిరునామ : | 1-1-60/2,ఎం.బి.భవన్,<br>ఆర్.టి.సి క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ -20. |
| 5. | సంపాదకుని పేరు : | ఎస్.వెంకట్రావు |
| | చిరునామ : | డోర్.నెం.27-30-4<br>ఎమ్.బి.విజ్ఞానకేంద్రం<br>గవర్నర్‌పేట,<br>విజయవాడ - 520002 |
| 6. | పత్రిక యాజమాన్యం : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)<br>ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, |

బి.వి.రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు శ్వసనీయమైనవని ఇందు మూలముగా తెలియజేస్తున్నాను.

సం/-

**బి.వి.రాఘవులు**

**ప్రచురణ కర్త**

అభివృద్ధిపై, వాటితో అనుసంధానంపై ఆధారపడి వుంటుంది.

రాజ్యంలో అనేక భాగాలున్నాయి. వాటన్నింటిలో (సైన్యం, పోలీసు, నిరంకుశాధికార బృందం, న్యాయవ్యవస్థ వగైరా) ఆధిపత్య స్థానం లేకుండా ప్రజా ప్రతినిధులలో ఆధిక్యం, కార్యనిర్వాహకవర్గ స్థానాలు పొందగానే రాజ్యం అధీనంలోకి వచ్చింది అనుకోకూడదు. ప్రాతినిధ్య సంస్థలు నిరంతరం మారుతుంటాయి. కానీ మిగిలిన భాగాలు శాశ్వతంగా ఉంటాయి. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకు సమర్థవంతంగా రూపొందించిన మొత్తం రాజ్య వ్యవస్థను ధ్వంసం చెయ్యకుండా కార్మికవర్గం సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి పూనుకోవటం సాధ్యం కాదు. రాజ్యాన్ని ధ్వంసం చెయ్యకుండా, సోషలిస్టు వ్యవస్థను నిర్మించటం సాధ్యమవుతుంది అన్న భ్రమకు కమ్యూనిస్టు పార్టీలు లోనుకావటం పెట్టుబడిదారీ వ్యవస్థకు భద్రత కలిగించటానికి దారితీస్తుంది. కమ్యూనిస్టు పార్టీ పీడిత ప్రజలకు దూరమై బలహీనపడిపోవటం జరుగుతుంది. అవకాశవాద, సంస్కరణవాద పార్టీగా దిగజారి, వర్గ సంఘర్షణను, ప్రజల సమీకరణను పెంచే విప్లవ స్వభావాన్ని కోల్పోతుంది.

> **" అభివృద్ధి చెందిన బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థలలో అధికారం నిరంకుశప్రభుత్వాలలో మాదిరిగా రాజ్య విభాగాలలోనే కేంద్రీకృతమయి ఉండదు. పౌర సమాజంలోని అనేక వ్యవస్థల్లో వికేంద్రీకరించబడి ఉంటుంది (మీడియా, విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వ్యవస్థలు వగైరా). ఈ వ్యవస్థలన్నీ పెట్టుబడిదారీ వర్గాన్ని రక్షించడానికి పనిచేస్తాయి. అందువలన రాజ్యంలోని అన్ని రంగాలలో - రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక, సాంస్కృతిక రంగాలన్నింటా కార్మిక ఉద్యమం సాధించాల్సి ఉంటుంది. "**

అంతేకాక అభివృద్ధి చెందిన బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థలలో అధికారం నిరంకుశ ప్రభుత్వాలలో మాదిరిగా రాజ్య విభాగాలలోనే కేంద్రీకృతమయి ఉండదు. పౌర సమాజంలోని అనేక వ్యవస్థల్లో వికేంద్రీకరించబడి ఉంటుంది (మీడియా, విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వ్యవస్థలు వగైరా). ఈ వ్యవస్థలన్నీ పెట్టుబడిదారీ వర్గాన్ని రక్షించడానికి పనిచేస్తాయి. అందువలన రాజ్యంలోని ఒక భాగంలో స్థానం సంపాదించినంత మాత్రాన పెట్టుబడిదారీ రాజ్యంపై ఆధిపత్యం సంపాదించినట్లు కాదు. అన్ని రంగాలలో – రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక, సాంస్కృతిక రంగాలన్నింటా కార్మిక ఉద్యమం సాధించాల్సి ఉంటుంది. అందుకే వర్గ పోరాటం అంటే పార్లమెంటరీ రంగంలో పోరాటం ఒక్కటే కాదు. అది రాజకీయ పోరాటంలో ఒక భాగం మాత్రమే. వాస్తవంగా మిగతా పోరాటాలన్నింటికీ తోడ్పడే సహాయ వేదికగా పార్లమెంటరీ రంగం ఉండాలి. ఈ విషయన్నే మనం పార్లమెంటరీ పోరాటాలను, పార్లమెంటీయేతర పోరాటాలను మేళవించాలని చెపుతుంటాము.

ఈ అంశాన్ని విస్మరించటమంటే బూర్జువా ప్రజాస్వామ్యంలో ఉండే అవకాశాలను మాత్రమే గమనంలో ఉంచుకుని, దాని వర్గ ఆధిపత్యాన్ని విస్మరించటం అవుతుంది. పార్లమెంటరీ కృషికి బయట ప్రజా ఉద్యమాలను తోడు చేయకపోతే బూర్జువా ప్రజాస్వామ్యంలో పాలక పార్టీలు ప్రజలను ప్రేక్షక పాత్రకు పరిమితం చేసినట్లే, కమ్యూనిస్టులు కూడా ప్రజలను ప్రేక్షక పాత్రకు పరిమితం చేయడమే అవుతుంది. ఈ రకంగా బూర్జువా ప్రజాస్వామ్య భ్రమలకు ప్రజలను వదిలివేయడం అవుతుంది.

---

# ఆగ్జిల్లరీ గ్రూపుల పని విధానం

(14వ పేజీ తరువాయి)

తగిన ఫలితాలు సాధించగలం. కనీసం రెండు గంటలు జరుగకుండా ఆగ్జిల్లరీ గ్రూపు ఫలప్రదం కాదు. ఒక్కొక్కరి మీద వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలి. కుటుంబ పరిస్థితి, ఉద్యమంలో పాత్ర, క్రమశిక్షణ, అధ్యయనం పరిశీలించాలి. ముఖ్యంగా పార్టీ పత్రిక చదివేటట్టు ప్రోత్సహించాలి.

పార్టీ సభ్యత్వం చేర్పించటం నిరంతర ప్రక్రియ. తగు స్థాయి లేనివారిని తొందరపడి తీసుకోవద్దు. స్థాయి ఉన్నవారికి సభ్యత్వం ఇవ్వటం ఆలస్యం చేయవద్దు. స్థాయి లేకున్నా సభ్యత్వం ఇస్తే సభ్యత్వం పునరుద్ధరణ సందర్భంగా డ్రాపౌట్స్ కూడా అదే మోతాదులో ఉంటాయి. ఇది ఏడాదికి ఒకసారో లేదా రెండుసార్లో చేయవలసిన పని మాత్రమే కాదు. జనవరిలో ప్రారంభించిన ఆగ్జిల్లరీ గ్రూపులు సక్రమంగా నిర్వహించగల్గితే, మే 19 సుందరయ్య వర్ధంతి సందర్భంగా, అర్హులకు సభ్యత్వం ఇవ్వవచ్చు. స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మే 19న మిస్సైనవారికి జులై 4న, దొడ్డి కొమరయ్య అమరుడైన రోజున ఇవ్వవచ్చు. మే లేదా జూన్‌లో ప్రారంభించిన ఆగ్జిలరీ గ్రూపుల నుంచి అర్హులైనవారికి నవంబర్ 7న, రష్యా విప్లవ దినోత్సవ సందర్భంగా సభ్యత్వం ఇవ్వవచ్చు.

స్టడీసర్కిల్‌లో పాల్గొనేవారికి గానీ, ఆగ్జిల్లరీ సభ్యులకు గానీ బోధించే కామ్రేడ్ బాధ్యతగా వ్యవహరించాలి. ఆశక్తికరమైన విధంగా వారితో చర్చించడం ద్వారా బోధించాలి. ఆశువుగా ఉపన్యాసం చేయవద్దు. అక్కడా..ఇక్కడా విన్న విషయాలు చెప్పే పద్ధతి అనుసరించకూడదు. తగువిధంగా సన్నద్ధం కావాలి. ప్రత్యేకంగా చదవాలి. నోట్స్ రాసుకోవాలి. సరైనవిగా నిర్ధారించుకున్న విషయాలే చెప్పాలి. విప్లవ చైతన్యంగల పార్టీ సభ్యులను తయారుచేస్తున్నామన్న స్పృహతో తయారుకావాలి.

ఆగ్జిల్లరీ సభ్యులు పార్టీ సభ్యులు కాదు. పార్టీ సానుభూతిపరులు. వీరిని పార్టీ సభ్యులుగా తయారుచేయటం కోసం నడిపేదే ఆగ్జిల్లరీ గ్రూపు. అందువల్ల పార్టీ శాఖ వేరు, ఆగ్జిల్లరీ గ్రూపు వేరు. ఈ రెండింటినీ కలిపి నిర్వహించకూడదు. ఆగ్జిల్లరీ గ్రూపును ప్రత్యేకంగా, విడిగా నడపాలి. ❊

ఈ మాసం ప్రత్యేకం

# భారత వ్యవసాయం ఆధునీకరణలో ప్రత్యేక వైరుధ్యాలు

**కె. దీపక్**

**(ఫ్రంట్‌లైన్ సౌజన్యంతో)**

రైతాంగానికి, ప్రభుత్వానికి నడుమ అంతకంతకూ తీవ్రమౌతున్న ప్రతిష్టంభన కొన్ని విడివిడిగా ఉన్న విధానపరమైన చర్యల విషయంలో మాత్రమే కాదు. భారతదేశంలో వ్యవసాయం ఆధునీకరణ పంథాలో ప్రత్యేకంగా ఉన్న వైరుధ్యాల వ్యక్తీకరణ కూడా.

మన దేశంలోని వ్యవసాయ సంక్షోభం వ్యవస్థల నిర్లక్ష్యం వలనో, అసమర్ధత ఫలితంగానో ఏర్పడినదని తరచూ భావిస్తుంటారు. కాని అది వాస్తవం కాదు. మన రాజ్య వ్యవస్థ చైతన్యయుతంగా పాటిస్తున్న రాజీ వైఖరి అసలు కారణం. పాలకవర్గాల తక్షణ ప్రయోజనాలను పరిరక్షించడంకోసం అవి దూరదృష్టి లేకుండా చేస్తున్న డిమాండ్లను నెరవేర్చడం కోసం రాజ్య వ్యవస్థ ఈ రాజీకి పూనుకుంటోంది. దీని ఫలితంగా మొత్తంగా జరగవలసిన సమాజ పురోగతికి ముప్పు వాటిల్లుతోంది. దాని వలన కోట్లాదిమందిపై మోయలేని భారాలు పడుతున్నాయి. పేదరికం, వివక్షల ఫలితంగా మన వనరులను కోల్పోతున్నాం.

ప్రస్తుతం కొనసాగుతున్న ఆందోళనలో రైతాంగం ఆగ్రహానికి లక్ష్యంగా ఉన్న మూడు వ్యవసాయ చట్టాలూ ఇందుకు భిన్నమైనవేమీ కావు. వ్యవసాయ మార్కెటింగ్‌ను సంస్కరించే మహదాశయంతోటే ఈ మూడు చట్టాలూ తెచ్చినట్టు గొప్పగా చెప్పుకుంటున్నా, బడా పెట్టుబడికి, గ్రామీణ వ్యవసాయ వర్గాలలో ఉన్నత తరగతులకు లాభాలను తెచ్చిపెట్టే కొత్తదారులను తెరవడానికే ఇవి వచ్చాయి. దీనికి రైతాంగంలో చాలా ఎక్కువ మంది, కార్మికులు, చిల్లర వ్యాపార వ్యవస్థలో చిన్న పెట్టుబడిదారులు భారీగా మూల్యం చెల్లించుకోవలసివస్తుంది. స్వతంత్రం తర్వాత జరిగిన అభివృద్ధి క్రమాన్ని దెబ్బతీసిన వైరుధ్యాలను ఇవి మరింత తీవ్రతరం చేస్తాయి. దానివలన మార్కెట్ యొక్క సామాజిక పునాది మరింత చిక్కిపోతుంది. ఐతే, ఈ చట్టాలకు తెగువతో పోరాడుతున్న రైతాంగం నుండి గట్టి ప్రతిఘటన ఎదురౌతోంది. ఈ వైరుధ్యాలకు వ్యతిరేకంగా వారు విస్తృత ప్రజానీకంలో వ్యతిరేకతను నిర్మించగలుగుతున్నారు. చాలా కాలం నుండీ రగులుతున్న ఈ వైరుధ్యాలకు సృజనాత్మకమైన, ప్రజాతంత్రయుతమైన, నిలకడైన పరిష్కారం వైపుగా ఈ ప్రతిఘటన సాగుతోంది.

**సంక్షోభం, వైరుధ్యాలు**

ఈ చట్టాల పరిధి, వాటిచుట్టూ జరుగుతున్న చర్చలు ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తులు ధర నిర్ణయ యంత్రాంగం, సేకరణ, మార్కెటింగ్ – ఈ మూడింటిపై కేంద్రీకరింపబడ్డాయి. కొత్త వ్యాపార అవకాశాలను కోరుతున్న బడా పెట్టుబడికి అనుకూలంగా ఉండేలా ఇవి రూపొందిచబడ్డాయి. ఐతే మన దేశ వ్యవసాయానికి చెదలు ఇంతకుముందే పట్టాయి. వ్యవసాయ సరుకుల ఉత్పత్తిలో ప్రపంచస్థాయిలోనే ఒక ముఖ్యమైన స్థానాన్ని మన దేశం కలిగివుంది. చైనా తర్వాత రెండో స్థానం మనదే. 2018లో 17.2 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 9.97 కోట్ల మెట్రిక్ టన్నుల గోధుమను మనం ఉత్పత్తి చేశాం.

(ఎఫ్ ఎ ఒ గణాంకాల ప్రకారం) కోటి ఐదు లక్షల టన్నుల పప్పు ధాన్యాలను పండించి ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉన్నాం. మన దేశంలోని భౌగోళిక వాతావరణం, మన మానవ శ్రమ ఇందుకు ప్రధాన కారణం. ఐతే ఒక హెక్టారుకు చైనాలో పండే వరి ధాన్యంలో 55 శాతం మాత్రమే మన దగ్గర పండుతుంది. అదే గోధుమ ఐతే 62 శాతం. పప్పు ధాన్యాల విషయంలో దిగుబడిలో ప్రథమ స్థానంలో ఉన్న మయన్మార్‌తో పోల్చితే 26 నుండి 60 శాతం మాత్రమే హెక్టారుకు మన దేశంలో పండుతాయి.

మన దేశ జనాభాతో, మన పంటలకు వచ్చే ధరలతో కలిపి లెక్కిస్తే (అంతర్జాతీయ మారకపు రేట్లను, కొనుగోలు శక్తిని, సగటు సరుకు ధరలను పరిగణించి లెక్కిస్తారు. దానిని గియరీ–ఖామిస్ డాలర్ అంటారు.) మన తలసరి వ్యవసాయోత్పత్తి విలువ 305 ఇంటర్నేషనల్ డాలర్లు కాగా చైనా ది 630 ఉంది. మనతో పోల్చదగ్గ దేశం పాకిస్తాన్. అక్కడ ఇది 302. అంటే మన రైతు తలసరి ఆదాయం చైనా రైతు తలసరి ఆదాయం కన్నా సగం కంటే కూడా తక్కువే. వివిధ ప్రాంతాలలో, వివిధ తరగతుల రైతాంగంలో దీని పర్యవసానాలు వేరువేరుగా ఉంటాయి. ఐతే ఈ దౌర్భాగ్య పరిస్థితికి మన దేశ రాజ్య వ్యవస్థ చారిత్రికంగా చేసుకున్న రాజీలు కారణం. ఈ రాజీల ఫలితంగా తలెత్తిన సామాజిక పరిస్థితులు వ్యవసాయరంగ ప్రగతికి వ్యవస్థీ కృతంగానే పరిమితులు విధించాయి. వ్యవసాయానికి దాదాపుగా ప్రభుత్వ మద్దత్తు ఉపసంహరించుకోవడంతో పరిస్థితులు మరింత దిగజారాయి.

మన రాజ్య వ్యవస్థ గ్రామీణ పాలకవర్గ ప్రయోజనాలకు లొంగిపోయి (భూస్వాముల ప్రయోజనాలకు) వ్యవహరించడంతో స్వాతంత్ర్యానంతర ఆధునీకరణ కార్యక్రమం మసకబారి, వెనకబడిన సామాజిక ఆర్థిక పరిస్థితుల చట్రానికి పరిమితం అయిపోయింది. వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమం సమరశీలంగా సాగడానికి ఒక కారణం భూసంస్కరణలు అనే డిమాండు. స్వతంత్రం వచ్చాక దేశం విస్తృత స్థాయిలో పురోగమించాలంటే అవశ్యంగా భూపంపిణీ జరగాలి. కాని, భూసంస్కరణలు రూపొందిన తీరు, అమలు జరిగిన తీరు ఆ డిమాండుకు ద్రోహం చేసింది. భూస్వామ్యవర్గాల ఆధిపత్యం

కొనసాగేందుకు అవసరమైన భౌతిక ప్రాతిపదికను పదిలంగా కొనసాగించారు. ఆ ఆధిపత్యానికి లోబడే వ్యవసాయంలోగాని, గ్రామీణ సమాజంలోగాని ఎటువంటి సంస్కరణలైనా జరగాలి. ఆ గ్రామీణ వ్యవస్థ వ్యవసాయంలో భారీగా పెట్టుబడులు రాకుండా నిరోధించింది. ఆ పెట్టుబడికి తగిన ప్రతిఫలం రాని స్థితిని కల్పించింది. ఎక్కువ కౌలు వసూలు చేయడం ద్వారా, హీనమైన కూలిరేట్ల చెల్లింపు ద్వారా అదనపు విలువను రాబట్టుకునే పరాన్నభుక్కు వంటి గ్రామీణ పాలకవర్గాన్ని అది కలిగివుంది. ఈ వ్యవస్థలో రైతాంగంలో ఎక్కువ తేడాలుగల దొంతరలు ఏర్పడ్డాయి. తమ కుటుంబ సభ్యుల శ్రమతోనే ప్రధానంగా వ్యవసాయం సాగిస్తూ పెట్టిన ఖర్చుల వరకూ వ్యవసాయం నుండి తిరిగి రాబట్టుకోగలిగిన రైతాంగం ఎక్కువ భాగం ఉన్నారు. అందువలన వారివద్ద ఎటువంటి మిగులూ లేకుండా పోయింది. వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి అవసరమైన పెట్టుబడి వారికి సమకూరలేదు. వీరుగాక, చారిత్రికంగా సమస్తమూ కోల్పోయిన కులాలకు చెంది, క్రూరమైన వివక్షతకు, హింసకు, పేదరికానికి గురైన శ్రామికులు మరో పెద్ద భాగం. కౌలుదోపిడీ ఆర్థిక పురోగతికి పెద్ద ఆటంకం. ముక్కచెక్కలై, గిట్టుబాటులేని సాగు, తక్కువస్థాయి వేతనాలు, సామాజిక, సాంస్కృతిక నేపథ్యం (దీనినే, బిఆర్ అంబేద్కర్ స్థానికత అనే మురికికూపం, అజ్ఞానం అనే చీకటిగుహ, సంకుచిత తత్వం అని అభివర్ణించారు) పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో కొంత మార్పు చెందినా, మన గ్రామీణ ప్రాంతాలు ఆధునికాభివృద్ధి క్రమంలో పురోగమించడానికి గల అవకాశాలన్నింటినీ నీరుగార్చేశాయి. ఒక ముక్కలో చెప్పాలంటే, మన సమాజం చెల్లించిన భారీ మూల్యంతో భూస్వామ్యవర్గం తన ఆధిపత్యాన్ని గట్టిపరుచుకుంది. దానితోబాటు, ఈ పరిస్థితులు ఆ భూస్వామ్య వర్గం భవిష్యత్తులో సంపదను పోగేసేందుకు సైతం పరిమితులను విధించాయి.

హరిత విప్లవం సాధించిన విజయాలను, దానికున్న పరిమితులను, ఆ హరిత విప్లవం అమలు జరిగే క్రమంలో రూపొందిన సంస్థాగత నిర్మాణాలను, అవి నయా ఉదారవాద శకంలో క్రమంగా పరిణామం చెందిన వైనాన్ని ఈ నేపథ్యంలో మనం అర్థం చేసుకోవాలి. ఈ అభివృద్ధి క్రమం పర్యవసానంగా "పంపిణీ" లో ఏర్పడిన తీవ్రమైన ఆంక్షలను నూతన వ్యవసాయ వ్యూహం తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. హరిత

> **❝ హరిత విప్లవం ఎక్కువ దిగుబడులను సాధించే వరి, గోధుమ వంగడాలను ప్రోత్సహించింది. రుణాలను అందించేందుకు ప్రభుత్వ సంస్థలను ఏర్పరచింది. వ్యవసాయ పరిశోధన, విస్తరణ, మార్కెటింగ్‌కు ప్రభుత్వ సంస్థలు ఏర్పడ్డాయి. ఈ చర్యల ఫలితంగా ఉత్పాదకతలో గణనీయమైన అభివృద్ధిని సాధించగలిగారు. త్వరగా స్పందించే, రాజకీయంగా తన ఉనికిని చాటుకోగలి గిన ధనిక రైతాంగం తెరమీద కొచ్చింది. అభివృద్ధి ఉన్నా, అది చిన్నపాటి సామాజిక వర్గానికే పరిమితం అయింది. ❞**

విప్లవం ఎక్కువ దిగుబడులను సాధించే వరి, గోధుమ వంగడాలను వినియోగించడాన్ని ప్రోత్సహించింది. రుణాలను అందించేందుకు ప్రభుత్వ సంస్థలను ఏర్పరచింది. వ్యవసాయ పరిశోధనలకు, విస్తరణకు, మార్కెటింగ్‌కు కూడా ప్రభుత్వ సంస్థలు ఏర్పడ్డాయి. ఈ చర్యల ఫలితంగా ఉత్పాదకతలో గణనీయమైన అభివృద్ధిని సాధించగలిగారు. త్వరగా స్పందించే, రాజకీయపరంగా తన ఉనికిని చాటుకోగలిగిన ధనిక రైతాంగం తెరమీద కొచ్చింది. అభివృద్ధి గణనీయంగా ఉన్నా, ఆ అభివృద్ధి చిన్నపాటి సామాజిక వర్గానికే పరిమితం అయింది. ఆ అభివృద్ధి ఎగుడు దిగుడుగా జరిగింది. కుల పరంగా, వర్గ పరంగా, ప్రాంతీయంగా తీవ్ర అసమానతలు ఏర్పడ్డాయి. 20వ శతాబ్దం ముగింపుకు వచ్చేసరికి హరిత విప్లవం కొత్తగా పురోగమించే పరిస్థితులు లేకుండాపోయాయి. ఆ తర్వాత కాలంలో నయా ఉదారవాద సిద్ధాంతపు వత్తిడి పెరిగింది. పారిశ్రామిక గుత్త పెట్టుబడి దారులకు, ఫైనాన్సు పెట్టుబడికి లాభాలు సమకూర్చడం రాజ్యవ్యవస్థకు అనివార్యం అయింది. దాని ఫలితంగా ఒకటొకటిగా వ్యవసాయరంగానికి మద్దత్తుగా ఏర్పడిన వ్యవస్థలను తొలగించడం మొదలైంది. ఇటువంటి విధానాలు మన దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా అమలుకాసాగాయి. వ్యవసాయ రంగం ఆర్థికంగా నిలదొక్కుకోడానికి తప్పనిసరిగా అవసరం అయిన రాజ్య మద్దత్తు వ్యవస్థలు ఒకటొకటిగా అదృశ్యం కావడంతో వ్యవసాయంపై ఆధారపడినవారిలో అత్యధికుల జీవనోపాధి సంక్షోభంలో పడింది. విస్తృత ప్రజానీకం దరిద్రులవసాగారు. ప్రస్తుతం ప్రభుత్వం మార్కెటింగ్ వ్యవస్థ రద్దును ప్రతిపాదిస్తే దానికి కేవలం ధనిక రైతాంగం నుంచి మాత్రమే గాక వ్యవసాయ పనులలో ఉండే కూలీల నుండి కూడా వ్యతిరేకత రావడానికి పేదరికం ఎక్కువ తరగతులను ఆవరించడమే కారణం.

వ్యవసాయ రంగం అభివృద్ధికి ఈ విధంగా సంకెళ్ళు ఉండడం తాలూకు పర్యవసానాలు ఆ రంగానికి మాత్రమే పరిమితం కావు. మన మొత్తం ఆర్థిక వ్యవస్థలో దీనివలన అటు సరఫరాకు, ఇటు డిమాండ్‌కు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి. వినిమయ వస్తువుల తలసరి డిమాండ్ చాలా అల్పంగా ఉంది. అందువలన వ్యవసాయేతర ఆర్థిక రంగాలలో లాభాలు వచ్చే అవకాశాలు బాగా కుదించుకుపోయాయి. ఇక బడా పెట్టుబడిదారీ వర్గం దృక్పథం నుండి చూసినపుడు అవి ప్రారంభించిన రిటైల్ దుకాణాల నెట్‌వర్క్‌కు అవసరమైన డిమాండ్ రావడంలేదు. వెనకబడి, ముక్కచెక్కలుగా ఉన్న మన వ్యవసాయ రంగం బడా పెట్టుబడి అవసరాలను తీర్చగలిగే పరిస్థితి లేదు. ఇప్పటికే ఈ రిటైల్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టివున్న బడా పెట్టుబడిదారీ వర్గం తన భవిష్యత్తు లాభాలకోసం ఈ రంగంమీదనే చాలా ఆశలు పెట్టుకుంది. ఆ ఆశలను తీర్చేపనిలో భాగంగానే ప్రభుత్వం కొత్త చట్టాలను తెచ్చింది. వ్యవసాయ రంగాన్ని మొత్తంగా అభివృద్ధిచేసి, దీర్ఘకాలం పాటు నిలకడగా లాభాలు సంపాదించడం అనే లక్ష్యం మన బడా పెట్టుబడిదారులకు లేదు, పరిమితంగా ఉన్న మార్కెట్‌లోనే స్వల్పకాలంలో ఎంత ఎక్కువ లాభాలను పిండుకోగలిగితే అంత పిండుకోవాలి అన్నదే ఆ వర్గం యావ **అంతా.**

### సంస్కరణలు

మన దేశ వ్యవసాయ రంగం వెనుకబాటుకు ప్రధానకారణం మన ఉత్పత్తి చాలా పరిమితంగా ఉండడం. ఈ మౌలిక సమస్యను పక్కనబెట్టి కేవలం మార్కెటింగ్ వ్యవస్థలోనే సంస్కరణలను తీసుకురావడానికి ప్రస్తుత చట్టాలు పూనుకున్నాయి. ఉత్పత్తిదారులైన రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం కాకుండా ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న కార్పొరేట్ రిటైల్ నెట్‌వర్క్ విస్తరించి బలపడడానికి తోడ్పడడమే

> **❝ పాత విధానంలో కనీస మద్దత్తు ధర కారణంగా ధరలు ఉత్పత్తి ఖర్చులతో ముడిపడివున్నాయి. కాని కొత్త విధానంలో అంతిమంగా వినియోగదారుడు ఏ రేటు చెల్లించి కొంటాడో అందులోనుంచి సరుకుల రవాణాకు, నిల్వ చేయడానికి, తమ లాభాలకు మిగుల్చుకుని తక్కినదే రైతుకు ధరగా చెల్లిస్తారు. లావాదేవీలలో ఎవరికి బేరా లాడే శక్తి అధికంగా ఉంటుందో వారు అవతలి వారిమీదకు భారాలను నెట్టివేస్తారు. ❞**

ఈ చట్టాల లక్ష్యంగా ఉంది. ఎలక్ట్రానిక్స్, రెడీమేడ్ దుస్తులు తదితర వినిమయ సరుకుల రిటైల్ రంగంలో బడా పెట్టుబడిదారులు కొత్త వెంచర్లను ప్రారంభించడం, ఇతర కంపెనీలను కొనుగోలు చేసి విలీనం చేసుకోవడం వంటివి ఇటీవల పెద్ద ఎత్తున జరిగాయి. ఐతే వంటింటి నిత్యావసర సరుకులు మన దేశ రిటైల్ మార్కెట్‌లో రాలా పెద్ద భాగం. సగటు భారతీయుడు పెట్టే ఖర్చులో తిండికోసం చేసే ఖర్చుదే సింహభాగం. బడా కార్పొరేట్ల రిటైల్ నెట్‌వర్క్ ఇటీవలి కాలంలో చాలా విస్తరించింది. ఐతే ఇప్పటికీ ప్రజా పంపిణీ వ్యవస్థ ఇంకా దేశమంతటా కొనసాగు తూనేవుంది. ఇప్పుడు తాజాగా రూపొందిన చట్టాలతో ఈ పంపిణీ వ్యవస్థను మొత్తంగా బడా కార్పొరేట్లు హస్తగతం చేసుకోవచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో మన దేశ వ్యవసాయోత్పత్తిని అభివృద్ధిపరచడం అనేది లేనేలేదు. ఎక్కడైనా ప్రస్తావన వచ్చినా అది కాకతాళీయమే.

ఇంతవరకూ ఉన్న మార్కెటింగ్ వ్యవస్థలో చిన్న ఉత్పత్తిదారులకు తమ ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్లకు తీసుకురావడానికి అయే రవాణా చార్జీలే తలకు మించిన భారంగా ఉంది. అందుచేత వారు దళారీలకు, లేదా పెద్ద రైతులకు తమ ఉత్పత్తులను అమ్మేస్తున్నారు. అలా సేకరించిన ధాన్యం మార్కెట్లకు వస్తుంది. అక్కడ కమిషన్ ఏజెంట్లు వేలం వేస్తే వ్యాపారులు కొనుగోలు చేసి ప్రాంతాలవారీ రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా చేస్తారు. ఈ మొత్తం లావాదేవీలలో ధాన్యం ధర నిర్ణయంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దత్తు ధర – అది రైతుకు పూర్తిగా గిట్టుబాటు కాకపోయినప్పటికీ, ఒక ప్రాతిపదికగా ఉంది. పంట ఉత్పత్తికి అయే ఖర్చు ప్రాతిపదికన మద్దత్తు ధర నిర్ణయించబడడం దీనికి కారణం.

కొత్త చట్టాలు అమలైతే ప్రస్తుత మార్కెట్ విధానం కొనసాగదు. దానికి బదులుగా వచ్చే కొత్త విధానంలో రెండు రకాల లావాదేవీలు మాత్రమే ఉంటాయి. మొదటితరహాలో రైతులు, వారివద్దనుండి ఉత్పత్తులు కొనుగోలు చేసే బ్రోకర్లు ఉంటారు. రెండవ తరహా లావాదేవీలు బ్రోకర్లకు, కార్పొరేట్ రిటైల్ చెయిన్‌కు మధ్య జరుగుతాయి. నేరుగా రైతులనుండి కార్పొరేట్లు కొనుగోలు చేయడానికి దేశంలో వ్యవసాయ రంగంలో ఉన్న భిన్న, భిన్న పరిస్థితులు పెద్ద ఆటంకంగా ఉన్నాయి. స్థానిక పరిస్థితులు ఎక్కడికక్కడ మారిపోతూవుంటాయి. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం సేకరించడమే ఒక పెద్ద సమస్య. అందుచేత కాంట్రాక్టు వ్యవసాయ చట్టం రంగం మీదకొచ్చింది. గ్రామాల్లోని భూస్వాములు, కొంతమంది ధనిక రైతులు, ఇప్పటికే ఉన్న కొంతమంది దళారులు ఈ కాంట్రాక్టుల ద్వారా అసంఖ్యాకంగా ఉన్న చిన్న రైతులనుండి ఉత్పత్తులను పేకరిస్తారు. క్రమంగా ఆధునిక ఫిన్‌టెక్ కంపెనీలు రంగంలో దిగవచ్చు. రెండో తరహా లావాదేవీలలో బ్రోకర్లు కార్పొరేట్ రిటైల్ సంస్థలతో ఆధునిక పద్ధతులలోనే వ్యవహరించవచ్చు.

ఈ కొత్త విధానంలో కొనుగోలు దారుల గుత్తాధిపత్యం (మోనోప్సనీ) ధోరణులు బలంగా వ్యక్తం అవుతాయి. పాత విధానంలో కనీస మద్దత్తు ధర కారణంగా ధరలు ఉత్పత్తి ఖర్చులతో ముడిపడివున్నాయి. కాని కొత్త విధానంలో అంతిమంగా వినియోగదారుడు ఏ రేటు చెల్లించి కొంటాడో అందులోనుంచి సరుకుల రవాణాకు, నిల్వ చేయడానికి, తమ లాభాలకు మిగుల్చుకుని తక్కినదే రైతుకు ధరగా చెల్లిస్తారు. లావాదేవీలలో ఎవరికి బేరసారా లాడే శక్తి అధికంగా ఉంటుందో వారు అవతలి వారిమీదకు భారాలను నెట్టివేస్తారు. సామాజికంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారు ఈ బేరసారాల ఫలితంగా ఎక్కువ నష్టపోతారు. ఒకసారి కనీస మద్దత్తు ధర విధానం అంతరించిపోతే ఇక ధర నిర్ణయంలో విచ్చలవిడి దోపిడీ జరగడం ఖాయం.

ఇప్పటికే అమలులోకి వచ్చిన ఉదార వాద విధానాల కారణంగా చాలా మంది రైతులు కనీస మద్దత్తు ధరకంటే తక్కువకే అమ్ముకునే పరిస్థితి ఉంది. వారివద్ద నుండి కొనుగోలు చేసి తిరిగి వ్యవసాయ మార్కెట్‌లో అమ్మే దళారీలు గాని, మార్కెట్‌కే నేరుగా సరుకును రవాణా చేయగలిగిన స్తోమత ఉన్న ధనిక రైతులు గాని అక్కడ ప్రభుత్వం ప్రకటించిన ధరను పొందగలుగుతారు. ఇప్పుడు ప్రభుత్వం రంగంలో ఉండబోదు గనుక అటువంటి గ్యారంటీ ఏదీ లేదు. అందువల్లనే వారు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. కార్పొరేట్లకు కొమ్ముగాస్తున్న ప్రభుత్వంతో తలపడుతున్నారు.

వ్యవసాయ మార్కెట్లు, వాటికి అనుబంధంగా ఉండే గొదాములు మూతపడ్డాక ప్రైవేటు ధాన్య సేకరణను కార్పొరేట్ రిటైల్ సప్లై చెయిన్‌తో అనుసంధానం చేయడం పెద్ద కష్టమేమీ కాదు. నిత్యావసర సరుకుల చట్టానికి సవరణ చేసి సరుకుల నిల్వలను ఎంత పెద్ద మొత్తంలోనైనా ఉంచుకోడానికి అవకాశం కల్పించారు. ఒకసారి సరుకులు తమ వద్దకు చేరితే ఇక మార్కెట్‌లో ధరలను తమ ఇష్టం వచ్చిన రీతిలో నియంత్రించగల శక్తి కార్పొరేట్లకు వస్తుంది. పైగా తమ మార్కెట్‌ను దూకుడుగా విస్తరించగల సామర్థ్యమూ వస్తుంది.

కార్పొరేట్ రిటైల్ మార్కెటింగ్ చెయిన్ విస్తరించాక ఆ క్రమంలో పలువురు చిన్న వ్యాపారులు తమ వ్యాపారాలను మూసేసుకోవలసిన పరిస్థితి వస్తుంది. 1980, 1990 దశకంలో బాలీవుడ్ సినిమాల్లో చిత్రీకరించినట్టు సరుకులను బ్లాక్‌మార్కెట్‌లో దాచివేసి లాభాలు ఆర్జించిన పద్ధతి ఇకముందు ఉండదు. ఆ విధంగా సరుకులను నిలవ చేసే మధ్య దళారీలే ఇకముందు ఉండరు. ఏజెంట్లు, ట్రాన్స్‌పోర్టర్లు, చిన్నవ్యాపారులు, స్థానిక వెండర్లు – ఇటువంటివారు ఉండరు. గతంలో వీరు సంపాదించిన లాభాలు కూడా ఇకముందు కార్పొరేట్లకే దక్కుతాయి. అంతే తప్ప రైతులకు దక్కేది ఏమీ ఉండదు. పైగా ఒకసారి ఈ మార్కెటింగ్ చెయిన్ మీద పట్టు చిక్కించుకున్నాక తమకు ఎటువంటి పంటలు కావాలో వాటినే పండించాలని రైతులపై వత్తిడి చేయడం కూడా పెరుగుతుంది. దాని వలన భూవినియోగం శాస్త్రీయ పద్ధతిలో కాకుండా కార్పొరేట్ల లాభాలకోసం మారిపోతుంది. భూసారం దెబ్బతింటుంది. మరోపక్క రైతుల ఆదాయాలు

పడిపోయి, వారు సరుకులను కొనగలిగే శక్తిని కోల్పోతారు. రుణభారం మరింత పెరుగుతుంది. అంతిమంగా చిన్న రైతులు భూములను కోల్పోతారు.

ఈ కొత్త మార్కెట్ వ్యవస్థ దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఒకే విధంగా విస్తరించే అవకాశాలు లేవు. అలా విస్తరించాలంటే అందుకవసరమైన మౌలిక వసతులు ఉండాలి. (గొడౌన్లు, కొనుగోలు కేంద్రాలు వంటివి) ఇటువంటి ఏర్పాట్లు ఖర్చుతోకూడుకున్నట్టివి. వాటి నిర్వహణ కూడా ఖర్చుతో కూడిన వ్యవహారమే. అందుచేత ఏ పెట్టుబడిదారుడూ ఆ జోలికి పోడు. ఇప్పటికే ఇటువంటి ఏర్పాట్లు ఉన్న చోట్లకు పోవడానికి అతడు మొగ్గు చూపుతాడు. ఈ విషయంపట్ల ఏమాత్రం ముందుచూపు ఉన్నా కనీసం వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వమైనా ఖర్చు చేసివుండాల్సింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు అసమాన అభివృద్ధి పుట్టుకతో వచ్చిన జబ్బు. ఈ వ్యవసాయ చట్టాల వలన దేశంలో నెలకొన్న ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతాయి.

> “ఈ కొత్త మార్కెట్ వ్యవస్థ దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఒకే విధంగా విస్తరించే అవకాశాలు లేవు. అలా విస్తరించాలంటే అందుకవసరమైన మౌలిక వసతులు ఉండాలి. (గొడౌన్లు, కొనుగోలు కేంద్రాలు వంటివి) ఇటువంటి ఏర్పాట్లు ఖర్చుతోకూడుకున్నట్టివి. వాటి నిర్వహణ కూడా ఖర్చుతో కూడిన వ్యవహారమే. అందుచేత ఏ పెట్టుబడిదారుడూ ఆ జోలికి పోడు. ఇప్పటికే ఇటువంటి ఏర్పాట్లు ఉన్న చోట్లకు పోవడానికి అతడు మొగ్గు చూపుతాడు.”

మొత్తం మీద క్లుప్తంగా చెప్పాలంటే ఈ వ్యవసాయ సంస్కరణలు వ్యవసాయరంగాన్ని పట్టి పీడిస్తున్న వ్యవస్థీకృత వైరుధ్యాలను పరిష్కరించవు సరికదా మరింత తీవ్రం చేస్తాయి. సామాజిక, ప్రాంతీయ అసమానతలను తీవ్రతరం చేస్తాయి. ధరల పతనానికి దారి తీస్తాయి. దాంతో వ్యవసాయోత్పత్తి వృద్ధి చెందకుండా మందగిస్తుంది. ఇంకోవైపు వ్యవసాయ రంగం మీద ఇంతవరకూ ఆధార పడిన వారిలో అత్యధికులు దెబ్బ తినడంతో గ్రామీణ ప్రాంతాల కొనుగోలు శక్తి దెబ్బ తింటుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత మందగిస్తుంది. ఇదంతా జరుగుతున్నది కేవలం వేళ్ళమీద లెక్కించదగ్గ బడా కార్పొరేట్ల తక్షణ లాభాల కోసమే. భారత దేశంలోని రైతాంగ ఉద్యమం జరగబోయేదానిని చాలా ముందుగానే స్పష్టంగా అర్థం చేసుకోగలిగింది. రైతుల ప్రయోజనాలు కార్మికుల ప్రయోజనాలతోను, మొత్తం సమాజం ప్రయోజనాలతోను ముడిపడివున్నాయని ఆ ఉద్యమం గ్రహించింది గనుకనే ఈ నల్ల చట్టాల పర్యవసానాలు ఏవిధంగా ఉండబోతున్నాయో ఏమాత్రమూ దాచకుండా బైటపెట్టింది. నయా ఉదారవాద సిద్ధాంత వేత్తలు మాత్రం ఈ చట్టాలు వ్యవసాయరంగం సంక్షోభం నుండి బైట పడాలంటే ఈ చట్టాలే పరిష్కారం అంటూ ఏ మాత్రమూ నిజాయితీ లేకుండా మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు.

### ప్రత్యామ్నాయం

1960 దశకం తర్వాత రైతాంగ ఉద్యమం తిరిగి మళ్ళీ తానేమిటో, తన శక్తి ఏమిటో స్పష్టం చేసేంతగా ఎదిగింది. ఈ ఉద్యమంలో అనేక స్రవంతులు ఉన్నాయి. వాటిమధ్య గణనీయమైన అంతర్గత వైరుధ్యాలూ ఉన్నాయి. 2018లో ముంబైకి నిర్వహించిన లాంగ్‌మార్చ్‌లో ప్రధానంగా గిరిజనులు, దళితులు, ఒబిసిలలోని అట్టడుగు తరగతులు ఉన్నారు. ప్రస్తుతం డిల్లీని ముట్టడించిన రైతాంగం సామాజిక పొందిక కొంత భిన్నంగా ఉంది. వ్యవసాయ రంగాన్ని ఆవరించిన సంక్షోభం తెచ్చిన వత్తిడి ఫలితంగా రైతాంగంలో చారిత్రికంగా భిన్నంగా ఉంటూ, పలు సందర్భాలలో ఒకరిపట్ల ఇంకొకరు శత్రుపూరిత వైఖరితో వ్యవహరించిన రెండు స్రవంతుల రైతులు ఒక దగ్గరకు చేరారు. ఇన్నాళ్ళూ ఈ రెండు స్రవంతుల మధ్య శత్రుత్వానికి కారణమైన అంశాలు భూమి, వేతనాలు. ఐతే ఇప్పుడు ఈ నల్ల చట్టాల పర్యవసానంగా ఏర్పడబోయే వ్యవస్థాగతమైన మార్పులు ఈ రెండు స్రవంతుల రైతాంగానికీ మొత్తంగానే చేటు తేనున్నాయి. అందుచేత ఈ రెండు స్రవంతులూ తమ తమ వర్గ ప్రయోజనాలను పరిరక్షించుకోవాలన్న ఉద్దేశ్యంతోనే రాజ్య వ్యవస్థ రూపొందించిన విధానాలకు, దాని వెనుకనున్న సిద్ధాంతానికి ఒక ప్రత్యామ్నాయం కావాలని పోరాడుతున్నాయి.

ప్రభుత్వ విధాన రూపకర్తలు ప్రచారం చేస్తున్న సంస్కరణల్లో మార్కెటింగ్‌కు సంబంధించినవే ప్రధానంగా ఉన్నాయి. వాటితోబాటు సబ్సిడీలను రద్దు చేయాలని కూడా వారు చెప్తున్నారు. నిజానికి ఈ సబ్సిడీలు వినియోగదారులకు అంతిమంగా ప్రయోజనం కలిగిస్తాయే తప్ప రైతులకు కాదు. (సబ్సిడీలు, ఉచిత విద్యుత్ వంటివి లేకుంటే రైతు ఇంకా ఎక్కువ ధర వస్తేనే ఆహార ధాన్యాలు పండిస్తాడు. అప్పుడు మార్కెట్‌లో ఎక్కువ ధర చెల్లించాల్సింది వినియోగదారుడే.) కౌలు చట్టాలను మార్పు చేయాలని, ఎగుమతి వాణిజ్యపు సంస్కరణలు తేవాలని కూడా వారు చెబుతున్నారు. ఇవన్నీ ప్రపంచబ్యాంకు , లేదా ప్రపంచ వాణిజ్య సంస్థ పుస్తకాలనుండి కాపీ కొట్టినవే తప్ప ఏ మాత్రమూ స్వంత బుర్రలు ఉపయోగించి చెప్తున్నవి కావు. సరళీకరణ చేసినంత మాత్రాన సంక్షేమం దానంతట అదే కలుగుతుందన్న యాంత్రికమైన అభిప్రాయానికి వాస్తవ ఆచరణ ఎటువంటి ఆధారాన్నీ చూపలేదింతవరకూ. ఇదొక సైద్ధాంతిక భ్రమ. ఈ భ్రమమీద ఆధారపడి సంస్కరణలను సమర్థిస్తున్న విద్యావేత్తలు ప్రస్తుత ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ పరిస్థితిని గాని, మన దేశంలో ఉన్న వ్యవసాయ రంగ సంక్షోభాన్ని తొలగించలేని దాని అశక్తత గురించి గాని వాస్తవాలు చెప్పకుండా కప్పిపుచ్చుతున్నారు.

20వ శతాబ్దం రెండవ భాగంలో (అంటే 1950-2000) యాంత్రీకరణ, రసాయన ఎరువుల వినియోగం వేగంగా విస్తరించడంతో ప్రపంచంలో వ్యవసాయ ఉత్పత్తి విపరీతంగా పెరిగిపోయింది. అందువలన ప్రపంచ మార్కెట్‌లో అధికోత్పత్తి నిరంతర సమస్యగా మారింది. అమెరికన్ రైతులు ఉత్పత్తి ఖర్చు కన్నా తక్కువే పొందసాగారు. ప్రపంచంలో అతి తక్కువ ఉత్పత్తి ఖర్చు అమెరికన్ రైతుదే. 2013-17 మధ్య అమెరికన్ రైతు నికర ఆదాయం సగానికి పడిపోయింది. అమెరికన్ మాజీ సైనికులు తాము సాగించిన అమానుషమైన యుద్ధనేరాలను తల్చుకుని ఆత్మహత్యలకు పాల్పడుతూంటారు. కాని అమెరికన్ రైతులు వారికంటే రెండు రెట్లు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడసాగారు.

సంపన్న దేశాలలో ప్రభుత్వాలు రైతులకు భారీగా సబ్సిడీలు ఇచ్చి సంక్షోభాన్నుంచి

> **❝ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థి తులను పరిశీ లించినప్పుడు ప్రభుత్వం వ్యవసాయరంగానికి తోడ్పాటు నివ్వడం నుంచి పక్కకు తప్పుకున్నచోట ఎంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పటికీ ఉత్పత్తిలో సంక్షోభం పెరుగుతుంది. ఇక సాంకేతికంగా వెనకబడిన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న మన దేశం సంగతి చెప్పనవసరం లేదు. ఇక ఎగుమతుల మార్కెట్ మనకు అవకాశాలు కల్పిస్తుందని ఏమాత్రమూ భరోసా పెట్టు కోలేము. ❞**

కాపాడే ప్రయత్నం చేస్తున్నాయి. అమెరికాలో ప్రతిఏడూ 2000 కోట్ల డాలర్ల సబ్సిడీ వివిధ రూపాలలో రైతులకు అందిస్తున్నారు. (ఆ దేశంలో రైతులు సుమారు కోటి 45 లక్షలు మాత్రమే) జపాన్‌లో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయానికి అక్కడ ప్రభుత్వం అదనంగా 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. అంతేగాక సహకార వ్యవసాయ మార్కెట్‌ల ద్వారా నేరుగా రిటైల్ మార్కెట్‌కు సరుకులు సరఫరాచేస్తోంది. దీనివలన రైతులకు ఎక్కువ రేటు వస్తోంది. పైగా విదేశాల నుండి దిగుమతి అయ్యే బియ్యంపై ఏకంగా 778 శాతం సుంకం విధించింది. అంటే సంపన్న దేశాల ప్రభుత్వాలు ఆయా దేశాల వ్యవసాయ రంగాలను గిట్టుబాటుగా ఉండేలా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ మార్కెట్ సూత్రాలకు సంబంధం లేనివే. కాని వీళ్ళ నయవంచన ఎటువంటిదంటే మనని మాత్రం మార్కెట్ సూత్రాలకు లోబడి వుండాల్సిందేనంటారు. ఇక్కడ మనం గమనించాల్సిందేమంటే ఈ సంపన్న దేశాలు తమ దేశాల రైతుల ఆదాయాలు నిలకడగా ఉండేలా గ్యారంటీ చేయడమనేది ఆ ప్రభుత్వాలకే నిత్యం సవాలుగా ఉంది.

**గ్లోబల్ సప్లై చెయిన్లు, మెగా లాభాలు**

ఐతే వ్యవసాయ రంగం నుండి లాభాలు రావనుకుంటే అది పొరపాటు. వ్యవసాయ పంటలను పండించడం ద్వారా గతంలో లాభాలు వచ్చేవి. కాని ఇప్పుడు ఒక పెద్ద మార్పు గత రెండు దశాబ్దాల కాలంలో వచ్చింది. దాంతో అగ్రి-బిజినెస్‌లో మెగా లాభాలు సమకూరుతున్నాయి. అదే గ్లోబల్ సప్లై చెయిన్స్. ఇవి వచ్చాక ఉత్పత్తిని నిర్వహించే పద్ధతి కూడా మారింది. భూములు ఎక్కువగా అందుబాటులో ఉన్న 'మిగులు' ప్రాంతాల్లో వెంటవెంటనే ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయవలసిన పంటలు పండేచోట్ల కార్పొరేట్లు పెద్ద పెద్ద విస్తీర్ణాల్లో భూములను కొనుగోలు చేసి పూర్తిస్థాయిలో యాంత్రీకరణ చేపట్టి ప్రాసెసింగ్‌తో నేరుగా అనుసంధానం చేశారు. ఇతర ఉత్పత్తులను పెద్ద పెద్ద కుటుంబ కమతాల యజమానులనుండి కొనుగోలు చేస్తున్నారు. వాటిని ప్రాసెస్ చేయడం గాని నేరుగా అమ్మకానికి గాని గ్లోబల్ సప్లై నెట్‌వర్క్ ద్వారా చేపడతారు. ప్రస్తుతం భారతీయ పెట్టుబడిదారులు ఈ రెండో తరహా విధానం ద్వారా సేకరణ, అమ్మకం చేపట్టజూస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను పరిశీలించినప్పుడు ప్రభుత్వం వ్యవసాయరంగానికి తోడ్పాటునివ్వడం నుంచి పక్కకు తప్పుకున్నచోట ఎంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పటికీ ఉత్పత్తిలో సంక్షోభం పెరుగుతుంది. ఇక సాంకేతికంగా వెనకబడిన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న మన దేశం సంగతి చెప్పనవసరం లేదు. ఇక ఎగుమతుల మార్కెట్ మనకు అవకాశాలు కల్పిస్తుందని ఏమాత్రమూ భరోసా పెట్టుకోలేము. పెద్ద ఎత్తున యాంత్రీకరణ జరిగి, అతి చౌకగా వ్యవసాయాన్ని నిర్వహించే సంపన్న దేశాల ఉత్పత్తిదారులు అమ్మే ధరలతో పోటీ పడేలా మన చిన్న రైతులు, తమ కుటుంబ సభ్యుల శ్రమపై ప్రధానంగా ఆధారపడి, స్వంత అవసరాలను కూడా పక్కనబెట్టి ఎలాగో ఒకలా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్న మన రైతులు అంతర్జాతీయ మార్కెట్‌లో నెగ్గుకురాగలరా?

దేశీయంగా గాని, అంతర్జాతీయంగా కాని తీవ్రమైన సవాళ్ళు ఎదురౌతున్న ఈ పరిస్థితులలో మనం అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమితి ముందుకు తెచ్చిన డిమాండ్లను అర్థం చేసుకోవాలి. పంటలు పండించడానికి ఎంత ఖర్చు అవుతోందో సరిగ్గా లెక్కించి దాని ఆధారంగా కనీస మద్దతు ధర నిర్ణయించాలని, ఉపాధి హామీ చట్టానికి నిధులను పూర్తిస్థాయిలో కేటాయించాలని, సహకార మార్కెటింగ్, స్టోరేజి, ప్రాసెసింగ్ చేపట్టడానికివీలుగా రైతుల సహకార వ్యవస్థలను ఏర్పరచాలని, మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు. ఇవి గాక, రుణాలమాఫీ, ప్రాధాన్యతా రంగంగా వ్యవసాయ రుణాల మంజూరు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇతర దేశాలతో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాలను తిరిగి సమీక్షించాలని కోరుతున్నారు.

ఈ చర్యలు గనుక చేపడితే వ్యవసాయ రంగంలో పెట్టుబడి రాకపెరుగుతుంది. స్తంభించిపోయిన మన ఉత్పత్తి పెరుగుదల దిశగా సాగుతుంది. ఇంకోపక్క రైతుల ఆదాయాలు పెరిగి మన దేశంలో కొనుగోలు శక్తి మొత్తంగా పెరుగుతుంది. దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పురోగమిస్తుంది. గ్రామీణరంగంలో ప్రజాతంత్ర పద్ధతిలో ఆదాయాల పంపిణీ జరుగుతుంది. (సహకార వ్యవస్థ బలోపేతం అయినందువలన) చిన్న ఉత్పత్తిదారులతో రిటైల్ వ్యాపారం జోడించబడుతుంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలోని మార్పులకనుగుణంగా తగిన వ్యూహాలను రైతుల సహకార సంస్థలు రూపొందించగలుగుతాయి. ఏమేరకు ప్రభుత్వ మద్దత్తు అవసరమవుతుందో స్పష్టంగా తెలుస్తుంది. ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ వలలోమనదేశ వ్యవసాయ రంగం చిక్కుకుపోకుండా కాపాడుకోగలుగుతాం.

ఐతే ఈ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి అమలుచేస్తుందా అన్నది ఒక ప్రశ్న. ఈ డిమాండ్లను అమలు చేస్తే దేశ వ్యవసాయరంగాన్ని దీర్ఘకాలంగా పీడిస్తున్న వైరుధ్యాలు పరిష్కారం అవుతాయా అన్నది ఇంకో ప్రశ్న. రైతాంగంలో ఉన్న వివిధవర్గాల నడుమ ఉన్న వైరుధ్యాలు బలీయమైనవి. ప్రస్తుత సంక్షోభం నుండి వ్యవసాయ రంగాన్ని బైటపడేయడానికి కావలసిన సమూలమైన మార్పులు రావడానికి ఈ వైరుధ్యాలు ఒక ఆటంకం. అందుచేత ప్రస్తుత పోరాటం దీర్ఘకాలం సాగుతుంది. కొన్ని విజయాలు, చాలా అపజయాలు ఉంటాయి. ఒక సృజనాత్మకమైన వైఖరితో ప్రజానుకూల ప్రత్యామ్నాయాన్ని సహకార ప్రాతిపదికన రూపొందించాలి. దాని అమలు కోసం విశాల ప్రాతిపదికన సమీకరించి ఉద్యమాలు నడపాలి. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ పరిధుల్లో, ఈ రాజ్య వ్యవస్థ వర్గ ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి మార్పు ఏ మేరకు సాధ్యపడుతుందనేది ఒక చిక్కు ప్రశ్నే.

**(స్వేచ్ఛానుసరణ - ఎం.వి.ఎస్.శర్మ)**

పార్టీ నిర్మాణం

# ఆగ్జిల్లరీ గ్రూపుల పని విధానం

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

ఇది సభ్యత్వం పునరుద్ధరణ సమయం.

విప్లవ చైతన్యం గల పార్టీగా సభ్యత్వం అభివృద్ధి చేయాలని పార్టీ కోల్‌కతా ప్లీనం తీర్మానం చెప్పింది. పార్టీ శ్రేణులలో విప్లవ చైతన్యం పాదుకొల్పాలని ప్లీనం భావించింది. కనీస బాధ్యతలు నిర్వహించేవారి సభ్యత్వం మాత్రమే పునరుద్ధరించాలని నిర్ణయించింది. పార్టీ నిర్దేశించిన లెక్క ప్రకారం లెవీ క్రమం తప్పకుండా చెల్లించటం, పార్టీ నిర్ణయించిన ప్రజాసంఘంలో పనిచేయుటం, శాఖ సమావేశాలకు రెగ్యులర్‌గా హాజరు కావటం, పార్టీపత్రిక, సాహిత్యం అధ్యయనం చేయటం, పార్టీ పిలుపులలో చురుకుగా పాల్గొనటంలో సభ్యుల పాత్రను సమీక్షించి, పునరుద్ధరణ విషయంలో నిర్ణయం తీసుకోవాలి.

ఇదంతా ఇప్పటికే ఉన్న సభ్యులకు సంబంధించిన విషయం. మరో రెండు విషయాలు మనముందున్నాయి. కొత్తగా పార్టీలో చేరే కామ్రేడ్స్ విషయంలో అనుసరించాల్సిన పద్ధతి ఒకటి. ఇప్పుడు సభ్యత్వం పునరుద్ధరించని కామ్రేడ్స్ పట్ల అనుసరించవల్సిన పద్ధతి మరొకటి. ఇక్కడే ఆగ్జిల్లరీ (అనుబంధ) గ్రూపుల పనివిధానం గురించి అర్థం చేసుకోవాలి. ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నవారందరికీ పార్టీ సభ్యత్వం ఇచ్చే ధోరణి అమలైంది. ఫలితంగా శాఖల పని విధానంగానీ, సభ్యత్వం నిలుపుకోవటంలోగానీ బలహీనతలు వ్యక్తమైనాయి. అనేక ఇతర కారణాలకు తోడు రిక్రూట్‌మెంట్ విధానంలో జరిగిన లోపం కూడా తోడై పార్టీ శాఖల పనివిధానం బలహీనపడింది. అందుకే రిక్రూట్‌మెంట్ సందర్భంగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. రిక్రూట్‌మెంట్ తర్వాత కూడా వారి చైతన్యం పెంచడానికి నిరంతరం కృషి చేయాలన్నది. ప్రస్తుతం మనం రిక్రూట్‌మెంట్ సందర్భంగా అనుసరించాల్సిన పద్ధతులను వివరంగా చర్చించుదాం.

పార్టీ సభ్యత్వం చేర్పించే విషయంలో కోల్‌కతా తీర్మానానికి చాలా ముందే కేంద్రకమిటీ ఒక నిర్ణయం చేసింది. ఆగ్జిల్లరీ గ్రూపులో పెట్టి, కనీసం ఆరు మాసాలైనా తర్ఫీదునివ్వకుండా, తగు పరిశీలన చేయకుండా, ఎవరికీ నేరుగా క్యాండిడేట్ సభ్యత్వం ఇవ్వవద్దని ఆదేశించింది. ఈ పద్ధతి కచ్చితంగా పాటించాలని కోల్‌కతా ప్లీనం పునరుద్ఘాటించింది. కానీ ఈ నిర్ణయం కూడా అనేక సందర్భాలలో సక్రమంగా అమలు జరగలేదు. దీని ప్రాధాన్యత గుర్తించిన కార్యకర్తలు, సభ్యులు కూడా అమలు చేయటంలో ఇబ్బంది పడ్డారు. ఆగ్జిల్లరీ గ్రూపు అంటే ఏమిటి? ఇందులోకి ఎవరిని ఎంపిక చేయాలి? వీటిని ఎట్లా నిర్వహించాలి? ఇలాంటి విషయాలలో స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణం.

ఒక్కమాటలో చెప్పాలంటే... పార్టీ సానుభూతిపరులనూ, వామపక్ష సానుభూతి పరులనూ ఆగ్జిల్లరీ గ్రూపులలో సభ్యులుగా చేర్చాలి. ఈ దేశంలో సీపీఐ(ఎం) విప్లవ పార్టీ అనే విషయంలో వీరికి తగిన అవగాహన కల్పించాలి. పార్టీ క్రమశిక్షణ, పార్టీ సభ్యుల విధుల గురించి వివరించాలి. పార్టీ సభ్యులుగా చేరి దేశంలో విప్లవం కోసం తాను కృషి చేయాలన్న పట్టుదల పెంచాలి. ఇవన్నీ ఆగ్జిల్లరీ గ్రూపును క్రమం తప్పకుండా నిర్వహించటం, తగు ఎజెండాలతో చర్చించటం ద్వారా సాధించగలం.

ప్రజాసంఘాలు, వర్గ సంఘాల ఆధ్వర్యంలోనూ, పార్టీ ఆధ్వర్యంలోనూ జరిగే అనేక పోరాటాలలో పాల్గొనే చురుకైన వారందరూ పార్టీ సానుభూతిపరులు కాకపోవచ్చు. అత్యధికులు కాదు కూడా. పోరాటాలలో, ఆందోళనలలో చురుకుగా పాల్గొంటున్నవారినీ, మిలిటెంట్ కార్యకర్తలను ఎంపిక చేయాలి. చిన్న చిన్న బృందాలుగా చేసి స్టడీ సర్కిల్స్ నిర్వహించాలి. వివిధ రంగాలు, నివాస ప్రాంతాలలో ఎంపిక చేసిన వీరు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలలో పాల్గొంటారు. కానీ బూర్జువా పార్టీల పట్ల నమ్మకంతో ఉంటారు. వారికే ఓట్లేస్తూ ఉంటారు. బూర్జువా పార్టీల స్థానిక కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండే అవకాశం ఉంటుంది. మనం నిర్వహించే పోరాటాల పట్ల ఆకర్షితులవుతారు. వారి సమస్యలకు బూర్జువా పార్టీల విధానాలే కారణమన్న అవగాహన కల్పించాలి. వామపక్షమే ప్రత్యామ్నాయం అన్న విషయం అర్థం చేయించాలి. భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలే సమస్యలకు మూలమనీ, సోషలిజం లోనే పరిష్కారమవుతాయనీ అర్థం చేయించాలి. ఇందుకోసమే స్టడీసర్కిల్స్ నిర్వహించాలి. ఈ లక్ష్యానికి తోడ్పడే అంశాలే ఈ స్టడీ సర్కిల్స్‌లో బోధించాలి. గంటకు మించకుండా బోధించాలి. సమస్యలకూ, ప్రభుత్వ విధానాలకూ, రాజకీయాలకు ఉన్న సంబంధాన్ని అర్థం చేయించాలి. ప్రభుత్వ విధానాలను ఎండ గట్టాలి. వర్గదోపిడీ పట్ల అవగాహన కల్పించాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని సమకాలీన ప్రాధాన్యతగల అంశాలను స్టడీ సర్కిల్‌లో చర్చనీయాంశాలుగా ఎంచుకోవచ్చు. దేశంలో రైతాంగం పోరుబాట పట్టింది. ఢిల్లీలో రైతులు సుదీర్ఘకాలం బైఠాయించడం ప్రాధాన్యత గల్గిన అంశం. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడుతున్నారు. ఈ మూడు చట్టాలు, మద్దతుధర వంటి అంశాలతో ఒక స్టడీసర్కిల్ నిర్వహించవచ్చు. రైతులు విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించాలని పోరాడుతున్నారు. ఈ అంశం ఒక సమావేశంలో చర్చించవచ్చు. కరోనాను ఎదుర్కోవటంలో సోషలిజం ఆదర్శం, పెట్టుబడిదారీ

**"ఆగ్జిల్లరీ సభ్యులు పార్టీ పిలుపులలో రెగ్యులర్‌గా పాల్గొనే విధంగా చూడాలి. వారి అభిరుచులు, చొరవను బట్టి ఇతర కార్యక్రమాలు కూడా ప్రోత్సహించాలి. ఆగ్జిల్లరీ సభ్యులు తమ గ్రామంలోగానీ, బస్తీ/పేటలోగానీ ఆటలు నిర్వహించవచ్చు. పాటలు, నాటికలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం ఒక అలవాటుగా చేయవచ్చు. గ్రంథాలయం నిర్వహించవచ్చు. బాలసంఘాలు పెట్టి ఆట, పాటలతో శాస్త్రీయ ఆలోచన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించవచ్చు."**

వ్యవస్థ వైఫల్యం ప్రపంచమంతా చర్చిస్తున్నది. దేశంలో కేరళ వామపక్ష ప్రభుత్వం అనుసరించిన పద్ధతి అందరి ప్రశంసలందుకున్నది. ఇదీ ఒక అంశమే! కరోనా కాలంలో రు.20 లక్షల కోట్ల ప్యాకేజీ బండారం కూడా ఒక ప్రత్యేక అంశం. దేశంలో పెరుగుతున్న ఆర్థిక మందగమనం, నిరుద్యోగం ఒక చర్చనీయాంశం. లేబర్ కోడ్ పేరుతో కార్మిక చట్టాల మీద దాడి కూడా చర్చించాలి. బిజెపి పాలనలో మహిళలమీద పెరుగుతున్న లైంగిక దాడులూ, కుల దురహంకార దాడులూ, సిఏఏ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌ల పేరుతో మతపరమైన విభజనకు జరుగుతున్న కుట్రలు, ఫెడరల్ వ్యవస్థ–ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, ప్రజాస్వామ్యం–స్వతంత్ర వ్యవస్థల మీద దాడి, లౌకికవాదం–కాంగ్రెస్ తదితర బూర్జువా పార్టీల అవకాశవాదం, నూతన విద్యా విధానం, ధరల పెరుగుదల వంటి అంశాలను స్టడీ సర్కిల్‌లో చర్చించాలి. ఎప్పటికప్పుడు ఆనాడు చర్చనీయాంశాలుగా ఉన్న ముఖ్య అంశాలను ఎంపిక చేసుకోవాలి.

స్టడీసర్కిల్ ఎంత తరచుగా జరిగితే అంత మంచిది. పాల్గొనేవారి సంసిద్ధతను బట్టి వారానికోసారి నిర్వహించగల్గితే ఇంకా మంచిది. ఎంపిక చేసినవారిని ప్రత్యేకంగా ఆహ్వానించాలి. హాజరు కోసం రిజిస్టర్ నిర్వహించటం ఉపయోగకరం. ఎంపిక చేయనివారు కూడా హాజరైనా ఇబ్బంది లేదు. కానీ ఎంపిక చేసినవారు హాజరయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

స్టడీ సర్కిల్‌కు రెగ్యులర్‌గా హాజరయ్యే వారిలో క్రమంగా బూర్జువాపార్టీల మీద, పెట్టుబడిదారీ వ్యవస్థమీద భ్రమలు తొలగిపోయినవారిని గుర్తించాలి. సహజంగానే వీరిలో ఎర్రజెండా మీద అభిమానం, సోషలిజం మీద ఆకర్షణ పెరుగుతుంది. కమ్యూనిస్టు పార్టీ ద్వారానే సమాజ మార్పు సాధ్యమనీ, పోరాటమే మార్గమనీ అర్థం చేసుకున్నవారిని ఎంపిక చేసి ఆగ్జిల్లరీ గ్రూపులలో పెట్టాలి. దీనికి కాల పరిమితి లేదు. ఎంత తొందరగా భ్రమలు తొలగితే అంత తొందరగా వీరితో ఆగ్జిల్లరీ గ్రూపులు ఏర్పాటు చేయవచ్చు. వీరితో పాటు మన పోరాటాలు, కార్యక్రమాలు చూసి, పార్టీ విధానం గమనించి, కార్యకర్తల పని విధానం పట్ల ఆకర్షితులై పార్టీ సానుభూతిపరులుగా అయినవారిని కూడా చేర్చవచ్చు. గతంలో పార్టీ సభ్యులుగా ఉండి, కనీస బాధ్యతలు నిర్వహించలేక సభ్యత్వం పునరుద్ధరించు కోలేకపోయిన వారిని కూడా ఆగ్జిల్లరీ గ్రూపులలో చేర్చవచ్చు. పార్టీ పట్ల విశ్వాసం ఉండి, ఇతర కారణాల వల్ల కనీస బాధ్యతల నిర్వహణలో వెనుకబడిన వారితో పార్టీ సంబంధాలు కొనసాగించడానికి ఇదొక మార్గం. మళ్ళీ అనుకూల పరిస్థితులు వచ్చినపుడు పార్టీ సభ్యత్వం ఇవ్వవచ్చు. ఆగ్జిల్లరీ గ్రూపులను ఏర్పాటు చేసేటపుడు యువతీ యువకులు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన తరగతుల మీద ప్రత్యేక దృష్టి సారించాలి.

ఆగ్జిల్లరీ గ్రూపులలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం, దాని విశిష్టతను వివరించాలి. నూతన ఆర్థిక విధానాల మీద పోరాటంలో సిపిఐ(ఎం) విశిష్టత చెప్పాలి. గత రెండు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలోనూ కులవివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు, పార్టీ ప్రత్యేకత చర్చించాలి. విద్యుత్తు పోరాటం, భూపోరాటాలలో పార్టీ ప్రత్యేకత, సమరశీలత వివరించాలి. వామపక్ష ఐక్యత కోసం పార్టీ చేస్తున్న కృషి వివరించాలి. పార్టీ నిబంధనావళి, కనీస బాధ్యతలు, సభ్యత్వం పట్ల అవగాహన కల్పించాలి. ఆగ్జిల్లరీ గ్రూపును పార్టీ శాఖను నిర్వహించే పద్ధతిలోనే, అదే పట్టుదలతో నిర్వహించాలి. పార్టీ పిలుపులలో వారు భాగస్వాములయ్యే విధంగా ఎజెండా పెట్టి చర్చించాలి. రాజకీయ చర్చ ఒక ముఖ్యమైన ఎజెండాగా ఉండాలి. సమకాలీన రాజకీయ, సైద్ధాంతిక సమస్యల మీద మార్క్సిస్టు అవగాహన పెంపొందించడానికి ఈ చర్చ బాగా ఉపయోగపడుతుంది. ఆగ్జిల్లరీ గ్రూపు కనీసం నెలదాటకుండా, ఎంత తరచుగా జరిగితే అంత మంచిది. క్రమం తప్పకుండా, ఆరు మాసాలు నడిపిన ఆగ్జిల్లరీ గ్రూపులోని సభ్యుల హాజరు, వారి రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం, పార్టీ పట్ల విశ్వాసం తదితర అంశాలు పరిశీలించాలి. వీటిలో మెరుగై, పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించి, సభ్యత్వం కోరుకునేవారితో సభ్యతం కోసం దరఖాస్తు పెట్టించాలి. మిగిలినవారు ఆగ్జిల్లరీ శాఖలో కొనసాగుతారు. కొత్తవారు కూడా తోడవుతూ ఉంటారు.

ఆగ్జిల్లరీ సభ్యులు పార్టీ పిలుపులలో రెగ్యులర్‌గా పాల్గొనేవిధంగా చూడాలి. వాటికే పరిమితం కాకుండా, వారి అభిరుచులు, చొరవను బట్టి ఇతర కార్యక్రమాలు చేయడాన్ని కూడా ప్రోత్సహించాలి. పార్టీ పిలుపులకు అదనంగా ఏమేమి చేయవచ్చో ఆగ్జిల్లరీ శాఖలో చర్చించవచ్చు. మారిన పరిస్థితుల్లో స్థానికంగా నివాస ప్రాంతాలతో పాటు విద్యాసంస్థలలో కూడా క్రీడా సౌకర్యాలు కనుమరుగైనాయి. ఆగ్జిల్లరీ సభ్యులు తమ గ్రామంలోగానీ, బస్తీ/పేటలోగానీ ఆటలు నిర్వహించవచ్చు. ప్రతిరోజూ వారు కూడా ఆడుతూ, అనేకమంది యువతీ, యువకులను పాల్గొనే విధంగా చూడవచ్చు. పాటలు, నాటికలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం ఒక అలవాటుగా (అదొక కార్యక్రమంగా మాత్రమే కాదు) చేయవచ్చు. గ్రంథాలయం నిర్వహించవచ్చు. పత్రికలు చదివించవచ్చు. బాల బాలికలను సమీకరించి బాలసంఘాల పేరుతో ఆట, పాటలతో పాటు శాస్త్రీయ ఆలోచన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించవచ్చు. నిరంతరం ప్రజాకార్యాచరణలో ఉండే విధంగా చూడాలి. ప్రజాపోరాటాలలో పాల్గొనేవిధంగా, ప్రజల పట్ల సేవా దృక్పథం పెంచే విధంగా చూడాలి.

ఆగ్జిల్లరీ గ్రూపు నిర్వహించే బాధ్యులు (కన్వీనర్) చైతన్యవంతంగా పనిచేసే పార్టీ సభ్యులై ఉండాలి. విప్లవ చైతన్యంగల పార్టీ సభ్యులను తయారు చేసే కృషి ఇది. విప్లవ చైతన్యం ప్రదర్శించే సభ్యులే దీని ప్రాధాన్యత గుర్తించి సక్రమంగా నిర్వహించగలరు. పూర్తికాలం కార్యకర్తలు, కమిటీ సభ్యులు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. జవాబుదారీగా ఉండాలి. ఆగ్జిల్లరీ గ్రూపులు, స్టడీ సర్కిల్స్ పనివిధానాన్ని తరచుగా సమీక్షించాలి. అప్పుడే

(మిగితా.... పేజీలో)

నివేదిక

# ఆకలి నిర్మూలనలో వైఫల్యం



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ-ఎఫ్ఎఒ- "ప్రపంచంలో ఆహారభద్రత, పోషకాహార లభ్యత" అన్న అంశాలపై 2020 సంవత్సరం నివేదికను విడుదల చేసింది. ఆహార అభద్రత, ఆకలి, వివిధ రకాలైన పోషకాహార లోపాలను అధిగమించాలని ప్రపంచదేశాలు నిర్ణయించుకున్న గడువు ముగిసిన ఐదు సంవత్సరాల తర్వాత కూడా మనం 2030లో ఆ లక్ష్యాన్ని సాధించటానికి సగం దూరంలో ఉంటామని నివేదికలో పేర్కొన్నారు. ప్రపంచం స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలో చెప్పిన విధంగా సురక్షితమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటం లేదా అన్ని విధాలైన పోషకాహార లోపాలను నిరోధించేవైపుకు గానీ సాగిపోవటం లేదు. ఆర్థికాభివృద్ధి మందగించటం ఈ ప్రయత్నాలపై ప్రభావం చూపిందని 2019లో రూపొందించిన నివేదిక వెల్లడించింది. 2020లో కోవిడ్ మహమ్మారి సంభవించటం, తూర్పు ఆఫ్రికాలో మిడతల దండు సృష్టించిన విధ్వంసం ఎవరూ ఊహించనివి. ఇవి పరిస్థితిని మరింత దిగజార్చాయని స్పష్టం చేసింది.

గణనీయమైన సంఖ్యలో ప్రపంచ ప్రజానీకానికి ఆహారం అందుబాటులో లేకపోవటం, పోషకాహారం, సూక్ష్మ పోషకాలు లభించకపోవటం వలన బాలలు గిడసబారిపోవటం(వయసుకు తగినంత ఎత్తులేకపోవటం), కుంచించుకుపోవటం(ఎత్తుకు తగినంత బరువు లేకపోవటం) తదితర దుష్ఫలితాలకు గురవుతున్నారు. మహిళలకు పోషకాహార లభ్యతలో వివక్ష గురించి అధ్యయనంలో వెల్లడైన అంశాలను నివేదికలో పొందుపర్చారు. నివేదికలో పేర్కొన్న అంకెలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి. కాని వాటిని పరిష్కరించటం కోసం చేసిన అనేక సూచనలు బహుళజాతి సంస్థలు, బడా కార్పొరేట్లు, ధనికదేశాలు చెబుతున్న పరిష్కారాలను ప్రతిబింబిస్తున్నాయి. అందుకు కారణం ఎఫ్ఎఒలో పనిచేస్తున్న, అధ్యయనాలను నిర్వహిస్తున్న నిపుణులలో అత్యధికులు సరళీకరణ ఆర్థిక విధానాలతో ప్రభావితమైన, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నవారుంటారు. అందువలన ఇటువంటి నివేదికలలో సమస్యల పరిష్కారం కోసం వారుచేసే సూచనలు, ఆయా దేశాలకు ఇచ్చే సలహాలు అదే ప్రాతిపదికపై ఉంటాయి. ఈ నివేదికలో కూడా అటువంటి పరిష్కారాలను పేర్కొన్నారు. అటువంటి వాటికి సంబంధించిన సరైన విశ్లేషణను చేస్తూ, ఎటువంటి చర్యలు తీసుకొంటే ఈ నివేదికలో పేర్కొన్న సమస్యలు పరిష్కారం అవుతాయనేది పరిశీలిద్దాం.

కోవిడ్ 19 మహమ్మారి ప్రారంభానికి ముందు 69 కోట్లమంది ప్రజలు, ప్రపంచ జనాభాలో 8.9 శాతం మంది అవసరమైనంత ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారని నివేదిక స్పష్టం చేస్తున్నది. చైనాలో తగితంత ఆహారాన్ని తీసుకోలేని వారి గురించి 2000 సం. నుండి ఉన్న పాత నివేదికలను బదులుగా నూతన నివేదికలు రావటంతో అక్కడ వీరిశాతం తగ్గింది. ప్రపంచ జనాభాలో చైనా 20 శాతాన్ని కలిగి ఉండటంతో ప్రపంచంలో ఆకలితో అలమటిస్తున్న వారి శాతం తగ్గింది. మరోవైపున 2014 నుండి ప్రపంచంలో ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2014-19 మధ్య ఆకలితో బాధపడుతున్న వారి జాబితాలో ఆరుకోట్ల మంది అదనంగా చేరారు. ఇదేక్రమం కొనసాగితే 2030 నాటికి ఆకలితో అలమటిస్తున్న వారిసంఖ్య 84 కోట్లకు చేరుతుంది. కాబట్టి కోవిడ్ వ్యాపించకపోయినప్పటికీ నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం ఆకలిని నిర్మూలించటం సాధ్యమయేది కాదని ఈ అంకెలు వెల్లడిస్తున్నాయి. కోవిడ్ వలన అదనంగా 8 నుండి 13 కోట్లమంది ఆకలి బాధితుల జాబితాలో చేరతారు. ఆకలి బాధితుల సంఖ్యను తగ్గించటానికి, కోవిడ్ ఫలితంగా ఏర్పడిన దుష్ప్రభావాలను అధిగమించటానికి ప్రభుత్వాలు తక్షణమే అత్యవసర చర్యలు తీసుకోకపోతే మరింత మంది ప్రజలు ఆకలితో బాధపడేవారి జాబితాలో చేరే పరిస్థితులున్నాయి. కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికే ఆహార సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కోవిడ్ మహమ్మారి తీవ్రంగా వ్యాపిస్తున్నపుడు విధించిన ఆంక్షల వలన ఆహారాన్ని మార్కెట్లకు సరఫరా చేయటం, ప్రజలకు అందింటచటంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. వివిధ దేశాలలో అమలు జరిపిన లాక్‌డౌన్‌లు, ఆంక్షలు విధించటం ప్రజల కొనుగోలుశక్తిని దెబ్బతీశాయి. ముఖ్యంగా పేదలు, ఆదాయం లేనటువంటి తరగతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

### పోషకాహారాన్ని తగ్గించుకొంటున్న ప్రజలు

ప్రపంచజనాభాలో 25.9 శాతం, అనగా 200 కోట్లమంది తాము క్రమబద్ధంగా తీసుకొనే ఆహారాన్ని తగ్గించుకోవటం లేదా ఆహార నాణ్యతను తగ్గించుకోవటం చేస్తున్నారని నివేదికలో పేర్కొన్నారు. అవసరమైనన్ని పోషకాలతో కూడిన ఆహారాన్ని వారు తీసుకోలేకపోతున్నారు. ఈ విధమైన ఆహార అభద్రత బాలల, మహిళలు తీసుకుంటున్న ఆహారనాణ్యతను దెబ్బతీసింది. ఫలితంగా వారిలో పెరుగుతున్న పోషకాహార లోపం వివిధ రకాలుగా వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. పుడుతున్న చిన్నారుల్లో 16.4 శాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారు. దీనిని తగ్గించటంలో కొంత అభివృద్ధిని సాధించినప్పటికీ 2025-30 నాటికి సాధించాలనుకున్న మూడోవంతు తగ్గింపుకు దూరంగా ఉన్నాం. ఐదు సంవత్సరాలలోపు వయసున్న 14.40 కోట్లమంది-ప్రపంచబాలల్లో 21.3 శాతం- గిడసబారిపోయారని ( ఎత్తుకు తగినంత బరువు లేకపోవటం), 4.70 కోట్లమంది- 6.9 శాతం- కుంచించుకుపోయారని (వయసుకు తగినంత

> **ప్రపంచంలోని ప్రజలందరికీ అవసరమైనంత ఆహారం ఉత్పత్తి అవుతున్నది. మరోవైపున 150 కోట్లమంది అత్యవసరమైన పోషకాలను పొందలేకపోవటం, మరో 300 కోట్లమంది చౌకైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా పొందలేకపోతున్న స్థితిలో ప్రపంచం ఉన్నది. కోవిడ్ 19 ఫలితంగా ఏర్పడిన ఆర్థిక, సామాజిక పరిస్థితులు, ఆరోగ్యకారణాల రీత్యా రానున్నకాలంలో అత్యంత దిగువస్థాయిలోని ప్రజల ఆహారలభ్యత, నాణ్యత మరింత దిగజారుతుంది.**

ఎత్తులేకపోవటం) 2019లో జరిగిన అధ్యయనాలలో వెల్లడైంది. ప్రపంచంలోని బాలల్లో 28.2 శాతం, నాలుగోవంతుకు పైగా గిడసబారిపోవటం లేదా కుంచించుకుపోతున్నారు. 3.83 కోట్లమంది–5.6 శాతం –అధికబరువుతో ఉన్నారు. కనీసం 34 కోట్ల మంది బాలలు సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడుతున్నారు. 2000–19 మధ్య బాలలు గిడసబారిపోవటం మూడింట ఒకవంతు తగ్గినప్పటికీ, 2030 నాటికి గిడసబారిపోవటం, కుంచించుకుపోవటాన్ని అదుపుచేయటం, అధికబరువును నిరోధించటం, అవసరమైనంత పోషకాహారాన్ని అందించేవైపుగా ప్రపంచం సాగిపోవటం లేదని నివేదికలో పేర్కొన్నారు. గిడసబారిపోవటం సంవత్సరానికి 2.3 శాతం చొప్పున తగ్గుతున్నప్పటికీ, 2025నాటికి 40 శాతం, 2030 నాటికి 50 శాతం తగ్గించాలన్న లక్ష్యం సాధించాలంటే సంవత్సరానికి 3.9 శాతం చొప్పున తగ్గించాలి. ఇప్పటి తీరే కొనసాగితే 2035, 2043 నాటికి మాత్రమే ఈ లక్ష్యాలను సాధించగలం.

యూరప్‌లోని తొమ్మిది దేశాలలోని 10 నగరాలలో జరిపిన సర్వేలో కౌమారదశలో ప్రవేశిస్తున్నవారు వారికి అవసరమైన పళ్ళు, కూరగాయలలో సగమే తీసుకొంటుండగా, పాలు మూడింట రెండొంతులు మాత్రమే తీసుకొంటున్నారు. మాంసం, కొవ్వులు, పంచదార ఎక్కువగా ఉన్న ఆహారాన్ని, పానీయాలను ఎక్కువగా తీసుకొంటున్నారు. తక్కువ ఆదాయం, తక్కువ మధ్యస్థాయి ఆదాయం వస్తున్న దేశాలలోని ప్రజలు ముతకధాన్యాలు, దుంపలు, ఆకుకూరలు, వేర్లు తదితరాలు ఎక్కువగా తింటున్నారు. 2017లో తక్కువ, మధ్య ఆదాయదేశాలలో తలసరి ముతకధాన్యాల వినియోగం 391 గ్రాములుండగా, అధిక ఆదాయం వస్తున్న దేశాలలో 259 గ్రాములు ఉన్నది. అంటే అధిక ఆదాయం వస్తున్న దేశాలలోని ప్రజల కన్నా మిగతా దేశాలలోని ప్రజలు సగటున 132 గ్రాముల ఆహారధాన్యాలను అధికంగా తీసుకొంటున్నారు. ఆ మేరకు పోషకాలున్న ఆహారాన్ని తక్కువ తీసుకొంటున్నారు. అధిక ఆదాయం వస్తున్న దేశాలు, ఆసియా దేశాలలో మాత్రమే ఎఫ్ఎఒ సూచించిన విధంగా రోజుకు తలకు 400 గ్రాములు తినటానికి అవసరమైనన్ని కూరగాయలు, పండ్లు లభిస్తున్నాయి. అందరికీ సరిపడినన్ని లభిస్తున్నప్పటికీ ప్రజలందరికీ అందే విధంగా వాటిని పంపిణీ చేయటంలో వ్యత్యాసాలున్నాయి. ఆఫ్రికా, మిగతా ప్రాంతాలలో అవసరమైనంత పోషకాహారం అందుబాటులో ఉండటం లేదు.

గిడసబారటాన్ని తగ్గించటంలో మిగతా ప్రాంతాల కన్నా మధ్య, తూర్పు ఆసియా, కరీబియన్ ప్రాంతదేశాలు ముందున్నాయి. పట్టణప్రాంతాల కన్నా గ్రామీణప్రాంతాలలో, ఎక్కువ ఆదాయం వస్తున్నవారి కన్నా తక్కువ ఆదాయం వస్తున్న వారిలో గిడసబారటం ఎక్కువగా ఉన్నది. 2019లో కుంచించుకుపోతున్న బాలలు 6.9 శాతం ఉన్నారు. 2025 నాటికి 5 శాతంకు, 2030 నాటికి 3 శాతంకు తగ్గించాలన్న లక్ష్యం కన్నా ఇది ఎక్కువగానే ఉన్నది. ఎక్కువ ప్రాంతాలలో బాలలలో ఊబకాయాన్ని తగ్గించే లక్ష్యాలలో వెనుకబడే ఉన్నారు. పెద్దలలో అధికంగా బరువు పెరగటం అన్ని ప్రాంతాలలోనూ ఉన్నది. ఇది 2012లో 11.8 శాతం ఉండగా, 2016లో 13.1 శాతానికి పెరిగింది. ఇదే విధంగా 2.6 శాతం చొప్పున పెరుగుతూపోతే 2025 నాటికి 40 శాతానికి చేరుతుంది. పెద్దలు బరువు పెరగటానికి తక్కువ ధరలలలో లభిస్తున్న శక్తినిచ్చే ఆహారం కారణమౌతున్నదని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం ధరలు ఎక్కువగా ఉండటం వలన తక్కువ పోషకాలుండి, చౌకగా లభించే ఆహారం తినటం, పంచదారతో చేసినవి ఎక్కువగా తీసుకోవటం, తీపి పానీయాల వినియోగం పెరగటం పెద్దలు బరువు పెరగటానికి దారితీస్తున్నాయి. పాలు, గుడ్లు, మాంసం, చేపలు, ఇతరంగా బాలలు తీసుకొనే ఆహారం ధరలు తక్కువగా ఉండటం గిడసబారటం తగ్గించటానికి దారితీశాయి.

ప్రపంచంలోని ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనలేనంత ఎక్కువగా ధరలు ఉండటమే పోషకాహార లోపానికి ప్రధాన కారణంగా ఉంది. కుటుంబ పోషకాహార అవసరాలను తీర్చుకోవటానికి తగినంత ఆదాయం రాకపోవటం, ఉపాధిని కోల్పోవటం ఇందుకు కారణాలుగా ఉన్నాయి. ప్రపంచంలోని ప్రజలందరికీ అవసరమైనంత ఆహారం ఉత్పత్తి అవుతున్నది. మరోవైపున 150 కోట్లమంది అత్యవసరమైన పోషకాలను పొందలేకపోవటం, మరో 300 కోట్లమంది చౌకైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా పొందలేకపోతున్న స్థితిలో ప్రపంచం ఉన్నది. కోవిడ్ 19 ఫలితంగా ఏర్పడిన ఆర్థిక, సామాజిక పరిస్థితులు, ఆరోగ్యకారణాల రీత్యా రానున్నకాలంలో అత్యంత దిగువస్థాయిలోని ప్రజల ఆహారలభ్యత, నాణ్యత మరింత దిగజారుతుంది. ప్రస్తుతం చేస్తున్న విధంగానే ఆహారభద్రత కార్యక్రమం కొనసాగితే వచ్చే దశాబ్దంలో కూడా ఆహార అభద్రతను తొలగించటం సాధ్యం కాదు.

**పోషకాహారం అందుబాటులో లేకుండా చేస్తున్న అంశాలు**

పోషకాహారాన్ని అందుబాటులో లేకుండా చేస్తున్న అంశాలను పరిశీలించాలి. బడాసంస్థలు, సూపర్‌మార్కెట్ల చెయిన్‌లు, ప్రాసెసింగ్ కార్యక్రమాలు తదితరాల వలన ఆహారధరలు పెరుగుతున్నాయి. చిన్నస్థాయిలో ఆహారాన్ని ఉత్పత్తి చేసే సాధారణ రైతులే తక్కువధరలకు మార్కెట్లకు సరఫరా చేస్తున్నారు. వారిని ప్రోత్సహించటం, వారు తగిన మద్దతు ధరలు పొంది, ఆహారోత్పత్తిని కొనసాగించే విధంగా చేయటమే తక్కువ ధరలకు ఆహార సరఫరా కొనసాగేలా చేయటంలో ప్రధానమైనది. అధికధరల వలన ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని పొందలేని స్థితిని నివారించాలి. ఆహార సరఫరా గొలుసులో భాగంగా ఉన్నవారందరికీ ఆరోగ్యకరమైన ఆహారం పొందటానికి అవసరమైనంత ఆదాయం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. పోషకాహారాన్ని అందించే వ్యవసాయ విధానాలపై శ్రద్ధపెట్టి, అందుకోసం పెట్టుబడులు పెట్టటానికి ప్రోత్సాహకాలను కల్పించాలి.

**ఆరోగ్యకరమైన ఆహారంలో ఉండాల్సినవి**

> “ పోషకాహార లోపాన్ని తగ్గించటంలో చైనా గణనీయమైన ప్రగతి సాధించింది. చైనా ప్రజల దీర్ఘకాలిక వ్యాధులు, పోషకాహారం” నివేదికను 2015లో ప్రచురించారు. దీనిలో చైనా ప్రజలు పోషకాహారం పొందటంలో సాధించిన అభివృద్ధిని, పెద్దలలో పోషకాహార లోపం తగ్గటాన్ని గురించి కూడా పేర్కొన్నారు. 18.5 కిలోల కన్నా తక్కువ బరువున్న వారిలో శారీరక వృద్ధి పెరిగిందని, 6 సం.ల వయసు లోపు పిల్లలలో గిడసబారటం 2002లో 16.3 శాతం నుండి 2013లో 8.1 శాతానికి తగ్గిందని చెప్పారు. ”



స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు నిండినా దేశంలో ఇంకా తగ్గని ఆకలి కేకలు

2014-19 మధ్య ఉత్తర అమెరికా, యూరప్‌లలో మినహా మిగతా అన్ని ప్రాంతాలలోని దేశాలలో ఆహార అభద్రత పెరిగింది. పురుషుల కన్నా మహిళలలో ఆహార అభద్రత ఎక్కువగా ఉన్నది. ఆరోగ్యకరమైన ఆహారంలో సూక్ష్మపోషకాలన్నీ ఉండాలి. వయసు, లింగం, శారీరక కార్యకలాపాలపై ఆధారపడి ప్రతివారి ఆహారంలో విటమిన్లు, మాంసకృత్తులు, ఖనిజాలు, కొవ్వు పదార్థాలు, ఫైబర్‌తో కూడిన కార్బొహైడ్రేట్లు అవసరమైన మేరకు ఉండాలి. ఆరోగ్యకరమైన ఆహారంలో శక్తినిచ్చే కరగని (అన్ శాచ్యురేటెడ్) కొవ్వు పదార్థాలు 30 శాతం కన్నా తక్కువగా ఉండాలి. తీపిలేని లేదా 5 శాతం కన్నా తక్కువ తీపి పదార్థాల ద్వారా 10 శాతం శక్తినిచ్చే వాటిని తీసుకోవాలి. రోజుకు 400 గ్రాములకు తగ్గకుండా కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. 5 గ్రాములకు మించకుండా అయోడిన్ కలిపిన ఉప్పు ఉండాలి.

ఆహారం నాణ్యత పెరిగేకొద్దీ ధరకూడా పెరుగుతున్నది. ఆరోగ్యకరమైన ఆహారం ధర పోషకాలతో కూడిన ఆహారం ధరకన్నా 60 శాతం అధికంగా ఉండగా, శక్తినిచ్చే ఆహారం ధర కన్నా ఐదురెట్లు అధికంగా ఉన్నది. శక్తినిచ్చే ఆహారం అంటే ఆ రోజు పనిచేయటానికి శరీరానికి అవసరమైన శక్తినిచ్చే ఆహారం. దీనిలో ప్రధానంగా బియ్యం, గోధుమ, మొక్కజొన్న లాంటి ధాన్యాలు ఉంటాయి. పోషకాలతో కూడిన ఆహారంలో పైన చెప్పిన శక్తినిచ్చే ఆహారంతో పాటు కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు, అత్యవసర విటమిన్లు, ఖనిజాలతో కూడిన 23 స్థూల, సూక్ష్మ పోషకాలు ఉండాలి. ఆరోగ్యకరమై ఆహారం అంటే శక్తిని, పోషకాలను ఇచ్చేవాటితో పాటు వివిధ రకాలైన ఆహార పదార్థాల గ్రూపుల నుండి అవసరమైన ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఈ ఆహారం శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన వాటిని అందించటంతో పాటు, అన్ని విధాలైన పోషకాహారలోపాన్ని, ఆహారలోపం వలన సంభవిస్తున్న వ్యాధులను నివారించటానికి తోడ్పడుతుంది.

ప్రపంచవ్యాపితంగా పేదలు కేవలం శక్తినిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నారు. పోషకాలున్న లేదా ఆరోగ్యకరమైన ఆహారం వారికి అందుబాటులో లేదు. అంతర్జాతీయ దారిద్ర్యరేఖ 1.90 డాలర్ల కన్నా ఆరోగ్యకరమైన ఆహారం ఖరీదు చాలా ఎక్కువగా ఉన్నది. ఆదాయ పంపకంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాల వలన 2017లో 300 కోట్లమంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోలేకపోయారు. వీరిలో 190 కోట్లమంది ఆసియాలో, 96.50 కోట్లమంది ఆఫ్రికాలో ఉన్నారు. లాటిన్, కరీబియన్, ఉత్తర అమెరికాలలో తక్కువమంది ఉన్నారు.

**పోషకాహార లోపాన్ని తగ్గించటంలో చైనా ప్రగతి**

పోషకాహార లోపాన్ని తగ్గించటంలో చైనా గణనీయమైన ప్రగతి సాధించింది. చైనా ప్రజల దీర్ఘకాలిక వ్యాధులు, పోషకాహారం” నివేదికను 2015లో ప్రచురించారు. దీనిలో చైనా ప్రజలు పోషకాహారం పొందటంలో సాధించిన అభివృద్ధిని, పెద్దలలో పోషకాహార లోపం తగ్గటాన్ని గురించి కూడా పేర్కొన్నారు. దానిలో 18.5 కిలోల కన్నా తక్కువ బరువున్న వారిలో శారీరక వృద్ధి పెరగటాన్ని, 6 సం.ల వయసు లోపు పిల్లలలో గిడసబారటం 2002లో 16.3 శాతం నుండి 2013లో 8.1 శాతానికి తగ్గినట్లు చెప్పారు. 2011, 2013, 2015, 2017లలో చైనాలో జరిగిన సర్వేల నివేదికలను ఎఫ్ఎఒ ప్రచురించింది. ఆహార వినియోగం, అందుకోసం చేస్తున్న ఖర్చును గురించి దానిలో పేర్కొన్నారు. ఈ నివేదికల ప్రకారం చైనాలో తగినంత ఆహారం తీసుకోలేని వారు 2017లో 2.5 శాతం మాత్రమే ఉన్నారు.

**2008-09 మాంద్యంతో తీవ్రమైన దరిద్రం**

2008-09లో ప్రారంభమైన ఆర్థికమాంద్యం తర్వాత కొన్ని దేశాల్లో దరిద్రం మరింత తీవ్రమైంది. ఆకలి సమస్యను తీవ్రం చేయటంలో అది పెద్దపాత్రను పోషించింది. గత రెండు దశాబ్దాలలో పేదదేశాలలో అభివృద్ధి జరిగిన ఫలితంగా ఆకలి సమస్య కొంతమేరకు తగ్గింది. ఐనప్పటికీ సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఈ సమస్య తీవ్రంగానే ఉంది. 2030 నాటికి ప్రపంచంలో ఆకలితో అలమటించే ప్రజలలో అత్యధికులు సబ్ సహారా ఆఫ్రికాలో ఉంటారు. అంటే రానున్న కాలంలో కూడా ఆహారోత్పత్తి చేయటం, ప్రజలకు అందించటం, పోషకాహారలోపాన్ని నివారించటంలో సబ్ సహారా ఆఫ్రికా అట్టడుగు స్థానంలో ఉంటుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది.

**తూర్పు, దక్షిణాసియాలలోని పరిణామాలు**

ఆసియాలోని రెండు పెద్ద దేశాలైన చైనా, భారత్‌లు గత 25 సంవత్సరాల నుండి సగటున 8.6, 4.5 శాతం చొప్పున అభివృద్ధి చెందుతున్నాయి. ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉండటంతో దక్షిణాసియా దేశాలైన నేపాల్, పాకిస్తాన్, శ్రీలంకలలో గత 10 సం.లలో ఆకలి సమస్యను తగ్గించారు. ఐనప్పటికీ దక్షిణాసి

> **❝ పిల్లలను కనే వయసు-15 నుండి 49 సంవత్సరాల మధ్య-లో ఉన్న మహిళలలో రక్తహీనతను అధిగమించటం తీవ్రమైన సవాలుగా ఉన్నది. 2016లో చేసిన అధ్యయనం ప్రకారం ప్రపంచంలో పిల్లలను కనే వయసున్న వారిలో 32.8 శాతం-61.3 కోట్లమంది-రక్తహీనతతో బాధపడుతున్నారు. 2012 నుండి ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. ❞**

యాలో ఆహారకొరత కేంద్రీకృతమైవుంది. 2017లో ఆహార అభద్రత 30 శాతం కన్నా తక్కువగా ఉండగా, 2019 నాటికి 36 శాతం కన్నా అధికంగా ఉంది. ఈరోజు ఆహార అభద్రతతో బాధపడే 200 కోట్లమందిలో 103 కోట్లమంది ఆసియాలో, 67.5 కోట్ల మంది ఆఫ్రికాలో, 20.5 కోట్లమంది లాటిన్ అమెరి కాలో, 8.8 కోట్లమంది కరీబియన్ దేశాల్లో, ఉత్తర అమెరికా, యూరప్‌లలో 59 లక్షల మంది ఓషియా నియా-ఆస్ట్రేలియా, న్యూజీలండ్, ఫిజి, ఇతరదీవులు- దేశాలలో ఉన్నారు. ఆసియా ఖండదేశాలలో 50 శాతంకు పైగా ఉండగా, ఆఫ్రికాలో 33 శాతానికి పైగా ఉన్నారు.

**ఆహార అభద్రత- లింగ వివక్ష**

2014 నుండి 2019 మధ్యకాలంలో కుటుంబాల వారీ కాకుండా కుటుంబంలోని వ్యక్తులకు లభ్యమౌతున్న ఆహారంలోని వ్యత్యాసాలను 140 దేశాల నుండి ఎఫ్ఎఓ సేకరించింది. పురుషులు, మహిళలకు లభ్యమౌతున్న ఆహారంలోని అసమానతలను ఈ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచవ్యాపితంగా ఒక మాదిరి నుండి అత్యంత తీవ్రమైన ఆహార అభద్రత పురుషుల కన్నా మహిళలలో ఎక్కువగా ఉన్నది. 2018, 19లలో ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో పురుషులు, మహిళలకు లభిస్తున్న ఆహారంలో అసమానతలు పెరిగాయి. ఐదింంట ఒకవంతుగా ఉన్న దిగువ 20 శాతం కుటుంబాలలోని మహిళలలో ఆహార అభద్రత అత్యంత తీవ్రంగా ఉంది. ఇదో విషయాన్ని స్పష్టం చేస్తున్నది. కుటుంబంలో అందరూ తినటానికి సరిపోను ఉంటేనే మహిళలకు అవసరమైనంత ఆహారం లభిస్తుంది. కుటుంబంలో తగినంత ఆహారం అందుబాటులో లేకపోతే ఆ లోటును ఎక్కువ భాగం మహిళలు భరించాల్సి వస్తున్నదని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అత్యంత తక్కువ ఆదాయం వచ్చే వీరిలోనే అతి తక్కువ శాతం విద్య, ఎక్కువ నిరుద్యోగంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి వారిలో ఎక్కువ శాతం గ్రామాలలోనే నివసిస్తున్నారు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల ప్రాతిపదికగా మహిళలు 13 శాతం, అంతకన్నా ఎక్కువ ఆహారకొరతను ఎదుర్కొంటుండగా, ప్రపంచవ్యాపితంగా 27 శాతం మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఒకే విధమైన విద్య, ఆదాయం ఉన్న, ఒకేప్రాంతంలో నివసిస్తున్న పురుషుల కన్నా మహిళలకు ఆహార అందుబాటు తక్కువగా ఉంటున్నదని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది.

**రక్తహీనత:** పిల్లలను కనే వయసు-15 నుండి 49 సంవత్సరాల మధ్య-లో ఉన్న మహిళలలో రక్తహీనతను అధిగమించటం తీవ్రమైన సవాలుగా ఉన్నది. 2016లో చేసిన అధ్యయనం ప్రకారం ప్రపంచంలో పిల్లలను కనే వయసున్న వారిలో 32.8 శాతం-61.3 కోట్లమంది-రక్తహీనతతో బాధపడుతున్నారు. 2012 నుండి ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. 2021లో వచ్చే నివేదిక ఈ పరిస్థితి మెరుగైందా లేదా మరింత దిగజారిందా అన్న వివరాలను వెల్లడిస్తుంది.

6 నుండి 23 నెలల వయసున్న పిల్లలకు తల్లిపాలు, ధాన్యాలు, వేళ్ళు, దుంపలు, చిక్కుళ్ళు, కాయలు, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేపలు, కోడిమాంసం, గుడ్లు, విటమిన్ ఎ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తదితర ఎనిమిది రకాలైన వాటిలో కనీసం ఐదు రకాలైన ఆహారాన్ని అందించాలి. పిల్లలకు ప్రతిరోజు 24 గంటలలో ఎన్ని రకాల వైవిధ్యభరితమైన ఆహారాన్ని ఇస్తున్నామనేది ప్రధానమైనది. ప్రపంచవ్యాపితంగా ప్రతి ముగ్గురిలో ఒకరు మాత్రమే సూచించిన ఎనిమిది రకాలలో ఐదు రకాల ఆహారాలను తీసుకోగలుగుతున్నారు. అంటే ఆ వయసులో తమ శారీరక, మానసిక అభివృద్ధికి దోహదం చేసే, తమ శక్తిసామర్థ్యాలను వికసింపజేసే ఆహారాన్ని 67 శాతం మంది పిల్లలు తీసుకోలేకపోతున్నారని స్పష్టమౌతున్నది.

**ఆహారధరలపై వాణిజ్య విధానాల ప్రభావం**

వాణిజ్య విధానాలు కూడా ఆహారధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచ ఆహారభద్రతలో వాణిజ్యం పాత్ర క్రమంగా పెరుగుతున్నది. గత దశాబ్దంలో వ్యవసాయ సరుకుల వాణిజ్యం పెరగటంతో పాటు ఆహారోత్పత్తుల వాణిజ్యం 20 శాతం పెరిగింది. అభివృద్ధి చెందుతున్న, తక్కువ, మధ్యస్థాయి ఆదాయదేశాలు శక్తినిచ్చే ఆహారాన్ని దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా, దక్షిణకొరియా, జపాన్, రష్యా, సౌది అరేబియా ఈ ఐదు దేశాలు మొత్తం 40 శాతం ఆహారాన్ని దిగుమతి చేసుకొంటుండగా, ఏడు దేశాలు అర్జెంటైనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, న్యూజిలాండ్, థాయ్‌లాండ్, అమెరికాలు ప్రపంచంలో ఎగుమతవుతున్న ఆహారంలో 55 శాతాన్ని ఎగుమతి చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి ఆదాయ దేశాలు కూడా ఎగుమతులను పెంచుకోవటం కోసం ప్రయత్నం చేస్తున్నాయి. దిగుమతులపై ఆంక్షలను, ఆహార ఎగుమతులపై సబ్సిడీలను రద్దుచేస్తామని ప్రకటించాయి. అయినప్పటికీ కొన్ని దేశాలు దిగుమతులపై వివిధ రకాలైన ఆంక్షలు కొనసాగిస్తున్నాయి.

ఫలితంగా ఎగుమతులు, దిగుమతులపై సుంకాలు విధించటం వలన ఆహార పదార్థాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి ఆహారధరలను పెంచటంతో సామాన్యప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండాపోతున్నది. అందువలన కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆహార ఉత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించటానికి పూనుకున్నాయి. ఫలితంగా బియ్యం, మొక్కజొన్న లాంటి పంటలలో అభివృద్ధిని సాధించినప్పటికీ, విటమిన్లు, సూక్ష్మ పోషకాలున్న ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవటంలో విఫలం అయాయి.

**ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తికి మార్గాలు**

పోషక విలువలున్న ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవటం, ఉత్పాదకతను పెంచటం కోసం పెట్టుబడులు పెట్టాలి. ఆహారోత్పత్తులపై పన్నులను ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం పరిశోధన, విస్తరణ, నూతన ఆవిష్కరణల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు పెట్టాలి. ఆహారం వృధాకాకుండా నివారించటానికి అవసరమైన చర్యలను తీసుకోవాలి. పోషకాహారాన్ని అభివృద్ధి చేయటం, రోడ్లు, రవాణా, మార్కెట్లకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి. వాణిజ్యం, మార్కెటింగ్ విధానాలలో

> దేశంలో 19.5 కోట్లమంది ఆకలితో ఉంటున్నారని, ఇది ప్రపంచంలో ఆకలితో ఉంటున్నవారిలో నాలుగవ వంతు అని ఐక్యరాజ్యసమితి భారతీయ విభాగం చెబుతున్నది. ఆకలి సూచి లోని 113 దేశాలలో మనం 74వ స్థానంలో ఉన్నాం. జాతీయ కుటుంబసర్వే 4 ప్రకారం దేశంలో 6-59 నెలల వయసున్న పిల్లలలో 58.4 శాతం, 15-49 సంవత్సరాల వయసులోని గర్భవతులు కాని మహిళలలో 53.1 శాతం, బాలురలో 29 శాతం రక్తహీనతతో ఉన్నారు.

ఉత్పత్తిదారులైన రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాలి. ఆహార సరఫరా గొలుసుపై ప్రభుత్వ పర్యవేక్షణ, ఆధిపత్యం ఉండాలి. దరిద్రం, ఆదాయ అసమానతలను తొలగించే విధానాలను అనుసరించాలి. ప్రజలకు ఆహారాన్ని అందించే సామాజిక చర్యలైన దేశంలోని ప్రజలందరికీ నిర్దిష్ట మొత్తం ఆహార పదార్థాలను పంపిణీచేయటం, పాఠశాలలకు వెళుతున్న పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందించటం, పేదలకు పోషక విలువలు కలిగిన ఆహారానికి సబ్సిడీలు ఇవ్వటం చేయాలి. ప్రజలకు ఆహారధాన్యాలను అందించటం ఆపివేసి, నగదు బదిలీ చేయాలని బహుళజాతి సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. దాని వలన ప్రభుత్వాలు ఆహారధాన్యాలను సేకరించటం, వంపిణీ చేయటం ఆగిపోవటంతో మొత్తం ఆహారమార్కెట్‌పై ఆధిపత్యం చలాయించవచ్చునని అవి ప్రణాళికలు రూపొందించుకున్నాయి. ఈ విధానాన్ని అమలుచేస్తే ప్రజలకు ఆహారధరలు అందుబాటులో లేకుండాపోతాయి. బహుళజాతి, కార్పొరేట్ సంస్థలు అపార లాభాలను సంపాదించుకుంటాయి.

### ఆహార స్వయంసమృద్ధి

ఆహార స్వయంసమృద్ధిని సాధించుకోవటం, ప్రజలందరికీ తగిన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటానికి కీలకమైన ఆదాయ పెంపుదల, ఆదాయ అసమానతలను తగ్గించటం, బాలలలో పోషకాహార లోపాలను తగ్గించటం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటేనే సాధ్యమౌతాయి.. ఆహార స్వయంసమృద్ధిలో మొదటి అంశం ఏ దేశానికి ఆ దేశం తమ ప్రజలకు అవసరమైన ఆహారాన్ని స్వయంగా ఉత్పత్తిచేయటం, నిర్దిష్ట ప్రమాణాల మేరకు ప్రజలందరికీ అందజేసే ప్రణాళిక ప్రధానం. ఎఫ్ఎఒ నివేదికలో పేర్కొన్న విధంగా నగదు బదిలీ దానికి ప్రత్యామ్నాయం కాదు. ఆహారానికి బదులుగా నగదు బదిలీ చేయటం అంటే ప్రజలందరికీ ఆహారం లభ్యంకాదని, కార్పొరేట్లు ఆహారమార్కెట్లపై ఆధిపత్యం సాధించే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అర్థం చేసుకోవాలి. బాలలు, మహిళలకు అవసరమైన మేరకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే చర్యలు తీసుకోవాలి. ఇవి జరగాలంటే ఆదాయ అసమానతలు తగ్గాలి. నిరుద్యోగాన్ని నిర్మూలించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

ఇటువంటి చర్యలు తీసుకొంటే ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న బడా బూర్జువావర్గ ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది. అందువలననే బాలలు, మహిళలు, పేదలకు అవసరమైన మేరకు ఆహారం అందటం లేదు. ఒక్క చైనా మాత్రమే ఆకలి, పోషకాహార లోపాన్ని తగ్గించగలిగింది. ఇందుకు కారణమేమిటి? చైనాలో సోషలిస్టు వ్యవస్థ ఉంది. కాబట్టి ప్రజల ప్రయోజనాలను ప్రధానంగా తీసుకొని అందరికీ ఆహారాన్ని అందించటంతో ఆహారం అందని వారిసంఖ్య అన్ని దేశాల కన్నా తగ్గింది. సోషలిస్టు వ్యవస్థ మాత్రమే ఆకలి సమస్యను పరిష్కరించగలదని, పెట్టుబడిదారీ విధానం అకలిని, పోషకాహార లోపాన్ని నివారించలేదని స్పష్టమౌతున్నది.

### మనదేశంలోని పరిణామాలు

దేశంలో 19.5 కోట్లమంది ఆకలితో ఉంటున్నారని, ఇది ప్రపంచంలో ఆకలితో ఉంటున్నవారిలో నాలుగవ వంతు అని ఐక్యరాజ్యసమితి భారతీయ విభాగం చెబుతున్నది. ఆకలి సూచిలోని 113 దేశాలలో మనం 74వ స్థానంలో ఉన్నాం. జాతీయ కుటుంబసర్వే 4 ప్రకారం దేశంలో 6–59 నెలల వయసున్న పిల్లలలో 58.4 శాతం, 15–49 సంవత్సరాల వయసులోని గర్భవతులు కాని మహిళలలో 53.1 శాతం, అదే వయసులోని అందరు మహిళలలో 53 శాతం, పురుషులు 22.7 శాతం, యుక్తవయసులోని బాలికలలో 54 శాతం, బాలురలో 29 శాతం రక్తహీనతతో ఉన్నారు. దేశంలోని ప్రతి 10 మంది బాలలలో నలుగురు దీర్ఘకాలిక ఆహారలోపంతో బాధపడుతున్నారు. వీరు దీర్ఘకాలిక వ్యాధులకు గురికావటంతో పాటు, బరువు తక్కువ ఉన్న పిల్లలకు జన్మనిస్తున్నారు. అధికబరువు, ఊబకాయంతో ఉన్నవారు కూడా ఎక్కువ శాతం ఉన్నారు. కాని 2011–17 మధ్య దరిద్రాన్ని బాగా తగ్గించామని, ఇపుడు 8.4 కోట్లమంది మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువనున్నారని ప్రభుత్వం చెబుతున్నది. కాని దేశంలోని ప్రజలలో 22 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువనున్నారని 2019లో ఆర్‌బిఐ చెప్పింది. 2018లో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ జరిపిన అధ్యయనంలో 80 శాతం పురుష కార్మికులు, 92 శాతం మహిళలు నెలకు 10 వేల రూపాయల కన్నా తక్కువ ఆదాయం పొందుతున్నారని వెల్లడైంది. ప్రపంచ దారిద్ర్యరేఖ ప్రమాణం రోజుకు 1.90 డాలర్లు. ఆ ప్రకారం చూసినట్లైతే నలుగురున్న కుటుంబం దరిద్రరేఖను దాటాలంటే రోజుకు 7.60 డాలర్లు, రూపాయల్లో అయితే రోజుకు 560, నెలకు 16,800 రూపాయలు కావాలి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చేస్తున్న అధ్యయనాలలో వెల్లడౌతున్న అంశాలను పరిశీలిస్తే దేశంలోని సగం మందికి పైగా ప్రజలు దరిద్రరేఖకు దిగువనున్నారని స్పష్టమౌతున్నది.

ఇటువంటి పరిస్థితులలో దేశంలో ఆకలిని, పోషకాహారలోపాన్ని, బాలలు గిడసబారటం, కుంచించుకుపోవటాన్ని నివారించటం, రక్తహీనతను అధిగమించాలంటే ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత అధికంగా ఆహారధాన్యాలు, వాటితోపాటు పోషకాలున్న ఆహారాన్ని కూడా అందజేయటానికి పూనుకోవాలి. నగదు బదిలీ చేయటానికి రూపొందిస్తున్న పథకాలను పక్కన పెట్టి, ప్రజాపంపిణీ వ్యవస్థను బలపర్చాలి. మరింత పటిష్టం చేయాలి. ఆహారవంటలను ప్రోత్సహించటం కోసం కనీసమద్దతు ధరలను నిర్ణయించి, ఆ ధరలకు ప్రభుత్వం ఆహార ధాన్యాలను సేకరించి, నిల్వచేసి, ప్రజలకు అందించాలి. పాఠశాలలకు వెళుతున్న బాలలకు గుడ్డు, పాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. రక్తహీనతతో ఉన్నవారికి, గర్భవతులుగా ఉన్న మహిళలకు ప్రత్యేకంగా బలమైన ఆహారాన్ని అందించటానికి చర్యలు తీసుకోవాలి. ఆకలి సమస్యను అధిగమించి, ఆరోగ్యవంతమైన ప్రజలతో కూడిన దేశంగా అభివృద్ధి కావటానికి ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయి.

❋

అంతర్జాతీయం

# బొలీవియాలో సామాజిక శక్తులకు విజయం

**తథాగతన్ రవీంద్రన్**



రచయిత కొలంబియాలోని ఇలెసి యూనివర్సిటీలో ప్రొఫెసర్

బొలీవియాలో అక్రమంగా అధికారం హస్తగతం చేసుకున్న మితవాద శక్తులపై కార్మికులు, రైతుల ఆధ్వర్యంలోని సామాజిక ఉద్యమ సంస్థలు సంఘటితమై జరిపిన అప్రతిహత పోరాటాలతో వామ పక్షాలు తిరిగి అధికారంలోకి రావడం సాధ్యపడింది. ఎన్నికలలో విజయం సాధించిన ఇవో మొరెల్స్ 2019 నవంబర్ 12న వైమానిక దళ జెట్‌లో మెక్సికోకు ప్రవాసం వెళ్లారు. ఎన్నికలలో మోసం జరిగిందని తప్పుడు ఆరోపణలతో కొన్ని శక్తులు నిరసనలకు పూనుకున్న తరువాత రాజీనామా చేయాలని సాయుధ దళాల చీఫ్ "వత్తిడి చేసినపుడు" ఆయన పదవీ విరమణ చేశాడు. దాదాపు ఒక సంవత్సరం తరువాత, అర్జెంటీనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండెజ్‌తో కలిసి రోడ్డుమార్గం ద్వారా ఆయన బొలీవియాకు తిరిగి వచ్చాడు. అక్కడ నుండి మూడు రోజుల పాటు 800 వాహనాల కారవాన్‌తో అతను పుట్టి పెరిగిన గ్రామీణ ప్రాంతమైన ఒరినోకాతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మొరెల్స్ కోకా రైతుల నాయకునిగా రాజకీయ ప్రస్థానం ఆరంభించిన చాపారేకు వెళ్ళాడు. ఎన్నికలలో భారీ విజయం సాధించిన తరువాత సోషలిస్టు ఉద్యమ పార్టీ ఎంఎఎస్ అభ్యర్థి, మొరెల్స్ ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన లూయిస్ ఆర్స్ కాటాకోరా అంతకు ఒక రోజు ముందు దేశ కొత్త అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

బొలీవియాలో గత యేడాది ఏమి జరిగిందో వాటి నుంచి నేర్చుకున్న అతి ముఖ్యమైన పాఠాలు, తలెత్తిన అనేక ప్రశ్నలు మన కళ్ల ముందు ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. జూన్ 2020లో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన ఒక కథనంలో 2019 నవంబర్‌లో బొలీవియాలో జరిగిన తిరుగుబాటు గురించి చర్చించాను. అందులో మొరెల్స్‌ను పదవీచ్యుతుని చేయడం, దేశంలోని తీవ్ర మితవాదశక్తులు అధికారాన్ని స్వాధీనం చేసుకోవడాన్ని ప్రస్తావించాను. మితవాద ప్రభుత్వం ప్రజాతీర్పును వమ్ముచేసి, సైనికులు, అమెరికా సామ్రాజ్యవాదం అండతో, నయా ఉదారవాద విధానాల పేరుతో బాహాటంగా నియంతృత్వ పోకడలు అనుసరిస్తున్నదని ఆ వ్యాసంలో వెల్లడించాను. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో మితవాదులు అధికారంలోకి రావటం పెరిగిన సందర్భంలో నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యానికి మధ్యగల సంబంధం గురించి, బొలీవియా అనుభవాలను గురించి వివరించాను. ఒక సంవత్సరం తరువాత తీవ్ర ప్రజా ప్రతిఘటనతో అదే మితవాద శక్తులను ఓడించిన సందర్భంలో దానికి సంబంధించిన మరో ప్రశ్నను లేవనెత్తుతున్నాను: ప్రజాస్వామ్య శక్తులు అన్ని అడ్డంకులకు అధిగమించి ప్రజాస్వామ్యాన్ని ఎలా రక్షించగలిగాయి?

**మితవాదుల అణచివేత పాలన**

బొలీవియన్ సామాజిక ఉద్యమాల బలం గురించి ప్రపంచంలోని అభ్యుదయ శక్తులన్నింటికీ బాగా తెలుసు. అసాధారణ రీతిలో, నమ్మశక్యం కాని విధంగా ప్రజా సమీకరణలను చేయడంలో ప్రసిద్ధులు. 2000–2005 మధ్య ఇద్దరు అధ్యక్షులతో రాజీనామాలు చేయించి, వారసత్వ రాజ్యాంగాన్ని రద్దుచేయించారు. వారు సమీకరించిన జనబలంతో అక్రమంగా అధికారాన్ని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నించిన వారి మెడలు వంచారు. ఈ పోరాటాల ఫలితంగానే 2005లో మొరెల్స్ అధ్యక్షునిగా ఎన్నికయాడు. 2000 నుండి 2005 వరకు జన సమీకరణల వలయాన్ని విశ్లేషించి ఫారెస్ట్ హిల్టన్, సింక్లెర్ థామ్సన్ (2005) ఇలా వ్రాశారు, "లాటిన్ అమెరికాలో గత ఐదేళ్ళలో నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో బొలీవియా ముందు పీఠిన నిలిచింది."

బొలీవియన్ సామాజిక ఉద్యమాలు, ప్రజా శక్తులు దీన్ని తిరిగి సాధించాయి! అమెరికా సామ్రాజ్యవాదం పూర్తి మద్దతుతో సాయుధ దళాలు వీధులలో అరాచకాలను సృష్టించడం, దిగ్బంధనాలను నిర్వహించడం వంటి తీవ్ర మితవాద, జాత్యహంకార పాలనను వారు ఓడించారు.

తీవ్ర మితవాద శక్తులు అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పటి నుండి ప్రజలపై తీవ్రమైన అణచివేత, జాత్యహంకార దాడులు నిత్యకృత్యం అయ్యాయి. మొరెల్స్ రాజీనామా చేసినకొద్ది గంటల తరువాత తిరుగుబాటు దారులు స్వదేశీ స్వయం నిర్ణయాధికార చిహ్నమైన విఫాలా జెండాను తొలగించి తగులబెట్టారు. ఇది తీవ్రమైన ప్రభావాన్ని కలిగించింది. విఫాలాను మొరెల్స్ ప్రభుత్వం అధికారిక జాతీయ చిహ్నంగా చేసింది. జాతీయ త్రివర్ణ జెండాతో పాటు ఇది అన్ని అధికార భవనాలపై ఎగురుతుంది. విఫాల దహనం జాతి సాధించిన సామాజిక న్యాయంతో పాటు అన్ని రకాల పురోగతిపై దాడిగా ప్రజలు పరిగణించారు. ప్రధాన నగరం ఎల్ ఆల్టో నుంచి, గ్రామీణ స్వదేశీ సంఘాల నుండి వేలాది మంది నిరసనకారులు విఫాలా పతాకాలను చేతబూని పరిపాలనా రాజధాని లాపాజ్‌లోకి తరలివచ్చారు.

ప్రతిపక్ష సెనేటర్ జినైన్ అనీజ్ సెనేట్ సభ్యులలో మూడింట ఒక వంతు కంటే తక్కువ మంది మద్దతుతో తనను తాను తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రకటించుకుంది. నిరసనకారుల్ని అణచివేయటంలో ఆమె సమయం వృధా చేయలేదు. అనీజ్ బొలీవియాలో ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను హరించి వేసింది. కుట్రకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలపై జరిగిన దాడులలో 37 మంది మరణించగా 770 మంది గాయపడ్డారని అధికారికంగా ప్రచురించిన లెక్కలను బట్టి తెలుస్తున్నది.

2019న నవంబర్ 15న కొచబాంబ

ఉష్ణమండల ప్రాంతానికి చెందిన వందలాది మంది రైతులు పరిపాలనా రాజధాని లాపాజ్‌కు శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన నిర్వహించుకునేందుకు సైన్యాన్ని అనుమతి కోరినప్పటికీ పోలీసులు భాష్ప వాయువును ప్రయోగించారు. ఎలాంటి రక్షణలేని ప్రజలపై సైన్యం కాల్పులు జరపటంతో పాటు హెలికాప్టర్ల నుండి కూడా దాడి చేశారు. అదే సమయంలో ఎల్ ఆల్టోలోని సెంకాటా పరిసరాల్లోని నివాసితులు తమ పరిసరాల్లోని గ్యాస్ రిఫైనరీపై దిగ్బంధనాన్ని విధించారు. వారిపై దాడికి అనీజ్ ప్రభుత్వం సాయుధ బలగాలను పంపించింది. వారు ముందస్తు హెచ్చరిక లేకుండా నిరసనకారులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది చనిపోయారు.

24 నవంబర్ 2019 న ఎంఎఎస్‌కు మూడింట రెండు వంతుల మెజారిటీ ఉన్న శాసనసభ 120 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహించడానికి ఏకగ్రీవంగా ఒక చట్టాన్ని ఆమోదించింది. ప్రభుత్వం, సామాజిక ఉద్యమ సంస్థల మధ్య కూడా చర్చలు జరిగాయి. కొత్త ఎన్నికల హామీ తాత్కాలికంగా ప్రజా పోరాటాలను మందగింప చేసింది.

అయితే అనీజ్ ప్రభుత్వం స్వర్గం నుండి ఒక వరం అందుకుంది. ఇది కోవిడ్-19 మహమ్మారి. బొలీవియాలో కోవిడ్-19 కేసులు ప్రారంభం కావటంతో ప్రభుత్వం జాతీయ క్వారంటైన్ ప్రకటించింది, దీనితో అసంఘటితరంగంలో వాణిజ్య కార్యకలాపాలకు భారీ దెబ్బ తగిలింది. ఈ వాస్తవాన్ని ప్రజలకు వివరించాల్సింది పోయి దీన్ని అవకాశంగా తీసుకుని జాత్యహంకార ప్రచారాన్ని ముమ్మరం చేసింది. తిరుగుబాటుకు, ప్రతిఘటనకు ప్రధాన కేంద్ర బిందువులుగా ఉన్న నగరాలు, పట్టణాల్లోని ప్రజా కమిటీల(నైబర్‌హుడ్ కమిటీస్)పై కఠినమైన నిర్బంధాన్ని అమలు చేసేందుకు, ప్రజలను నియంత్రించేందుకు ట్యాంకులను పంపారు. క్వారంటైన్‌ను అంతం చేయాలని, విద్యుత్ బిల్లులపై రాయితీలను కొనసాగించాలని, బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలను వాయిదా వేయాలని ఆందోళనలు జరిగాయి. ఆందోళనలు జరుగుతున్న పరిసరాల్లో భాష్పవాయువును ప్రయోగించడానికి ప్రభుత్వం హెలికాప్టర్లు, సైనిక ట్యాంకులను పంపింది.

బొలీవియాలో క్వారంటైన్‌ను అమలు చేసినప్పటికీ అత్యధిక కోవిడ్-19 తలసరి మరణాల రేటును కలిగి ఉంది . మహమ్మారిని నియంత్రించడంలో ప్రభుత్వ నిర్వహణ చాలా అసమర్థంగా, అవినీతిమయంగా ఉన్నట్టు స్పష్టమైంది. అయినప్పటికీ ఇది పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. మహమ్మారి భయానక సంఘటనలు ఎంత ఎక్కువగా ఉన్నాయో, ఎన్నికలను వాయిదా వేసి అధికారంలో కొనసాగడానికి ప్రభుత్వం అంతకంటే ఎక్కువ సాకులు వెతుక్కుంది. మహమ్మారి వ్యాప్తిని సద్వినియోగం చేసుకొని, అనీజ్ ప్రభుత్వం సుప్రీం ఎలక్టోరల్ కోర్టుతో కలిసి ఎన్నికలను నిరవధికంగా వాయిదా వేయాలనే తన ఉద్దేశాలను బయట పెట్టుకుంది.

"2020 ఆగస్టులో ఎన్నికలు మూడవసారి వాయిదా వేసినప్పుడు కార్మికసంఘాల సమాఖ్యతో సహా సామాజిక ఉద్యమ సంస్థలు, స్వదేశీ రైతు సంస్థలు నిరవధిక సమ్మెను ప్రకటించాయి. మొదటి రోజు దేశం అంతటా 75 వ్యూహాత్మక కేంద్రాలను దిగ్బంధించారు. తరువాత కొద్దిరోజులలో దిగ్బంధించిన కేంద్రాల సంఖ్య 128 కి పెరిగింది. క్రమంగా నిరసనకారులు ఎన్నికలను వాయిదా వేయకూడదనే ప్రారంభ డిమాండ్‌కు తోడు, అనీజ్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌ను కూడా ముందుకుతెచ్చారు."



బొలీవియా నూతన అధ్యక్షుడు లూయిస్ ఆర్సె (మధ్యలో ఉన్న వ్యక్తి)

**ప్రతిఘటనకు పూనుకున్న ప్రజలు**

2020 ఆగస్టులో ఎన్నికలు మూడవసారి వాయిదా వేసినప్పుడు కార్మికసంఘాల సమాఖ్యతో సహా సామాజిక ఉద్యమ సంస్థలు, స్వదేశీ రైతు సంస్థలు నిరవధిక సమ్మెను ప్రకటించాయి. మొదటి రోజు దేశం అంతటా 75 వ్యూహాత్మక కేంద్రాలను దిగ్బంధించారు. తరువాత కొద్దిరోజులలో దిగ్బంధించిన కేంద్రాల సంఖ్య 128 కి పెరిగింది. క్రమంగా నిరసనకారులు ఎన్నికలను వాయిదా వేయకూడదనే ప్రారంభ డిమాండ్‌కు తోడు, అనీజ్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌ను కూడా ముందుకుతెచ్చారు. మహమ్మారిని నియంత్రించేందుకు అనుసరిస్తున్న అనీజ్ ప్రభుత్వ ధోరణికి తోడు పాఠశాల విద్యాసంవత్సరాన్ని ఏకపక్షంగా రద్దు చేసిన ఆమె విద్యా మంత్రి నిర్ణయాన్ని వారు విమర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ వర్కర్ యూనియన్ నాయకుడు ఫెర్నాండో గరాచీ, ''నియంతృత్వం వాస్తవంగా మారినప్పుడు, విప్లవం ప్రజల హక్కుగా మారుతుంది'' అని ప్రకటించారు.

సైనిక చర్య పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుందని తెలుసుకున్న ప్రభుత్వం, ప్రదర్శనకారులపై దమనకాండను ఉపయోగించ కుండా తప్పుకుంది. కొన్నిచోట్ల వారు నిరసనకారులపై దాడి చేయడానికి పారా మిలిటరీ బలగాలను ఉపయోగించారు. ఈ వ్యూహం ఎంతమాత్రం పనికిరానిదని స్పష్టమైంది. ఎందుకంటే మునుపటి కంటే తీవ్రత పెరిగింది. పరిపాలనను విచ్ఛిన్నం చేయడాన్ని కొనసాగిస్తే సహించబోమని, ఆరు నెలల పాటు వాడేందుకు టియర్ గ్యాస్ నిల్వలు ఉన్నాయని హోం

> **"ఎన్నికలను పర్యవేక్షించడానికి సామాజిక ఉద్యమ సంస్థలు తమ సొంత వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. సుప్రీం ఎలక్టోరల్ కోర్టుతో క్రాస్ చెక్ చేయడానికి ఎంఎఎస్ కంప్యూటింగ్ ఫలితాల సమాంతర వ్యవస్థను నిర్వహించింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పుడు లెక్కింపు కేంద్రాల్లోని ప్రతినిధులు ఓటు లెక్కల రికార్డులను ఫోటోలు, వీడియోలు తీయడం, వాటిని సోషల్ నెట్ వర్కింగ్ సైట్లలో పోస్ట్ చేయడం ప్రారంభించారు. ఈ కృషి వల్ల ఫలితాలను తారుమారు చేయటం అసాధ్యం అయింది."**

మంత్రి అర్తురో మురిల్లో నిరసనకారు లను బెదిరించాడు. హోంమంత్రి బెదిరింపు ప్రకటనపై స్పందిస్తూ ప్రభుత్వం వద్ద ఉన్న భాష్పవాయువు అయిపోతుందేమో కానీ రోడ్లను దిగ్బంధించడానికి నిరసనకారుల వద్ద ఉన్న రాళ్ళు అయిపోవు అని రాడికల్ రైతు నాయకుడు ఫెలిపే క్విస్పే హెచ్చరించారు.

బొలీవియాలోని అనీజ్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో కూడిన ప్రజావ్యతిరేకమైన, బాహాటంగా జాత్యహంకార విధానాలను అమలుచేసింది. ఆమె చేసిన ప్రసంగాలలో ''శత్రువులు'' అధికారంలోకి రాకుండా నిరోధించడానికి మితవాద పార్టీలు ఐక్యఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "శత్రువులు" అనేది బొలీవియాలో భారీగా ప్రచారంలో ఉన్న పదం. ఎందుకంటే బొలీవియాలో ఇది చారిత్రాత్మకంగా ప్రజల వెనుకబాటుతనానికి చిహ్నంగా గుర్తించబడింది. ఇదే విధమైన ధోరణితో ఆగస్టు 2020 సాధారణ సమ్మె సందర్భంగా శాంటాక్రజ్ పౌరకమిటీ అధ్యక్షుడు రోములో కాల్వో స్వదేశీ నిరసనకారులను "పౌరులు అని పిలవడానికి అనర్హమైన మానవ జంతువులు" అని వ్యాఖ్యా నించాడు.

సాధారణ సమ్మె సమయంలో ప్రజల సమీకరణ ఆపడంను అసాధ్యం అయింది. అయితే ఎంఎఎస్ పార్టీ నాయకత్వం సుప్రీం ఎన్నికల కోర్టుతో చర్చలు జరపాలని నిర్ణయించుకుని ఎన్నికలు వాయిదా వేయడాన్ని అంగీకరించింది. ఏదేమైనా, ఎన్నికలను నిర్వహించడానికి అక్టోబర్ 18 వ తేదీని గడువుగా నిర్ణయించారు.

ఎన్నికలు పారదర్శకంగా జరగటరపై తీవ్రమైన సందేహాలున్నాయి. సుప్రీం ఎలక్టోరల్ కోర్టు అధ్యక్షుడు సాల్వడార్ రొమేరో నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తాయి. అతనిని అనీజ్ నియమించటమే కాక, గతంలో అమెరికా ప్రభుత్వంలోని పలు విభాగాలతో సహకరించిన చరిత్ర కూడా ఉంది. (వికీలీక్స్ సమాచారం ప్రకారం) 2013లో హోండూరాస్‌లో నేషనల్ డెమోక్రటిక్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్‌గా ఉన్నాడు. దేశంలో జరిగిన ముందస్తు ఎన్నికలను అదే సంస్థ పర్యవేక్షించినప్పుడు అతను హోండురాస్ లోని మితవాద అభ్యర్థి జువాన్ ఓర్లాండో హెర్నాండెజ్‌కు అనుకూలంగా ఉన్నాడు.

ఎన్నికలను పర్యవేక్షించడానికి సామాజిక ఉద్యమ సంస్థలు తమ సొంత వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. సుప్రీం ఎలక్టోరల్ కోర్టుతో క్రాస్ చెక్ చేయడానికి ఎంఎఎస్ కంప్యూటింగ్ ఫలితాల సమాంతర వ్యవస్థను నిర్వహించింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పుడు లెక్కింపు కేంద్రాల్లోని ప్రతినిధులు ఓటు లెక్కల రికార్డులను ఫోటోలు, వీడియోలు తీయడం, వాటిని సోషల్ నెట్ వర్కింగ్ సైట్లలో పోస్ట్ చేయడం ప్రారంభించారు. ఈ విధమైన కృషి వల్ల ఫలితాలను తారుమారు చేయటం అసాధ్యం అయింది.

ఎంఎఎస్ అధ్యక్ష అభ్యర్థి 55 శాతం ఓట్లతో ఎన్నికలలో గెలిచారు. పార్లమెంటులోని రెండుసభల్లో కూడా ఎంఎఎస్ మెజారిటీ స్థానాలను గెలుచుకుంది. ఎన్నికల విజయంపై రాడికల్ రైతు నాయకుడు ఫెలిపే క్విస్పే, "ఊరకుక్కల శక్తి ఏమిటో చూపించాం. మానవ మృగాలం, స్థానికులం మెజారిటీ మేమే అని చూపించాం" అని వ్యాఖ్యానించాడు.

**సవాళ్ళు సంఘర్షణలు**

ఆర్స్ అధ్యక్ష పదవిని చాలా క్లిష్ట పరిస్థితులలో స్వీకరించారు. అనీజ్ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల మహమ్మారి, నిధుల దుర్వినియోగం ఆర్థికవ్యవస్థను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టివేసింది. మొరేల్స్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా నయా ఉదారవాద శృంఖలాలను విచ్ఛిన్నం చేసే ఆర్థిక విధానాలను ఆర్స్ అమలు చేశాడు. ఉదాహరణకు 2006లో గ్యాస్ పాక్షికంగా జాతీయం చేయడం వల్ల ప్రభుత్వ పెట్టుబడులు పెరుగుదలకు, పేదరికం, అసమానతలలో గణనీయమైన తగ్గింపునకు దోహదపడింది. ఆర్స్ ప్రభుత్వం అదే మార్గంలో కొనసాగే అవకాశం ఉంది. ఆర్థికవ్యవస్థకు ఊపందించడానికి ఆర్స్ ప్రభుత్వం ఉత్పత్తి, అంతర్గత డిమాండ్ పెంపుకు ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తోంది. అందుకోసం ఒక డిక్రీ ద్వారా ఆయన ఇప్పటికే జనాభాలో అత్యంత దుర్భరస్థితిలోని వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీకి ఆమోదం తెలియజేశారు.

బొలీవియన్ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలం హైడ్రోకార్బన్‌లపై ఆధారపడటం కన్నా ఇతర మార్గాలను అన్వేషించే దిశగా వైవిధ్యత పెంచాలని ఆర్స్ భావిస్తున్నారు. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామికీకరణపై దృష్టి పెట్టాలని అతని ప్రధాన ప్రణాళికలలో ఒకటి. ఈ ప్రణాళికలో భాగంగా, డీజిల్ దిగుమతులను తగ్గించుకోవడానికి, అటవీ నిర్మూలనను అరికట్టడానికి వీలుగా పునరుత్పాదక, పర్యావరణ హితమైన డీజిల్ ఉత్పత్తిని ప్రారంభించాలని ఆయన యోచిస్తున్నారు. బొలీవియాలోని లీథియం నిల్వలతో 41 పారిశ్రామిక ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 14 ప్లాంట్లను బ్యాటరీలను ఉత్పత్తి చేయటానికి ఉపయోగిస్తారు.

పింక్ టైడ్‌లో భాగంగా లాటిన్ అమెరికాలో మొరెల్స్ ప్రభుత్వంతో పాటు అధికారంలోకి వచ్చిన మరికొన్ని వామపక్ష ప్రభుత్వాల వ్యూహం బహుళజాతి సంస్థలు వెలికితీసే ప్రాజెక్టులపై ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీలను పెంచడం, ఆ వనరులను ప్రజల అవసరాలకు వినియోగించడం. దేశంలోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు భంగం కలుగకుండా ఉండేట్టు చూడడం. ఆర్థిక సంక్షోభ పరిస్థితులలో ధైర్యంతో నిర్ణయాలు తీసుకోవటం అవసరం. అందుకు ప్రభుత్వ పెట్టుబడుల కోసం బొలీవియన్ జనాభాలో 0.01 శాతంగా ఉన్న ధనవంతులపై పన్ను విధించే తన ప్రణాళికను ఆర్స్ ఇప్పటికే రూపొందించాడు.

అనీజ్ ప్రభుత్వ బాధితులు న్యాయం కోసం ఆందోళన చేస్తున్నారు. మానవ హక్కులపై ఇంటర్-అమెరికన్ కమిషన్ ఇప్పటికే 2019 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ నెలల మధ్య జరిగిన అన్ని మానవ హక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు చేయడానికి ఒక బృందాన్ని పంపింది. సకాబా ఊచకోతకు కారణమైన సైనిక జనరల్‌ను 2020 నవంబర్ 24న పోలీసులు అరెస్టు చేశారు.

తద్వారా తిరుగుబాటు సమయంలో జరిగిన ఊచకోత, ఇతరంగా మానవ హక్కుల ఉ ల్లంఘించిన వారిని శిక్షిస్తామనే సందేశం పంపారు. తరువాత రోజుల్లో వందలాది "నిష్క్రియాత్మక"సైనిక సిబ్బంది (రిటైర్డ్ లేదా పదవీ విరమణ ప్రక్రియలో ఉన్నవారు) ప్రభుత్వం సాయుధ దళాలను"హింసించడం" పట్ల నిరసన వ్యక్తం చేశారు. సాధారణంగా బొలీవియా, లాటిన్ అమెరికా చరిత్రలో సాయుధ దళాలు ప్రభుత్వ నిర్ణయాలపై వీటో అధికారాన్ని ఛలాయిస్తుంటాయి. కాని బొలీవియాలో ప్రజా ఉద్యమాలు కూడా వీటో అధికారాన్ని ఛెలాయిస్తూ, సైనిక ఆధిపత్యానికి విరుగుడుగా ఉపయోగపడుతున్నాయి. ఆ సందర్భంలో ఊచకోతలకు, తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమైన వారిపై దర్యాప్తు, విచారణ ప్రక్రియతో ముందుకు సాగాలని ఎంఎఎస్ ప్రభుత్వం నిశ్చయించు కోగా, అన్నింటా వారి ఏకైక మిత్రుడు సామాజిక ఉద్యమాలు అందుకు తోడుగా నిలిచాయి. అన్నింటినీ మించి సామాజిక ఉద్యమాలు తిరుగుబాటును ఓడించి ఎంఎఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువచ్చాయి.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, బలో పేతం చేయడంలో సామాజిక ఉద్యమాలు పోషించగల కీలకపాత్రను బొలీవియన్ అనుభవం వెల్లడిస్తున్నది. 2000 నుండి 2005 వరకు సాగిన సామాజిక ఉద్యమాలతో పాటుగా అనుసరించిన ఎత్తుగడలు ఎంఎఎస్‌ను అధికారంలోకి తెచ్చాయి. దేశంలో అత్యంత క్రూరమైన జాతివివక్ష, నయా ఉదారవాద పునరుద్ధరణకు మితవాద శక్తులు, వారి సామ్రాజ్యవాద మిత్రదేశాల ప్రయత్నాలను 2020లో ప్రజలు తిరస్కరించారు.

ఏదేమైనా దేశ చరిత్రలో ఈ వివాదాస్పద కాలంలో ఎంఎఎస్ సామాజిక ఉద్యమ సంస్థల మధ్య సంబంధాలు కూడా ఒడిదుడుకులకు లోనయ్యాయి. మూడు నిర్దిష్ట డిమాండ్ల విషయం లో సామాజిక ఉద్యమ సంస్థల అభిప్రాయాలకు భిన్నంగా ఎంఎఎస్ నాయకత్వం నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఈ విబేధాలు వ్యక్తమైనాయి. మొదటిది. సామాజిక ఉద్యమ సంస్థలు డేవిడ్ చోక్వెహువెంకాను అధ్యక్ష అభ్యర్థిగా నిర్ణయిం చాలని కోరగా ఎంఎఎస్ నాయకత్వం ఆర్స్‌ను ఎంపికచేసింది. చోక్వెహువానాను ఉపాధ్యక్షుని గా చేశారు. రెండవది సాధారణ సమ్మె సమయంలో సామాజిక ఉద్యమాలు జన సమీకర ణలను కొనసాగించాలని, అనీజ్ రాజీనామా చేయాలని వత్తిడి చేశాయి. కాని ఎంఎఎస్

❝ కేబినెట్‌లో సంస్కృతి, విద్య, గ్రామీణాభివృద్ధి వంటి మంత్రిత్వ శాఖలకు వలసల నివారణ, సామాజిక సమానత్వం వంటి ఉప మంత్రిత్వ శాఖలకు స్వదేశీ ప్రాతినిధ్యాన్ని పరిమితం చేశారు. ఇది జాతి కోణాన్ని కలిగి ఉంది. విదేశీ వ్యవహారాలను మినహాయించి వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైన మంత్రి పదవులను సాంకేతిక నిపుణులు లేదా స్థానికేతర వామపక్ష మేధావులు ఆక్రమించారు. దీనిపై రాడికల్ బృందాల మేధావులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ❞




బొలీవియా ఎన్నికల్లో ఈవో మోరేల్స్ ఫోటోలతో మూవ్‌మెంట్ ఫర్ సోషలిజం పార్టీ ప్రచారం

సుప్రీం ఎలక్టోరల్ కోర్టు అనీజ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఎన్నికలను వాయిదా వేయడాన్ని ఆమోదించింది. మూడవది ఎన్నికలలో ఎంఎఎస్ విజయం సాధించిన తరువాత కేబినెట్ సభ్యులను తమ చురుకైన కార్యకర్తల నుండి ఎన్నుకోవాలని సామాజిక ఉద్యమ సంస్థలు డిమాండ్ చేయగా, కొత్తగా నియమితు లైన మంత్రులలో చాలామంది సాంకేతిక నిపుణులైనవారు ఉన్నారు.

కేబినెట్‌లో సంస్కృతి, విద్య, గ్రామీణా భివృద్ధి వంటి మంత్రిత్వ శాఖలకు వలసల నివారణ, సామాజిక సమానత్వం వంటి ఉప మంత్రిత్వ శాఖలకు స్వదేశీ ప్రాతినిధ్యాన్ని పరిమితం చేశారు. ఇది జాతి కోణాన్ని కలిగి ఉంది. విదేశీ వ్యవహారాలను మినహాయించి వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైన మంత్రి పదవులను సాంకేతిక నిపుణులు లేదా స్థానికేతర వామపక్ష మేధావులు ఆక్రమించారు. దీనిపై రాడికల్ బృందాల మేధావులు అసం తృప్తి వ్యక్తం చేశారు.

ఎవో మొరేల్స్ అధ్యక్షునిగా ఉన్న సమయం లో స్వదేశీ నాయకులు ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎంఎఎస్ పార్టీ కార్యకలాపాల్లో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నప్పటికీ, దేశ జనాభాలో వారి సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ పదవుల్లో మాత్రం అందుకు తగిన నిష్పత్తిలో లేరనేది వారి వాదన. దేశ చరిత్రలో మొదటి స్వదేశీ అధ్యక్షుని నేతృత్వంలోని ఎంఎఎస్ పరిపాలనలో జాత్య హంకారం తిరిగి పెరగడాన్ని వారు ఖండిం చారు. ఏది ఏమయినప్పటికీ, అనీజ్ ప్రభుత్వ అనాగరికమైన జాత్యహంకార, నియంతృత్వ స్వభావం వల్ల వారిలో చాలామంది ఎన్ని కలలో ఎంఎఎస్‌కు మద్దతును ప్రకటించారు. అయినప్పటికీ ఆర్స్ తన మంత్రులను నియ మించిన తర్వాత మునుపటి ఎంఎఎస్ ప్రభు త్వంపై వచ్చిన విమర్శలు తిరిగి వినిపిస్తు న్నాయి. ఈ వైరుధ్యాలను సమర్థంగా ఎదుర్కో వడంపె బొలీవియాలోని ప్రగతిశీల శక్తుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

దర్యాప్తు

# భారత్‌లో అమెరికా జీవాయుధ ప్రయోగాలు



రచయిత పాండిచ్చేరిలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి విభాగం మాజీ డైరెక్టర్

**పికె రాజగోపాలన్**

**1970** నుంచి భారతదేశం లో దోమలపై పరిశోధనల పేరిట అమెరికా జీవాయుధ యుద్ధానికి రంగం సిద్ధం చేస్తున్నదా? 2020, జూలై 17 న రాసిన ఒక వ్యాసంలో ( స్ట్రేంజర్ దేన్ ఫిక్షన్: డిడ్ ది సిఐఎ కండక్ట్ సీక్రెట్ మస్కిటో ఎక్స్‌పెరిమెంట్స్ ఇన్ ఇండియా ఇన్ 1970) సుప్రసిద్ధ పౌర హక్కుల కార్యకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది నందితా హక్సర్ భారతదేశంలో దోమలపై అమెరికా రహస్య ప్రయోగాలు చేసిందా అన్న ప్రశ్నను సంధిం చింది: గౌరవప్రదమైన ఉన్నతాధికారిగా, ప్లానింగ్ కమిషన్ సభ్యునిగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన దివంగత పి.ఎన్ హక్సర్ కుమార్తె ఆమె. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) పరిధిలోని జెనెటిక్ కంట్రోల్ ఆఫ్ మస్కిటో యూనిట్‌ను (జిసిఎంయు) మూసివేయడం గురించి ఆమెకు తెలుసు. ఆమె ఇలా అంటున్నది: “నేను రహస్య కార్యకలాపాల గురించి చాలా కథలు ఈ గదిలోనే విన్నాను. ఆ రోజు ఒక యువ జర్నలిస్ట్ వచ్చి పాలం విమానాశ్రయం సమీపంలో దోమలపై నిర్వహిస్తున్న ఒక వింత ప్రయోగం గురించి నా తండ్రికి చెప్పారు, దానిపై ఢిల్లీ విమానాశ్రయ అధికారులను పిలిచి తెలుసుకోగా అది ఎల్లో ఫీవర్‌పై ప్రయోగమని చెప్పారు. ‘భారతదేశంలో ఎల్లో ఫీవర్ లేదే ’ అని నాన్న ఆశ్చర్యపోయారు. ఇది జీవాయుధ ప్రయోగంలో ఒక భాగమని ఆ యువ జర్నలిస్ట్ పేర్కొన్నారు. మేమంతా దిగ్భ్రాంతికి గురై మౌనంగా కూర్చున్నాం”. ఆ జర్నలిస్ట్ చక్రవర్తి రాఘవన్ అనంతర కాలంలో ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ)కి నాయకత్వం వహించారు. దీనిపై పరిశోధన చేసిన డాక్టర్ కె.ఎస్. జయరామన్ కూడా సాధారణ విలేకరి కాదు. అమెరికాలోని ఒక విశ్వవిద్యాలయం నుండి న్యూక్లియర్ ఫిజిక్స్ లో పిహెచ్ డి, ఒక ఎలెక్టివ్ సబ్జెక్టుగా జర్నలిజం చేశారు. శాస్త్రవేత్తగా తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి పిటిఐలో చీఫ్ సైన్స్ రిపోర్టర్‌గా చేరారు.

1970 లో స్థాపించిన జిసిఎంయును ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఒ) దోమల జన్యు నియంత్రణను అధ్యయనం చేయడానికి వినియోగించుకున్న తర్వాత 1975 లో ఎలా మూసివేయాల్సి వచ్చిందనే కథను ఇప్పుడు మరచిపోయారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్, ప్రొఫెసర్ ఎం.జి.కె.మీనన్ కమిటీ 1975 లో అంతర్జాతీయ శాస్త్రీయ సహకారంపై జారీ చేసిన మార్గదర్శకాలను కూడా మర్చిపోయారు. ఈ రోజు 91 ఏళ్ల వయసులో, క్షీణిస్తున్న జ్ఞాపకాలతో జిసిఎంయు శాస్త్రవేత్తగా ఏమి జరిగిందో నేను గుర్తుచేస్తాను.

పిఎల్ 480 నిధులతో(యు.ఎస్. విదేశీ సహాయ పంపిణీ కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ లా 480 నిధులు) జిసిఎంయు ప్రాజెక్ట్ ను పూర్తిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించింది. డబ్ల్యు హెచ్ ఒకు ఐసిఎంఆర్‌కు మధ్య సహకార ఒప్పందం ఉన్నది. ఈ సహకారం పూర్తి ఏకపక్షంగా కొనసాగింది. డబ్ల్యు హెచ్ ఒ తన ప్రతినిధి (డాక్టర్ ఆర్. పాల్) ద్వారా ప్రాజెక్ట్‌కు చెందిన అన్ని అంశాలను పర్యవేక్షించింది. ఐసిఎంఆర్ తాను నియమించిన భారతీయ సిబ్బందికి జీతాలను మాత్రమే చెల్లించింది. డబ్ల్యుహెచ్ఒ కు, అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ పబ్లిక్ హెల్త్ సర్వీస్ (యుఎస్‌పిహెచ్ఎస్) మధ్య ప్రత్యేక ఒప్పందం ఉంది. ఇది ఐసిఎంఆర్ కు మాత్రమే కాక భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కూడా తెలియదు! యుఎస్ పబ్లిక్ హెల్త్ సర్వీస్ అన్ని విధాన నిర్ణయాలు తీసుకునేది. యు.ఎస్. జీవాయుధ యుద్ధ విభాగం ప్రధాన కార్యాలయ ప్రతినిధి ఫోర్ట్ డెట్రిక్ శాస్త్ర, సాంకేతిక అంశాలకు చెందిన సమావేశాలకు హాజరయేవారు. ఐసిఎంఆర్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మలేరియా, ఫైలేరియాసిస్ వాహకాలను నియంత్రించడానికి జన్యు పద్ధతులను ఉపయోగాన్ని పరిశోధించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. కానీ మలేరియా వాహకం అనోఫిలస్ స్టీఫెన్సి ఢిల్లీలో ప్రబలంగా ఉన్నా ఎలాంటి పరిశోధనలు చేపట్టకుండా ఒప్పంద స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారు. ఢిల్లీలో ఫైలేరియాసిస్ లేనప్పటికీ, ఫైలేరియాసిస్ వాహకం కులెక్స్ క్విన్క్విఫాసియాటస్‌పై విస్తృతమైన అధ్యయనాలు చేశారు. భారతదేశంలో ఎల్లో ఫీవర్ లేకపోయినప్పటికీ దాని వాహకమైన ఎడెస్ ఎజిప్టిపై అనవసరమైన ప్రాధాన్యతతో పరిశోధనలు చేశారు. అందువలన మొదటి నుండి అనుసరించిన విధానం లోపభూయిష్టంగా ఉంది.

అన్నింటిలో మొదటిది, మలేరియా లేదా ఫైలేరియా ఎక్కువగా లేని ఢిల్లీని జిసిఎంయుకు కేంద్రంగా ఎందుకు ఎంపిక చేశారు? దివంగత డాక్టర్ ఎన్.జి.ఎస్. ఫిలేరియాసిస్ అధికారి, అంటువ్యాధులపై అధ్యయనం చేస్తున్న జాతీయసంస్థ (ఎన్ఐసిడి) డైరెక్టర్, దివంగత డాక్టర్ ఎన్.జి.ఎస్. రాఘవన్‌ను ఈ కేంద్రాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయటానికి గల కారణాలను గురించి పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ప్రశ్నించింది. సహజంగానే రక్షణ సంస్థలకు సమీపంలో ఉండటం వల్లనేనా? నిజానికి ఈ విషయంపై ఎన్ఐసిడితో ఎప్పుడూ సంప్రదించ లేదు. ఎన్‌సిఐడి కి అనుబంధంగా ఉన్న మలేరియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎంఐఐ)కు భారతదేశం అంతటా శాఖలు ఉన్నాయి. కాబట్టి ఇది ఆశ్చర్యం కలిగించింది. అంతే కాకుండా డబ్ల్యుహెచ్ఒ ప్రతినిధిగా ఉన్న (డాక్టర్ పాల్) అంతకు ముందు ఎంఐఐలో మొత్తం మలేరియా వ్యవహారాలను పర్యవేక్షించే ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నాడు. డబ్ల్యుహెచ్ఒలో చేరినప్పటికీ ఎంఐఐలో చాలా సంవత్సరాలు తాత్కాలిక అధికారిగా కొనసాగాడు. (నిబంధనలకు వ్యతిరేకంగా అతను 10 సంవత్సరాలకు పైగా కొనసాగాడు. 1975 లో జిసిఎంయు పనిపై విచారణ సమయంలో అతను కొనసాగటాన్ని రద్దుచేశారు).

> జిసిఎంయు ప్రారంభమైన రెండేళ్ల తరువాత, 1972 ఫిబ్రవరి 11 న ఢిల్లీకి చెందిన జాతీయ దినపత్రిక అయిన నేషనల్ హెరాల్డ్ "ఏ సైంటిఫిక్ వర్కర్" పేరుతో "సైన్సా లేక నయా సామ్రాజ్య వాదమా?" అనే వ్యాసాన్ని ప్రచురించింది. ఇది అలజడికి దారి తీసింది. దోమలను క్రిమిరహితం చేయడానికి జిసిఎంయు ఉపయోగించే థియోటెపా క్యాన్సర్ కారకమని ఆ కథనం హైలైట్ చేసింది. తరువాత బొంబాయి నుంచి ప్రచురితమయ్యే వారపత్రిక బ్లిట్జ్ దానిని చాలా ప్రముఖంగా ప్రచురించింది.

### జిసిఎంయు పనితీరు

జిసిఎంయు ఆటోమేషన్‌తో లక్షలాది క్యూలెక్స్ క్విన్క్విఫాసియాటస్ (సిక్యూ) దోమలను సామూహికంగా ఉత్పత్తిచేయటం, థియోటెపా డ్రగ్‌ను ఉపయోగించి మగవాటిని కెమోస్టెరిలైజింగ్ చేసి విస్తృతమైన అధ్యయనాలు చేసింది. గుడ్డునుండి బయటికి వస్తున్న(ప్యూపల్) దశలోనే మగ, ఆడవాటిని వేరు చేయడానికి ఒక యాంత్రిక గాడ్జెట్‌ను అభివృద్ధి చేసింది. మగవాటిని ఢిల్లీ చుట్టుపక్కల అనేక గ్రామాల్లో విడిచిపెట్టారు. ఇవి స్థానికంగా ఉండేవాటితో పోటీపడి ఆడవాటితో సహజీవనం చేస్తాయి. ఫలితంగా గుడ్లు పెడతాయి. కానీ ఈ ప్రాజెక్టులోని పర్యావరణ శాస్త్రవేత్తలు వెల్లడించిన అంశాలను బట్టి (1) విడిచిపెట్టినవి స్థానికంగా ఉండేవాటితో చాలా అంశాల్లో పోటీపడలేవని, అందువల్ల దోమల జనాభాలో 100 శాతం వంధ్యత్వాన్ని ప్రేరేపించలేకపోయాయి. (2) ప్యూపల్ దశలోని విభజన ప్రభావవంతంగా లేనందున ఆడదోమలు 3-5 శాతం కలిసిపోయాయి. అంటే ప్రతి విడుదలలో పెద్దసంఖ్యలో ఆడదోమలు కూడా చేరాయి. ఎందరినో కాటువేశాయి. ఎందుకంటే ప్యూపల్ పరిమాణ దశలో ఆడ, మగ లైంగిక అంశాల్లో పెద్దగా తేడా లేదు. (3) వికిరణం వంటి ఇతర పద్ధతులు పాటించడం వల్ల సిక్యూ దోమలు కూడా విడుదలయ్యాయి. జర్మనీ శాస్త్రవేత్త హన్స్ లావెన్ అభివృద్ధి చేసిన తరువాతి పద్ధతి అపజయం పాలయింది, ఎందుకంటే అననుకూలత అని పిలవబడేది రికెట్సియల్ ఇన్ఫెక్షన్ ఉండటం వల్ల దోమలు ఉన్న జంతువులకు చికిత్స చేయడం టెట్రాసైక్లిన్‌తో నయం చేయవచ్చు. (4) అయితే క్యూలెక్స్ అనే ఫైలేరియా దోమ జీవావరణ శాస్త్రం, జనాభాపై దాని ప్రభావానికి సంబంధించి గుర్తించదగిన విస్తృతమైన క్షేత్ర అధ్యయనాలు జరిగాయి. (5) చివరగా ఎడెస్ ఈజిప్టిపై అనవసరమైన ప్రాధాన్యతతో విస్తృతమైన అధ్యయనం జరిగింది.

### ఎల్లో ఫీవర్ వాహకంపై అధ్యయనాలు

భారతదేశంలో ఎల్లో ఫీవర్ లేనప్పుడు ఎల్లో ఫీవర్ వాహకం ఎడెస్ ఈజిప్టిపై ఎందుకు వివరణాత్మక అధ్యయనాలు చేపట్టారు? అమెరికాకు సంబంధించి 1960లో వర్గీకరించని పత్రం వెల్లడిచేసిన సమాచారాన్ని బట్టి జీవ, రసాయన యుద్ధ ప్రయత్నాలను వివరిస్తూ యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కెమికల్ కార్ప్స్ నుండి '1953 లో ఫోర్ట్ డెట్రిక్‌లోని జీవాయుధ యుద్ధం (బిడబ్ల్యు) ప్రయోగశాలలు ఆర్థ్రోపోడ్ల వాడకాన్ని అధ్యయనం చేయడానికి ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. "కీటకాలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ నివేదిక ఉదహరించింది "అవి కొంతకాలం సజీవంగా ఉంటాయి. దాంతో ఒక ప్రాంతాన్ని నిరంతరం ప్రమాదకరంగా ఉంచుతాయి" అని ఆ నివేదిక సూచించింది. అందులో భాగంగానే ఎడెస్ ఈజిప్టి ఎల్లో ఫీవర్ వైరస్ వినియోగాన్ని అధ్యయనం చేసింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ యూనియన్ స్పష్టమైన లక్ష్యంగా ఉంది. "ఆసియాతో సహా కొన్ని ప్రాంతాలలో ఎల్లో ఫీవర్ ఎప్పుడూ రాలేదు, అందువల్ల ఈ ప్రాంతాల జనాభాకు ఈ వ్యాధి సోకటానికి చాలా అవకాశం ఉంది" అని నివేదిక పేర్కొంది.

1956 ఏప్రిల్ -నవంబర్ మధ్యకాలంలో అమెరికా సైన్యం జార్జియాలోని సవన్నాలో ఒక నివాస ప్రాంతంలో వ్యాధి సోకిన ఆడ దోమలను (ఎడెస్ ఈజిప్టి) విడుదల చేసింది. ఒక రోజులోనే దోమలు ఒకటి నుండి రెండు మైళ్ళు ప్రయాణించి చాలా మందిని కుట్టాయి. అదే ప్రాంతంలో 1958 లో జరిపిన ఒక పరీక్షలో "విమానాల నుండి లేదా భూమిపై ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా దోమలు అనేక మైళ్ళ విస్తృతిలో వ్యాపించవచ్చని నిర్ధారించారు. వ్యాధి సోకని దోమలతో ఈ పరీక్షలు చేస్తున్నట్టు చెప్పినా వ్యాధి సోకిన దోమలు సమానంగా ఉంటాయని అంచనా. అందువల్ల జిసిఎంయు "సామూహిక ఉత్పత్తి పద్ధతులను" ఉపయోగించి, రద్దీగా ఉండే నగరంలో ఇరుకైన దారుల్లోకి సైకిల్ రిక్షాలో వెళ్ళి, అందులో అమర్చిన పరికరం ద్వారా ఎడెస్ దోమలను వివిధ ప్రాంతాలలో విడుదల చేయగలదని గమనించారు.

### 'నేషనల్ హెరాల్డ్' వెల్లడించిన అంశాలు

జిసిఎంయు ప్రారంభమైన రెండు సంవత్సరాల తరువాత, 1972 ఫిబ్రవరి 11 న వివాదానికి బీజాలు పడ్డాయి. ఢిల్లీకి చెందిన జాతీయ దినపత్రిక అయిన నేషనల్ హెరాల్డ్ "ఏ సైంటిఫిక్ వర్కర్" పేరుతో "సైన్సా లేక నయా సామ్రాజ్యవాదమా?" అనే వ్యాసాన్ని ప్రచురించింది. (ఈ వ్యాసం డైరెక్టర్ ర్యాంక్‌లోని ఉన్నతస్థాయి రక్షణ శాస్త్రవేత్త రాసినట్లు తరువాత వెల్లడైంది, ఆయన ఇప్పుడు సజీవంగా లేరు) ఇది అలజడికి దారితీసింది. దోమలను క్రిమిరహితం చేయడానికి జిసిఎంయు ఉపయోగించే థియోటెపా క్యాన్సర్ కారకమని ఆ కథనం హైలైట్ చేసింది. తరువాత బొంబాయి నుంచి ప్రచురితమయ్యే వారపత్రిక బ్లిట్జ్ దానిని చాలా ప్రముఖంగా ప్రచురించింది. ఆశ్చర్యకరంగా అదే సమయంలో ఢిల్లీలోని జర్మనీ రాయబార కార్యాలయం సాధారణ ప్రచురణ అయిన జర్మన్ న్యూస్, జిసిఎంయుతో ఉన్న ప్రొఫెసర్ హన్స్ లావెన్ నేషనల్ హెరాల్డ్ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ ప్రచురించిన కథనంలో సైటోప్లాస్మిక్ అననుకూలతను ప్రస్తావించింది. దాంతో ఐసిఎంఆర్ డైరెక్టర్ జనరల్ పిటిఐ చీఫ్ సి. రాఘవన్‌ను వెంటనే ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఒకరిని పంపమని కోరినట్లు తెలిసింది. ఆ విధంగా కె.ఎస్. జయరామన్ రంగప్రవేశం చేశాడు. అతను 15 నెలలు వివరణాత్మక పరిశోధన చేసి 1974, జూలై 9 న పిటిఐలో జిసిఎంయు పనితీరును విమర్శిస్తూ ఒక కథనాన్ని ప్రచురించాడు. ఈ కథనాన్ని భారతదేశంలోని వార్తాపత్రికలు ప్రచురించాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ భాగస్వామ్యం కలిగి ఉన్నందున ఇది సంచలనాన్ని సృష్టించింది. ప్రధాన స్రవంతి మీడియా మొత్తం రాఘవన్‌ను ఉటంకిస్తూ, "దేశంలో వివిధ విదేశీ-ప్రాయోజిత పరిశోధన కార్యకలాపాల తీవ్రతలను అర్థం చేసుకోవడానికి మాకు దాదాపు పంతొమ్మిది నెలలు పట్టింది. విస్తృతంగా లభించిన వివరాలను అధ్యయనం చేయటం, విదేశీయుల ఆధ్వర్యలో జరుగుతున్న పరిశోధనల పర్యవసానాలను అర్థం చేసుకోవటానికి ఓపికగా చేసిన దర్యాప్తు ఎంతో ఉపయోగపడింది. అమెరికా పిఎల్-480

**❝ భారత పార్లమెంటరీ చరిత్రలో మొట్ట మొదటిసారిగా, జీవ సంబంధమైన యుద్ధం అనే అంశంపై వాయిదా తీర్మానం ఆమోదించారు. ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ (167 వ నివేదిక) జ్యోతిర్మయి బసు (200 వ నివేదిక) నేతృత్వంలోని పిఎసి డబ్ల్యూహెచ్‌ఒ ఆధ్వర్యంలో భారతదేశంలో అంతర్జాతీయ సహకారం ముసుగులో జరుగుతున్న అనేక విషయాలను బహిర్గతం చేసింది. అమెరికా ఉపయోగిస్తున్న జీవసంబంధమైన యుద్ధ కోణాన్ని బయటపెట్టారు. ❞**

నిధులతో ప్రపంచ ఆరోగ్య సంస్థ విభాగంగా నడుస్తున్న జిసిఎంయు కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐసిఎంఆర్‌తో ఒప్పందం చేసుకొని, దానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్న ఇతర సాంకేతిక అంశాలపై మా పరిశోధన కేంద్రీకృతమైందని పేర్కొన్నారు. "ఈ నివేదికను రూపొందించడానికి మాకు పదిహేను నెలల సమయం పట్టింది, అయితే దోమలకు సంబంధించిన ఆ నివేదికను చదివి అది 'పక్షపాత ధోరణితో కూడినది, అన్యాయం, తప్పుదోవ పట్టించేది' అని వ్యాఖ్యానించడానికి మంత్రికి కేవలం ఇరవై నాలుగు గంటలు కూడా పట్టలేదు" అని రాఘవన్‌ను ఉటంకిస్తూ చెప్పారు.

**పార్లమెంట్ అప్రమత్తంగా ఉంది**

ఈ విషయంపై పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) దర్యాప్తు చేయాలని పార్లమెంటు నిర్ణయించింది. రాఘవన్ ఇలా అన్నాడు: " పిఎసి ముందు ఈ అంశాలను నిరూపించటం కోసం పిటిఐ బృందం మరో తొమ్మిది నెలల పాటు ఓపికగా విచారణలో పాల్గొంది. పిఎసి దర్యాప్తునకు సహాయపడటానికి అవసరమైన సమాచారం అందించడానికి సాగిన ప్రక్రియ గురించి చెబితే ఒక గ్రంథమవుతుంది. ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌ను గుర్తుకు తెస్తుంది. అందుకు ఎదురైన అవరోధాలు, అధికార వర్గాల నుంచి సహాయ నిరాకరణ, వాస్తవాలను వెలికి తీయడానికి పడిన శ్రమ ఆశ్చర్యం కలిగించలేదు. అయినప్పటికీ నా సహోద్యోగి, శాస్త్రవేత్త అయిన డాక్టర్ కె.ఎస్. జయరామన్ ఉన్నతస్థాయి అధికారులకు భయపడకుండా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్తలు, వైద్యుల నుంచి శాస్త్రీయ సమాచారం సేకరించేందుకు ఎంతో కష్టపడ్డారు. జయరామన్‌కు సహకరించినందుకు ఒక ఉన్నతస్థాయి శాస్త్రవేత్త వేధింపుల బారినపడ్డారు.

భారత పార్లమెంటరీ చరిత్రలో మొట్ట మొదటిసారిగా, జీవసంబంధమైన యుద్ధం అనే అంశంపై వాయిదా తీర్మానం ఆమోదించారు. ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ (167 వ నివేదిక) జ్యోతిర్మయి బసు (200 వ నివేదిక) నేతృత్వం లోని పిఎసి డబ్ల్యూహెచ్‌ఒ ఆధ్వర్యంలో భారతదేశంలో అంతర్జాతీయ సహకారం ముసుగులో జరుగుతున్న అనేక విషయాలను బహిర్గతం చేసింది. అమెరికా ఉపయోగిస్తున్న జీవసంబంధమైన యుద్ధ కోణాన్ని బయట పెట్టారు. డబ్ల్యుహెచ్‌ఒ, భారత ప్రభుత్వాల మధ్య ఒప్పందానికి విరుద్ధంగా, జిసిఎంయుతో యుఎస్‌పిహెచ్‌ఎస్ ఒప్పందం చేసుకొని మలేరియాపై కాకుండా ఫైలేరియా లేని మనదేశంలో ఆ వ్యాధి వాహకాలపై జరుగుతున్న కార్యకలాపాలను బహిర్గతం చేశారు. కానీ భయానక విషయం ఏమిటంటే, ఎడెస్ ఈజిప్టి, ఎల్లో ఫీవర్, డెంగ్యూ వాహకాలపై విస్తృతంగా అధ్యయనం సాగింది. కానీ మలేరియా లేదా ఫైలేరియాసిస్ వాహకాలపై కాదు. దోమల సామూహిక పెంపకం, హర్యానాలోని సోనేపట్‌లో రద్దీగా ఉన్న ప్రతి వీధిలో ఎడెన్ ఈజిప్టిని వదలటానికి అవసరమైన యంత్రాంగాన్ని అభివృద్ధి చేశారు. దీని కోసం ప్రతి వీధిని గురించి సవివరమైన సమాచారంతో నివేదిక తయారు చేశారు. ఈ కార్యకలాపాలు ప్రారంభించబోతున్న తరుణంలో భారత సైన్యం ప్రవేశించింది. కార్యకలాపాలను ఆపడానికి చాలా మంది వ్యక్తులు, ఏజెన్సీలు జోక్యం చేసుకున్నాయి: రాఘవన్, జయరామన్‌తో పాటు ఒక కీటక శాస్త్రవేత్త ఈ ఆపరేషన్‌లో పాలు పంచుకున్నారు. వీరికి పి.ఎన్. హక్సర్, అశోక్ పార్థసారథి, అప్పటి ప్రధానికి శాస్త్రీయ సలహాదారు, రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) ఆర్మీ బిగ్ విగ్స్ (చీఫ్ ఆఫ్ స్టాఫ్ సహా) సహకరించారు. ఈ కార్యక్రమం, ఇతర అనుసంధాన ప్రాజెక్టుల సంబంధించి తగిన ఇంటెలిజెన్స్ అధికారులను ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ పిఎసి ఛైర్మన్ 1975, జనవరి 31 న (పిఎసి 225) ప్రధాన మంత్రికి లేఖ రాశారు, నేషనల్ హెరాల్డ్‌లోని కథనాలతో రక్షణశాఖ అధికారులు కూడా మేల్కొన్నారు.

హర్యానా ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుంది. 1975, ఫిబ్రవరి 17 న సోనేపట్ శివార్లలో ఒక జిసిఎంయు అధికారి వీధుల్లో ఎడెస్ ఈజిప్టిని విడుదల చేసే సామగ్రితో సిద్ధంగా ఉన్నప్పుడు ఆమెను పట్టుకున్నారు. హర్యానా ప్రభుత్వ అనుమతి లేకుండా సోనేపట్‌లో ఎటువంటి ప్రయోగాలు చేయబోమని హామీ ఇచ్చిన తర్వాత మాత్రమే ఆమెను విడిచిపెట్టారు. దాంతో ప్రధాని జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టును విరమించుకోవాలని ఆరోగ్య మంత్రికి సూచించారు. 1975 జూన్‌లో జిసిఎంయు కార్యకలాపాలను రద్దుచేశారు.

దాదాపు ఐదు దశాబ్దాల తరువాత జిసిఎంయులో భాగమైన వ్యక్తిగా ఈ కథను చెప్పాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. తద్వారా ప్రస్తుత విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు నిజంగా ఏమి జరిగిందో తెలుసుకుని, శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ సహకార ఒప్పందాలలో తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు తోడ్పడుతుంది.

**జిసిఎంయును జీవ యుద్ధానికి ఉపయోగించారా?**

పిఎసి సమగ్రమైన అధ్యయనం చేసింది. ఇది స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎస్ఐపిఆర్ఐ) నివేదికలపై కూడా వినియోగించుకుంది. ఐసిఎంఆర్ మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ కూడా జీవ యుద్ధంపై పిఎసికి అనేక సూచనలు చేశారు. భారతదేశంలో అమెరికా చేస్తున్న జీవయుద్ధ సంబంధమైన కొన్ని ప్రాజెక్టులకు ప్రపంచ ఆరోగ్యసంస్థను ముసుగుగా ఉపయోగించుకున్నారని పిఎసి స్పష్టం చేసింది. ఇది పిటిఐ వార్తా కథనాన్ని సమర్థించింది. ఈ ప్రాజెక్టుల వల్ల భారతదేశానికి తక్కువ ప్రయోజనమని, దీనిని జీవసంబంధ యుద్ధం కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. భారతదేశం ఎల్లో ఫీవర్‌కు స్పందించే దేశమని ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభం నుండి తెలుసు. భారతదేశంలో ఉన్న ఎడెస్ ఈజిప్టి, ఇతర జాతుల దోమలు ఈ వైరస్‌ను కోతి నుండి మనిషికి, మనిషి నుండి మనిషికి వ్యాపింప చేస్తాయి. ఈ అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఎల్లో ఫీవర్ భారతదేశాన్ని తాకలేదు. ఎల్లో ఫీవర్ జీవయుద్ధ దాడికి భారతదేశం దుర్బలంగా ఉన్నదని రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా, నాజీ జర్మనీలకు తెలుసు. దూర ప్రాచ్యంలో యుద్ధం ప్రారంభమైనప్పుడు, ఎల్లో

ఫీవర్ వైరస్ (సిజి పండిట్, ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, పేజి 1524) తో జపాన్ జీవ యుద్ధాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని 1940 ప్రారంభంలో భారతదేశానికి అమెరికా నుండి రహస్య సమాచారం అందింది, 1939 శరదృతువులో మ్యూనిచ్ నుండి గోబెల్స్ మాట్లాడుతూ బ్రిటన్ పశ్చిమ ఆఫ్రికా నుండి విమానాల ద్వారా భారతీయ నగరాల మీదుగా దోమలను రవాణా చేసి, ఎల్లో ఫీవర్‌ను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించిందని ఆరోపించాడు. ఈ పథకం మొత్తాన్ని విదేశీ కార్యాలయ ఉన్నత అధికారి పర్యవేక్షించారు (బ్రిటిష్ మెడికల్ జర్నల్, వాల్యూమ్ 1 (1947), పేజీలు 893–895). వాస్తవానికి యుద్ధ ప్రారంభానికి కొంతకాలం ముందు శత్రు ఏజెన్సీ ఎల్లో ఫీవర్ వైరస్ (ఐబిడ్)కు చెందిన తీవ్రమైన రకాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో జీవయుద్ధ వ్యవస్థ అభివృద్ధిలో ఫోర్ట్ డెట్రిక్ సాధించిన అద్భుతమైన పురోగతి కంటే భారతదేశంలో యుఎస్‌పిహెచ్ఎస్ నిపుణులు చేసిన ప్రయోగాలు ఎడెస్ ఈజిప్టిపై జిసిఎంయు కార్యకలాపాలకు కొత్త కోణాన్ని ఇచ్చాయి. ఇంకా జిసిఎంయుకు నిధులు సమకూర్చిన యుఎస్‌పిహెచ్ఎస్ ఫోర్ట్ డెట్రిక్‌తో సన్నిహిత సంబంధాన్ని కొనసాగించి "తన ప్రయత్నాలకు నజరానాగా కొన్ని లక్షల డాలర్లను అందుకుంది" (స్టీవెన్ రాస్, పే .123).

ఫోర్ట్ డెట్రిక్‌లోని యు.ఎస్. జీవయుద్ధ ప్రయోగశాలలో 200 లకు పైగా రకాలను పరిశీలించింది. అయితే ఎల్లో ఫీవర్ వైరస్‌తో పాటు (ఎస్ఐపిఆర్ఐ వాల్యూమ్ 2 పేజీలు 37–38) జీవాయుధాలుగా ఉపయోగించటానికి మరికొన్ని రకాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. ఏరోసోలైజ్డ్ ఎల్లో ఫీవర్ వైరస్ (సైన్స్, జనవరి 13, 1967) పై ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. 1960 లోనే యు.ఎస్. కీటక యుద్ధ కార్యక్రమం భావన నుండి సాధ్యత వరకు, ప్రాథమిక పరిశోధన నుండి సమర్థవంతంగా జీవసంబంధ యుద్ధ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇది ఎల్లో ఫీవర్ వైరస్, ఎడెస్ ఈజిప్టి దోమల కలయికకు సంబంధించినది (ఎస్ఐపిఆర్ఐ వాల్యూమ్2 పే.81). ఈ జాతికి చెందిన దోమలలో ఎల్లో ఫీవర్ వైరస్‌ను ప్రవేశపెట్టటానికి, వాటిని ఒక నెల పాటు సజీవంగా ఉంచడానికి అవసరమైన సాంకేతిక అభివృద్ధిని సాధించారు. కీటకయుద్ధంపై అత్యున్నత స్థాయిలో జరిగిన పరిశోధన అమెరికా కాంగ్రెస్ చర్చల్లో ప్రస్తావనకు కూడా రాలేదు (సేమౌర్ హెర్ష్, పేజి 88).

> **❝ ఏదేమైనా ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జీవసంబంధ యుద్ధం అని భావించేందుకు కొన్ని సూచికలు ఉన్నాయి. జిసిఎంయు అధికారికంగా రూపుదిద్దుకోకముందే ఎడెస్ ఈజిప్టి విడుదల కోసం సోనేపట్ ప్రాంతాన్ని డబ్ల్యుహెచ్‌వో, యుఎస్‌పిహెచ్ఎస్‌లు ఎంపిక చేశాయి. స్థానిక ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐసిడి) వ్యతిరేకించినప్పటికీ ఆ ప్రాంతాన్ని మార్చలేదు ❞**




ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసిఎంఆర్) భవనం

### మిశ్రమ స్పందనలు

భారతదేశంలో జన్యు నియంత్రణ ప్రయోగం ద్వారా పొందిన జ్ఞానం ఖచ్చితంగా దోమల్లోకి ఎల్లో ఫీవర్ వైరస్‌ను ప్రవేశ పెట్టడానికి (పిఏసి, పేజి 135–137) ఉపయోగపడుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్ఎస్) అంగీకరించింది. జీవసంబంధమైన యుద్ధ ప్రాజెక్టు ఆరోపణలపై అంతర్జాతీయ శాస్త్ర వర్గాలలో మిశ్రమ స్పందనలు వచ్చాయి. న్యూ సైంటిస్ట్ (అక్టోబర్ 9, 1975, పేజి 102) ఈ ఆరోపణలను కొట్టివేయటానికి వీలులేదని చెప్పింది. ఒక జీవ యుద్ధ నిపుణుడిని ఉటంకిస్తూ భారతదేశంపై ఎల్లో ఫీవర్ దాడిని ఉద్దేశించినట్లయితే జిసిఎంయు డేటా ఉపయోగపడుతుందని పేర్కొంది. వాహకాలు, కోతులు ఉన్నప్పటికీ ఎల్లో ఫీవర్ ఎందుకు సంభవించలేదని తెలుసుకోవడానికి భారతదేశంలో చేసిన అధ్యయనం ఉపయోగపడుతుందని పేర్కొంది. డబ్ల్యుహెచ్‌వో–ఐసిఎంఆర్ ప్రాజెక్టుకు ప్రజారోగ్యం కంటే జీవాయుద్ధ ఆసక్తి కారణం కావచ్చని విమర్శకులు కూడా అంగీకరిస్తున్నారు. ఈ ప్రాజెక్టును రూపొందించినప్పుడు జీవయుద్ధ సంబంధమైన (భారతదేశంలో) చిక్కులను పట్టించుకోకపోవటం లేదా వాటి గురించి చర్చించటం చేయలేదు. 1974 లో పరిశోధనాత్మక వార్తా కథనాలు రావడం, అనంతరం పిఏసి నివేదిక ద్వారానే చాలామంది శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టు గురించి తెలుసుకున్నారు.

ఏదేమైనా ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జీవసంబంధ యుద్ధం అని భావించేందుకు కొన్ని సూచికలు ఉన్నాయి. జిసిఎంయు అధికారికంగా రూపుదిద్దుకోకముందే ఎడెస్ ఈజిప్టి విడుదల కోసం సోనేపట్ ప్రాంతాన్ని డబ్ల్యుహెచ్‌వో, యుఎస్‌పిహెచ్ఎస్‌లు ఎంపిక చేశాయి. స్థానిక ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐసిడి) వ్యతిరేకించినప్పటికీ ఆ ప్రాంతాన్ని మార్చలేదు (పిఏసి, పే .191). ఎల్లో ఫీవర్ వైరస్ వాహకాల కోసం ఎడెస్ ఈజిప్టి విదేశీ దోమల జాతులను పరీక్షించటం అనవసరమని యుఎస్‌పిహెచ్ఎస్, డబ్ల్యుహెచ్‌వో వైరాలజిస్ట్ (డాక్టర్ పాల్ బ్రెస్) భావించారు. ఆయన

**❝ అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ సమస్యలను అంచనా వేయడానికి అవసరమైన శాస్త్రీయ ప్రతిభ కూడా లేదు. వారి సమగ్రత, సామర్థ్యం, సామాజిక ప్రయోజనాల కోసం ఎంపిక చేయబడిన సిబ్బంది, స్వంత కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం, శాస్త్ర సాంకేతిక రంగాలలోని ప్రాజెక్టుల ప్రతిపాద నలలో మూడవ ప్రపంచ దేశాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వటం, సలహాలు ఇవ్వడం కోసం దాని వనరులను ఉపయో గించడం మూడవ ప్రపంచ దేశాల సమస్యలకు ఒక పరిష్కారం అవుతుంది. ❞**

గతంలో ఫ్రెంచి సైన్యంలో కల్నల్‌గా పనిచేశాడు. ఎల్లో ఫీవర్ లేని ఆసియా, పసిఫిక్ ద్వీపాలలో శాస్త్ర పరీక్షల ద్వారా దానిని ప్రవేశపెడితే అది ప్రమాదకరంగా మారతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ఈ విధంగా వ్యవహరించటం ఆశ్చర్యంగా ఉంది. ("యుఎస్ జీవ, రసాయన యుద్ధ విధానాలు", పే.411). మలేరియా వైరస్‌తో ఉన్న దోమలపై గాక (ఈ సమస్య భారతదేశంలోనే కాదు, భారత ఉపఖండం, పొరుగు ప్రాంతాలన్నిటిలోనూ ఉన్నా) ఎడెస్ ఈజిప్టి అధ్యయనాలకు మారటానికి యూనిట్ అంగీకరించటం కూడా ఆందోళన కలిగిస్తున్నది.

### శాస్త్రీయ గూఢచర్యం

భారతదేశంలో దోమలపై పరిశోధన ప్రపంచంలో నిషేధించబడిన జీవశాస్త్ర యుద్ధంలో భాగమే. దీనిని నిషేధించినప్పటికీ ఉన్నతస్థాయి శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకుల ఆలోచనల నుండి ఇది తొలగిపోలేదు. యాదృచ్ఛిక సంఘటనల సంఖ్య సగటు కన్నా మించి జరుగుతున్న చోట అవి యాదృచ్ఛిక సంఘటనలు కావు. వాటిని మరో విధంగా చూడాలి. శాస్త్రవేత్తలు, శాస్త్రీయ అంశాలపై అధ్యయనం చేస్తున్న సంస్థలు నిధుల కొరతతో ఉంటాయి కాబట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలలో శాస్త్రీయ అంశాలపై గూఢచర్యం చేయటం సులభం, అనేకమంది ముఖ్యమైన శాస్త్రవేత్తలు అభివృద్ధి చెందిన దేశాలలో శిక్షణ పొందుతారు కాబట్టి ఇది వ్యక్తిగత స్థాయిలో పరిచయాలను ఏర్పరచటానికి, భవిష్యత్‌లో వారితో కలిసి వ్యవహరించటానికి వీలు కల్పిస్తుంది. వారిలో ఉండే ఆత్మ న్యూనతా భావం, విదేశీ-ప్రాయోజిత ప్రాజెక్టులలోని ప్రమాదాలను అంచనా వేయడానికి తగిన యంత్రాగం లేకపోవడం కూడా ఈ దేశాలు విదేశీయుల దురుద్దేశాలకు బలికావటానికి దారితీస్తుంది. శాస్త్రీయంగా సమాన స్థాయిగల దేశాల మధ్య ఇటువంటి మూల్యాంకనం చేయవచ్చు. కాని చాలా అభివృద్ధి చెందుతున్న దేశాలు విదేశీ ప్రాజెక్టుల విషయంలో భద్రత లేదా ఆర్థిక కోణాల నుండి మాత్రమే కాక, తమను వారి ప్రయోజనాలకు వినియోగించుకొనే విషయాన్ని కూడా అంచనా వేయగల స్థితిలో లేవు.

విదేశీ ఆర్థిక లేదా విదేశీ సహకార పరిశోధన మొత్తం స్వరూపాన్ని పరిగణనలోకి తీసుకున్న తరువాత పిఎసి ఈ విధంగా సిఫారసులు చేసింది (పిఎసి, 1974, నెం. 167, 200, పేజీలు 209-210):

" విదేశీయులు లేదా విదేశీ సంస్థల సహాయంతో చేపడుతున్న 'ప్రాజెక్టులను ప్రారంభించడానికి ముందే వాటిని ఏ అంశానికా అంశాన్ని ప్రత్యేకంగా, సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలి.

"కమిటీ ఈ దిగువ అంశాలను సూచిస్తున్నది (ఎ) సముద్ర వనరులు, మన తీర ప్రాంతాలకు సంబంధించిన ఏదైనా అంశం లేదా అన్ని అంశాల పరిశోధన. (బి) వాతావరణ శాస్త్రం, వాతావరణానికి సంబంధించిన ఏదైనా లేదా అన్ని అంశాలు, ముఖ్యంగా వాతావరణ మార్పులకు సంబంధించిన ప్రాజెక్టులు (సి) సహజ వనరుల అంచనా కోసం విమానాలు, ఉపగ్రహాల ద్వారా రిమోట్ సెన్సింగ్ (డి) మైక్రోబయాలజీ, ఎపిడెమాలజీ, ఎకాలజీ, వైరాలజీ వంటి జీవశాస్త్ర అంశాలు (ఇ) మందులు, పురుగుమందులు ఇతర రసాయనాల విషతుల్యతకు సంబంధించిన అంశాలు (ఎఫ్) మన దేశంలోని అయానోస్పియర్ ఇతర ఎగువ వాతావరణ పొరల గురించి సమాచారాన్ని సేకరించే లక్ష్యంతో సహా రేడియో తరంగాల వ్యాప్తి గురించి చేసే పరిశోధనలు (జి) సరిహద్దు ప్రాంతాలలో 'హిమాలయాల ప్రాంతంలో భూగర్భ పరిశోధ నలు' లాంటి అన్ని శాస్త్రీయ పరిశోధనలు. "

### మనం పాఠాలు నేర్చుకున్నామా?

ఈ రంగాలలో చేపట్టనున్న శాస్త్రీయ పరిశోధనల కోసం విదేశీ సంస్థల సహాయం లేదా వారి భాగస్వామ్యం, విదేశీ నిధులతో నిర్వహించే ప్రాజెక్టుల వివరాలను మంత్రిత్వశాఖ సంబంధిత లాబొరేటరికి, ప్రభుత్వ ఆధ్వర్యంలోని నోడల్ ఏజన్సీకి పంపాలి. ఆ ప్రతిపాదనలను సమగ్రంగా సమీక్షించి, అనుమతులను మంజూరుచేయాలి. "ఈ నోడల్ ఏజన్సి రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు నేతృత్వంలో అత్యున్నత శాస్త్రవేత్తల కమిటీగా ఉండాలి. దీనిలో ప్రభుత్వంలోని ఇతర ఉన్నతస్థాయి భద్రతా సంస్థలలోని ఉన్నతాధికారులు కూడా ఉండాలి. ఒక్కసారి ఈ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అది ఇప్పటికే ఉన్న అన్ని ప్రాజెక్టులను లేదా మునుపటి పేరాలో పేర్కొన్న వాటిని కూడా సమీక్షిస్తుంది." మనకు ఇప్పుడు విదేశీ సంస్థల సహకారంతో నడిచే అనేక ప్రాజెక్టులు ఉన్నప్పటికీ నాకు తెలిసినంతవరకు వివిధ సంస్థలతో కూడిన అలాంటి నోడల్ ఏజన్సి ఉనికిలో లేదు.

భద్రత, రక్షణకు సంబంధించిన అంశాల ప్రాతిపదికగా ఉత్తమంగా వ్యవహరించగల కమిటీని పిఎసి సూచించింది. కానీ ఇది అంతర్గతంగా జరుగుతున్న నష్టాన్ని అరికట్టలేదు. ఏదేమైనా భారతదేశానికి భిన్నంగా, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ సమస్యలను అంచనా వేయడానికి అవసరమైన శాస్త్రీయ ప్రతిభ కూడా లేదు. వారి సమగ్రత, సామర్థ్యం, సామాజిక ప్రయోజనాల కోసం ఎంపిక చేయబడిన సిబ్బంది, స్వంత సెక్రటేరియట్ లేదా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం, శాస్త్ర సాంకేతిక రంగాలలోని ప్రాజెక్టుల ప్రతిపాదనలలో మూడవ ప్రపంచ దేశాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వటం, సలహాలు ఇవ్వడం కోసం దాని వనరులను ఉపయోగించడం మూడవ ప్రపంచ దేశాల సమస్యలకు ఒక పరిష్కారం అవుతుంది. శాస్త్రీయ పరిశోధనల కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు వస్తున్న విదేశీ ప్రాజెక్టులను అంచనా వేయడానికి, శాస్త్ర సాంకేతికతను బదిలీ చేసే ప్రణాళికలతో అనుసంధానం చేసి, కాపలాదారు పాత్ర నిర్వహించటానికి ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థలు బాధ్యత తీసుకోవాలి. ఐక్యరాజ్యసమితి ఉన్నప్పటికీ దాని అనుబంధ సంస్థలైన డబ్ల్యుహెచ్ఓ వంటివి ప్రస్తుతం సామ్రాజ్యవాద శక్తుల నియంత్రణలో ఉన్నాయి.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

ఈ మాసం ప్రత్యేకం

# ప్రైవేటు పరమౌతున్న సైనిక వర్క్‌షాపులు



**రవి శర్మ**

భారత సైన్యానికి చెందిన క్లాస్ వన్ వాహనాలు, యుద్ధ ట్యాంకుల నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర నిర్వహణ (ఓవర్‌హాలింగ్)కోసం ప్రభుత్వ యాజమాన్యంలోని సైనికకేంద్ర వర్క్‌షాపుల్లో కార్పొరేట్ నిర్వహణను ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయడం దుస్సాహస చర్యగా భావించాల్సి వస్తుంది.

తూర్పు లడఖ్‌లోని వాస్తవాధీన రేఖ వద్ద భారత, చైనా దళాల మధ్య ఘర్షణ జరుగుతున్నపుడు రక్షణ మంత్రిత్వ శాఖ తగిన తోడ్పాటు అందించి, యధాప్రకారం కార్యకలాపాలను నిర్వహించడంలో ఎంతో గందరగోళ పడింది. భారత సైన్యానికి చెందిన ఎ క్లాస్ వాహనాలను పటిష్టంగా నిర్వహించేందుకు ఎలాంటి పద్ధతిని అనుసరించాలో మంత్రిత్వ శాఖ వద్ద స్పష్టత లేదు. సైన్యం వద్ద సాయుధ యుద్ధ వాహనాలు (ఎఎఫ్‌విలు), సాధారణంగా అందరికీ తెలిసిన యుద్ధ ట్యాంకులు, పదాతి దళాలతో దాడులు చేసే వాహనాలు (ఐసివిలు): సాయుధ రక్షణ శకటాలు (ఎఆర్‌విలు), తుపాకులు, మంచులో నడిచే వాహనాలు - పోరాడేందుకు సిద్ధం (ఆర్‌టిఎఫ్) గా ఉండే స్థితిలో ఉండాలి. సాయుధ బలగాల ముందు నిలిచేందుకు ప్రధాన యుద్ధ ట్యాంకులు (ఎంబిటి), అర్జున్ (2004లో చేరినవి) సోవియట్‌లో తయారై 1985లో చేరినవి ఉన్నాయి. నీటిలో నేలపై శత్రువుల జాడపసిగట్టే ఐసివిలు, బిఎంపి 2 (రష్యా తయారీ పదాతిదళ యుద్ధ వాహనం) విభిన్న రకాల ఎఆర్‌విలు సాయుధ యుద్ధ వాహనాల జాబితాలో ఉన్నాయి.

సైన్యానికి అత్యవసరమైన దాదాపు 2,500 ఎఎఫ్‌విల సమగ్ర నిర్వహణ సకాలంలో సమర్థంగా నిర్వహించేందుకు నాణ్యమైన పనివారితో పాటు, మంచి ఇంధనంతో కూడిన సమర్థవంతమైన వ్యవస్థ అవసరం, భారతదేశంలో 4,200 ఎఎఫ్‌విలు మరియు 8,686 సాయుధ శకటాలు ఉన్నాయి.

మూడు దశాబ్దాలుగా టి-72 లు, టి-90 లు ఎంబిటిల మరమ్మత్తులకు అవసరమైన సమగ్ర నిర్వహణ వ్యవస్థ లేదు. దానిని సరిచేయకుండా టి-72 ట్యాంకుల సమగ్ర నిర్వహణకు అవసరమైన కిట్లను, కీలకమైన విడిభాగాల సరఫరాను ప్రైవేటు రంగం చూడాలని మంత్రిత్వ శాఖ ఆకస్మికంగా నిర్ణయించటం ఆశ్చర్యకరంగా ఉన్నది.

ఢిల్లీలోని ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేట్ నిర్వహణ (జివొసివో)లో అత్యుత్తమ సదుపాయాలున్న 505 సాయుధ కేంద్ర వర్క్‌షాపు (ఎబిడబ్ల్యు) నిర్వహణను చూడమని 2020 మేలో ప్రైవేటు రంగంలోని కంపెనీలను కోరింది. దీనినుండి రక్షణరంగంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థలు (డిపిఎస్‌యులు), సాయుధ ఫ్యాక్టరీలను మాత్రం మినహాయించింది. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి 505 ఎబిడబ్ల్యులో టి-90 ట్యాంకుల సమగ్ర నిర్వహణ, ట్యాంకుల ప్రాథమిక మరమ్మతులు, ట్యాంకుల ఇంజన్ల పెద్ద/చిన్న కూర్పులను చేపడతారు. ఇక్కడ ప్రస్తుతం యేడాదికి 50 టి-72 ట్యాంకుల సమగ్ర నిర్వహణ చేస్తారు. ఆర్‌ఎఫ్‌ఐ ప్రకారం కార్పొరేట్ వేలం పొందినవారు టి-72, టి-90 ట్యాంకుల ప్రాథమిక సమగ్ర నిర్వహణతో పాటు ఇంజన్ మరమ్మతులు, చిన్న, పెద్ద కూర్పులు చేయాల్సి ఉంటుంది. ఎల్ అండ్ టి, భారత్ ఫోర్జ్, టాటా డిఫెన్స్, టాటా మోటార్స్, రిలయన్స్, మహీంద్ర, రైల్వే వ్యాగన్ వస్తువులు తయారుచేసే కంపెనీలు, ఒఎన్‌జిసికి ఆయిల్ రిగ్గులు, భారీ వాహనాలు సరఫరా చేసే కంపెనీలు ఈ ఆర్‌ఎఫ్‌ఐలో పాల్గొన్నాయి.

ఆర్‌ఎఫ్‌ఐలలో ప్రవేశంపై నిర్ణయం పెండింగ్‌లో ఉండగానే సెప్టెంబరు 2 నుంచి 5 మధ్యలో ఎనిమిదింటిలో ఐదు ఎబిడబ్ల్యులు ఆర్‌ఎఫ్‌ఐలను జారీ చేశాయి. వీటి ప్రకారం 2021 ఏప్రిల్‌కు ముందు ఎబిడబ్ల్యులకు నేరుగా ప్రైవేటురంగం నుంచి విడిభాగాలు కిట్ల రూపంలో సరఫరా చేయాలి. డిపిఎస్‌యులు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు ఇందుకు అర్హమైనవి కాదని నిర్ణయించి పక్కనపెట్టారు.

సాధారణంగా స్థానిక అత్యవసర కొనుగోళ్లను మాత్రమే చేసే ఎబిడబ్ల్యులు తొలిసారి, ఎ) వచ్చే సంవత్సరానికి విడిభాగాల కోసం నేరుగా ఆర్‌ఎఫ్‌ఐలను జారీ చేయడం బి) సాధారణంగా సైనిక సాయుధ డైరెక్టరేట్ చేసే పనులను అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చాయి. విడిగా చూస్తే ఆర్‌ఎఫ్‌ఐలు సరైన పనే చేశాయని అనిపిస్తుంది. అయితే విడిభాగాలను మూడు విధాలుగా సేకరిస్తారు. సాధారణంగా ఆర్డినెన్స్ డైరెక్టరేట్ నుంచి సేకరించడం, ఈ పద్ధతి మూడేళ్ల కిందట ఆరంభమైంది. ఎబిడబ్ల్యులు సేకరించటం ఇప్పుడు మొదలైంది. గోకో ప్రక్రియలో ఆర్‌ఎఫ్‌ఐలు ఏ సమయంలోనైనా ప్రతిపాదనలు పంపించడం.

గోకో బిడ్‌ను గెలుచుకున్న కాంట్రాక్టర్ తప్పనిసరిగా తన సొంత సరఫరా వ్యవస్థపై ఆధారపడతాడు. ఎబిడబ్ల్యుల విషయానికొస్తే ఇంత పెద్ద సేకరణ కోసం ఎబిడబ్ల్యుల కమాండెంట్లకు ఇచ్చిన ఆర్థిక అధికారాలపై రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టత ఇవ్వలేదు, లేదా ఈ కొనుగోళ్లకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయా లేదా అన్న విషయం పేర్కొనలేదు. మానవ శక్తి, యంత్రాలు, విడిభాగాలు లేదా సామగ్రి వినియోగాన్ని నిర్ధారించే అకౌంటింగ్ వ్యవస్థ ఎబిడబ్ల్యులకు లేదు.

### స్పష్టమైన పొదుపులు లేవు

సామర్థ్యం పెంచటం, ఆధునిక మౌలిక సదుపాయాలను కల్పించటానికి ఉత్తమ

> "మేధావులలోనూ పట్టణ, పల్లె ప్రాంతాల మధ్య తేడా వుంటుంది. పట్టణాల్లో, నగరాల్లో బుద్ధిజీవులు యాంత్రికత తో అధికారుల్లా తయారై వుంటారు. పల్లె ప్రాంతాలలో మేధావుల స్థానం, హోదా ఎక్కువగా వుంటాయి. అందుకే పల్లె ప్రజలు తమ పిల్లల్లో ఒకరైనా మేధావి, అధికారి కావాలనికోరుకుంటారని గ్రామ్‌స్కీ రాస్తాడు."

పద్ధతులను తప్పకుండా పాటించాలి, ప్రైవేటు రంగాన్ని గుడ్డిగా తీసుకురావడం అవివేకం అవుతుంది. కొన్ని సందర్భాల్లో అణు పరికరాలకు సంబంధించిన వాటితో పాటు, వ్యవస్థలు, ఉపవ్యవస్థల ఏకీకరణ, ఎబిడబ్ల్యుల మొత్తం నియంత్రణ ఎల్లప్పుడూ సైన్యం అధీనంలోనే ఉండాలి. అలాగే వ్యవస్థలు, విడిభాగాల రూపకల్పనకు భారత ప్రైవేటురంగం చాలా కృషి చేయాల్సి ఉంది. ఎబిడబ్ల్యుల వద్ద ప్రస్తుతమున్న ఉద్యోగులు, కార్మికులను అలాగే ఉంచి గోకో నమూనాలో 60 నుంచి 70 శాతం పొదుపు చేయడం సాధ్యం కాదు.

దీనికి విరుద్ధంగా ఒక ప్రైవేట్ వ్యాపారి ఖర్చులను మాత్రమే పెంచుతాడు. 505 ఎబిడబ్ల్యు మాజీ కమాండెంట్ మేనేజింగ్ డైరెక్టర్ మేజర్ జనరల్ కె. ఈశ్వరన్ (రిటైర్డ్) ఇలా అన్నారు: ''మేము సైన్యాన్ని ప్రైవేటీకరించాలా? కానీ దీనికి ముందు, మనం ఏమి మాట్లాడుతున్నామో అర్థం చేసుకోవాలి. రష్యన్ మూలానికి చెందిన టి-90, చలనశీలత, మందుగుండు సామగ్రి రక్షణలో జాగ్రత్తగా ఉండాలి. దీని ఖరీదు సుమారు 30 కోట్లు. ఇది 45 టన్నుల ద్రవ్యరాశి కలిగిన సంక్లిష్ట ఆయుధ వేదిక. దీని బరువు టన్ను ఉంటుంది. ఇది 39,000-సిసి ఇంజన్ ద్వారా 1,000 బిహెచ్‌పి (బ్రేక్ హార్స్‌పవర్) కలిగివుంది. ఇది 125 మి. మీ బోర్ గన్ పేలుడు రియాక్టివ్ కవచం మందుగుండు సామగ్రిని కలిగి ఉంది. దాదాపు దీని ప్రతి విభాగానికి ప్రత్యేక ఇంజనీరింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. ఈ రోజు దేశంలో భూమిపై అతిపెద్ద, అత్యంత ఖరీదైన మొబైల్ పరికరం ఇది. అటువంటి సంక్లిష్ట ఆయుధ వ్యవస్థ సమగ్ర నిర్వహణ గురించి మేము మాట్లాడుతున్నాము. ఒక ప్రైవేట్ సంస్థ లేదా వ్యక్తులు దీన్ని నిర్వహించగలరా? "

ఆయన వంటి అనుభవజ్ఞుల అభిప్రాయం ప్రకారం, ట్యాంక్ ట్రాక్ వీల్ సిస్టమ్స్, ట్రాన్స్‌మిషన్ గేర్లు, ఇంజన్ ఓవర్‌హాలింగ్, వెల్డింగ్, పెయింటింగ్ ,క్లీనింగ్ వంటి పనిని విడిభాగాల సరఫరాతో పాటు ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించబోతున్నారు. ఈ టి -72 / టి -90 సమగ్ర నిర్వహణ మొత్తం ఖర్చులో 50 శాతానికి పైగా ఉండటంతో (రూల్ బుక్‌లో సమగ్ర నిర్వహణ కోసం 4 నుండి 6 కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని గణాంకాలు తెలియజేస్తున్నాయి) ప్రైవేట్ రంగం దీన్నొక లాభసాటి వ్యాపారంగా పరిగణిస్తుంది అని ఒక అధికారి తెలియజేశారు. "అయినప్పటికీ ఒక ట్యాంకు సమగ్ర నిర్వహణకు మాకు రెండు నెలల సమయం పడుతుంది. అంటే యేడాదిలో ఆరు చేయడం సాధ్యం. ప్రస్తుతం మేం యేడాదిలో 50 ట్యాంకులు చేస్తున్నాం. మరి ప్రైవేటురంగంలో వారు కనీసం 100 చేయగలరా? రష్యన్లు ఏటా 400 నుండి 500 ట్యాంకులను సమగ్ర నిర్వహణ చేస్తారు. భారతదేశం సంవత్సరానికి 200 ట్యాంకుల సమగ్ర నిర్వహణ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కనీసం ఐదేళ్ళు పడుతుంది.

### కేంద్ర సైనిక వర్క్‌షాపులు

ఎబిడబ్ల్యులు ఆర్మీ కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఇఎంఇ) పరిధిలో ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో భారత సైన్యాన్ని కార్యాచరణకు సిద్ధంగా ఉంచడానికి దీనిని స్థాపించారు. వాటిలో ఏడు - 505 ఎబిడబ్ల్యు ఢిల్లీ, 506 ఎబిడబ్ల్యు జబల్పూర్, 507 ఎబిడబ్ల్యు కంకినారా, 508 ఎబిడబ్ల్యు అలహాబాద్, 509 ఎబిడబ్ల్యు ఆగ్రా, 510 ఎబిడబ్ల్యు, మీరట్ 512 ఎబిడబ్ల్యులు ఉన్నాయి. ఇవి ఆయుధాలు, వాహనాలు, రాడార్లు, రాత్రుళ్లు ఉపయోగించే పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులు, సమగ్ర నిర్వహణను చూస్తాయి. ఎనిమిదవదైన 515 ఎబిడబ్ల్యు బెంగళూరులో స్వదేశీ విడిభాగాల తయారీకి బాధ్యత వహిస్తుంది. ఎబిడబ్ల్యులు 3: 1 నిష్పత్తిలో పౌర, రక్షణ సైనిక సిబ్బందితో పనిచేస్తాయి, ఒక వర్క్‌షాప్‌లో సగటు ఉద్యోగులు, కార్మికులు 1,500 నుంచి 2,000 మధ్య ఉంటారు. సాధారణంగా 505 ఎబిడబ్ల్యులో 17 శాతం మంది రక్షణరంగానికి, 20 శాతం మంది రక్షణ సిబ్బంది నుంచి తిరిగి నియమితులైనవారు, మిగిలినవారు సాధారణ ఉద్యోగులు ఉంటారు.

ఎబిడబ్ల్యులు ఆయుధ వ్యవస్థల "జీరో అవర్, జీరో కిలోమీటర్-పునరుద్ధరణ'' సమగ్రతను చేపట్టాయి, మొత్తం అరిగిపోయిన / దెబ్బతిన్న భాగాలను మార్చడం, కలపడం, మరమ్మతు చేయడం లేదా భర్తీ చేయడం కోసం ఆర్మీ మాస్టర్ జనరల్ ఆఫ్ ఆర్డినెన్స్ (ఎంజివో) శాఖ ఎబిడబ్ల్యుల లక్ష్యాలను నిర్ణయిస్తుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఆర్డినెన్స్ సర్వీసెస్ (డిజివోలు) ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలతో సహా ఇతర ఏజెన్సీలచే విడిభాగాల సరఫరాతో పాటు, ఇఎంఇల సమగ్ర సామర్థ్యం బ్యాక్‌లాగ్, అన్ని జనరల్ ఆర్మీ వాహనాల సమగ్ర నిర్వహణకు డైరెక్టర్ జనరల్ ఇఎంఇ బాధ్యత వహిస్తుంది. ఎబిడబ్ల్యులు ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తాయి. ఆర్డినెన్స్ కర్మాగారాలు ప్రధానంగా లైసెన్స్ కింద ఉన్న పరికరాలను తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం క్షేత్ర నిర్మాణం, యూనిట్, డివిజన్-స్థాయి వర్క్‌షాప్‌లలో సర్వీసింగ్, లో-ఎండ్ మరమ్మతులు, విడిభాగాల భర్తీ జరుగుతుంది. కార్ప్స్ స్థాయిలో ఇంటర్మీడియట్ వర్క్‌షాప్‌లు పావు వంతు, మూడింట రెండు వంతుల కాలం గడిపిన వాహనాలకు మధ్యస్థాయి మరమ్మతులను నిర్వహిస్తాయి. ఎబిడబ్ల్యులు మిడ్-లైఫ్ ఓవర్‌హాల్‌తో పాటు నూతన వాహనాలను కూడా సమగ్రంగా నిర్వహిస్తారు. యుద్ధ పరిస్థితులకు తగిన స్థితిలో ఆయుధ సామగ్రిని నిర్వహించడానికి ఎబిడబ్ల్యులు పనిచేస్తుంటాయి.

### కాగ్ నివేదిక

2016లో కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సి అండ్ ఎజి) నివేదిక "నిర్వహణకు అధిక సమయం తీసుకోవటం, తగినన్ని విడిభాగాలు లేకపోవడం వల్ల లక్ష్యాలను తగ్గించడం, అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనలో ఆలస్యం నిర్వహణను ప్రతికూలంగా ప్రభావితం చేసిందని పేర్కొంది. విడిభాగాల సరఫరా, వినియోగంలో అధిక ఆలస్యాన్ని కాగ్ నివేదిక ఎత్తిచూపింది. 2010-2016 మధ్య పనితీరు ఆడిట్, బిఎంపి-2 వాహనాన్ని సరిదిద్దడానికి ఇప్పటికే

ఉన్న 153 రోజుల ప్రమాణానికి వ్యతిరేకంగా, కొన్ని సందర్భాల్లో 512 ఎబిడబ్ల్యుకి 1, 512 రోజులు పట్టిందని పేర్కొంది. అదే సమయంలో 505 ఎబిడబ్ల్యు టి-72 ట్యాంక్ ను సరిదిద్దడాన్ని 144 రోజులలో చేయాల్సి వుండగా, 836 రోజులు పట్టింది. ఇతర బ్యాక్ లాగ్ లు ఎఆర్‌వి డబ్ల్యుజడ్‌టి-2 విషయంలో 90 శాతం, టిసి రిపోర్టర్ రాడార్ కు 34 శాతం బిఎంపి-2 కి 33 శాతం, బ్యాటిల్ ఫీల్డ్ సర్వైలెన్స్ రాడార్ కు 21 శాతం, టి - 72 కి 20 శాతం, ఫైకాచర్ రాడార్ కు 18 శాతం ఎక్కువ సమయం తీసుకున్నాయి. ఎన్‌బిసి (అణు, జీవ, రసాయన) యుద్ధంలో కీలక భాగమైన దేశీయంగా అభివృద్ధి చెందిన ఎంబిటి అర్జున్ మరమ్మత్తు / ఓవర్‌హాల్, ట్యాంకులు, బిఎమ్‌పిల పరీక్షలకు ఎటువంటి సౌకర్యాలు లేవు, ట్యాంకుల ఫోర్డింగ్ ఉభయచర సామర్థ్యాన్ని, సమగ్రతను తనిఖీ చేయటానికి ఇది తప్పనిసరి.

> “ రాజకీయ పార్టీలు నిర్ధిష్ట పరిస్థితిని బట్టి రూపొందించుకునే కార్యాచరణలతో నడుస్తాయి. నిలుస్తాయి. ఇక్కడే రాజకీయ వ్యూహాలను యుద్ధరంగంతో పోల్చవచ్చు. యుద్ధంలో పాల్గొంటున్నా ఎప్పుడు ఎలాటి అడుగు వేయాలన్నది రణ భూమిలోనే నిర్ణయమవుతుంది తప్ప సైనికశాస్త్రం చెప్పిందని శాశ్వత నిర్ణయాలు జరగవు. ఇది రాజకీయ వ్యూహాలకూ వర్తిస్తుంది. ”



కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరించబోతున్న 8 సైనిక బేస్ వర్క్‌షాపుల్లో ఒకటి

పనుల్లో జాప్యానికి, లక్ష్యాలను సాధించలేకపోవడానికి విడిభాగాలు లభించకపోవడమే ప్రధాన కారణమని ఎంజివో శాఖ వాదనతో కాగ్ సంతృప్తి చెందలేదు. అది తన నివేదికలో: “విడిభాగాల కేటాయింపుకు డిజివోలు బాధ్యత వహించాలి. ఆర్మీ వాహనాల సముదాయాన్ని సరిదిద్దడానికి, నిర్వహించడానికి డిజిఇఎంఇ బాధ్యత వహించాలి. ఈ రెండు ఏజెన్సీలు ఎంజివో క్రింద పనిచేస్తూ సమయానుగుణంగా, సంతృప్తికరమైన సమగ్ర లక్ష్యాన్ని సాధించడానికి విడిభాగాల సేకరణ నిర్వహణపై సన్నిహిత సమన్వయంతో పనిచేయడం అవసరం. ఈ రెండు ఏజెన్సీల మధ్య సమన్వయం లేకపోవడం విడిభాగాల సేకరణలో జాప్యానికి దారితీసింది.“అని పేర్కొంది.

### ఎంఆర్‌వో వ్యవస్థ సోమరితనం

ఎబిడబ్ల్యుల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, రక్షణ ఉత్పత్తి విభాగంలో దశాబ్దాలుగా యుద్ధరంగానికి కావలసిన కార్యాచరణ, పరికరాలను అభివృద్ధి చేసుకోవటానికి గుణాత్మక, పరిమాణాత్మక సమగ్ర యంత్రాంగం కోసం చేసిన అభ్యర్థనలను రక్షణ మంత్రిత్వ శాఖ అంతగా పట్టించుకోలేదు. ప్రస్తుత వ్యవస్థతో అతుకుల బొంత చర్యలతో ముందుకు నడవడానికి వరుస ప్రభుత్వాలు ప్రయత్నించాయి. ప్రస్తుతం ఉన్న ఎంఆర్‌వో వ్యవస్థ మందగమనం కారణంగా దాదాపు 60 నుండి 70 శాతం యంత్రాలు నిరర్ధకమైన దశకు చేరుకున్నాయి.

ఆర్మీ బేస్ వర్క్ షాప్ గ్రూప్ మాజీ కమాండర్ మేజర్ జనరల్ సంజీవ్ ఖన్నా (రిటైర్డ్) ఇలా అన్నాడు: “ఎబిడబ్ల్యు కమాండెంట్ తన విడిభాగాల జాబితాను సిద్ధం చేసుకునేందుకు అనుమతించాలి. ఒక యుద్ధ ట్యాంక్ సుమారు 7, 000 భాగాలను కలిగి ఉంటుంది, వీటిలో 5,000 బేస్ వర్క్‌షాప్ స్థాయిలో ప్రత్యేకంగా అవసరం. వర్క్‌షాప్ కమాండెంట్ నియంత్రణలో ఈ భాగాల ఇండెంట్ ఎందుకు లేదు? సామర్థ్యం లేని విడిభాగాలతో ఎబిడబ్ల్యుల పనిపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. అలాగే, అతనికి కార్మికులు, ఉద్యోగులు, విడిభాగాలు మొదలైన వాటి కోసం బడ్జెట్ ఇవ్వనందున అవసరమైన పనులు చేయలేరు”.

టి-72, టి-90లు ఎటువంటి వైఫల్యాలు లేకుండా దాదాపు 300 కిలోమీటర్ల దూరం వెళ్లగలిగే సమర్ధత గలవి. వాటి సమగ్ర పరిశీలన వల్ల 14-16 సంవత్సరాలు సాధారణంగా మన్నుతాయి. వీటి వాడకం ప్రాంతం- అధిక ఎత్తు / ఎడారి-విస్తరణ వంటి పరిమితులపై ఆధారపడి ఉంటాయి.

2018 జనవరిలో నరేంద్రమోడి ప్రభుత్వం రక్షణ రంగానికి సంబంధించి ప్రైవేటీకరణ ప్రణాళికకు అనుగుణంగా, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఎనిమిది ఎబిడబ్ల్యులలో నాలుగింటిని ప్రైవేటు రంగానికి అప్పగిస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయంపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. నాలుగు లక్షలమంది సభ్యులున్న బలమైన ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌తో పాటు అనేకమంది గోకో మోడల్‌ను, దాన్ని బేస్ వర్క్‌షాప్‌ల కోసం అమలు చేయాలనే నిర్ణయాన్ని విమర్శించారు. 2019 లో ఆర్‌ఎఫ్‌ఐని 20కి పైగా కంపెనీలకు పంపించారు. 2020 మేలో ఆర్‌ఎఫ్‌ఐ కు స్పందించినవే దీనికీ సమాధానమిచ్చాయి. పిఎస్‌యులు, ఆర్డినెన్స్ కర్మాగారాలను బిడ్డింగ్‌లో పాల్గొనకుండా నిరోధించారు.

జనవరి 2020 లో గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్‌ను ఈ ప్రాజెక్ట్ కోసం ప్రైవేట్ సంస్థలను ఆకర్షించడానికి కన్సల్టెంట్‌గా నియమించారు. రక్షణ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, “ప్రభుత్వం భూమి, మౌలిక సదుపాయాలు, ప్లాంట్ యంత్రాలు,

> ❝ అనేక ఎదురుదెబ్బలు, పరాజయాలతోనే మానవ సమాజ పురోగమనం, పునర్నిర్మాణం జరుగుతాయి. ఉద్యమాల ముందు, వెనకలు కూడా అలాటివే. గతాన్ని గురించి సరైన మదింపు వేసుకుని, వర్తమానాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకుంటేనే పార్టీ తన కర్తవ్యాన్ని పూర్తి చేయగలుగుతుంది. ఈ క్రమంలో ఒంటెత్తు వాదులు అంతర్గత విషయాలలో తలమునక లవుతారని గ్రామ్‌స్కీ హెచ్చరిస్తాడు. ❞

పరికరాలు, పర్యవేక్షణ కాంట్రాక్టర్‌కు అందజేస్తుంది. కాంట్రాక్టర్ అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుని తన బాధ్యతలను నిర్వర్తించాలి. పరస్పరం అంగీకరించిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు అవసరమైన లైసెన్సులు, ధృవపత్రాలు గుర్తింపులను పొందడంతో పాటు అవసరమైన సేవలను అందించడం వారి బాధ్యత".

లెఫ్టినెంట్ జనరల్ ఎస్.బి. ఇఎంఇ మాజీ డైరెక్టర్ జనరల్ సింగ్ (రిటైర్డ్) ఇలా వివరించారు: "నావికా, వైమానిక దళాల కోసం నావికాదళ డాక్ యార్డులు, బేస్ రిపేర్ డిపోలు పోరాట పరికరాలు, దళాలను శక్తివంతం చేసేందుకు ఎబిడబ్ల్యులపై ఆధారపడతారు. భారత సైన్యం 70 శాతం కాలంతీరిన పరికరా లతో ఉంది. ఎబిడబ్ల్యులను ఆధునీకరిం చాల్సిన అవసరం ఉంది, తద్వారా దాని వ్యవస్థలను శక్తివంతంగా ఉంచవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో లాభార్జన, అవినీతి, అపనమ్మకం, వ్యక్తిగత ప్రయోజనాలకు సైనికాధికారులు పరితపించటం వంటి పరిస్థితులను సరిదిద్దకుండా ప్రైవేటీకరించడం సమాధానం కాదు. సైన్యంలో ప్రధానమైన ట్యాంకుల ఎంఆర్‌వోను నిర్వహించేందుకు మొత్తంగా ప్రైవేటు సంస్థలకు అప్పగించిన పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా లేదు. సైన్యంలోని ప్రధాన విభాగమైన ఆయుధాల ఉత్పత్తి రంగం, లేజర్ గైడెడ్ క్షిపణి వ్యవస్థ, రాడార్‌లు మొదలైనవి విక్రేతల చేతిలో ఉండకూడదు. ప్రైవేటు రంగంలో ఆయుధాలు తయారవుతున్నప్పుడు 'డి' స్థాయి మరమ్మతులు వారు చేవట్టవచ్చు. విడిభాగాలను సమగ్ర కిట్‌లుగా సరఫరా చేసే సమన్యకు గల మూల కారణాన్ని పరిష్కరించడం చాలా ముఖ్యం. ఈ రెండు ప్రధాన సమస్యలను ప్రైవేటురంగానికి అప్పగిస్తే ఎబిడబ్ల్యులు ఎప్పటి స్థితిలోనే ఉంటాయి.

గోకో నమూనాను అనుసరించడ మంటే ఎబిడబ్ల్యులను తమ విస్తారమైన భూమితో పాటు ప్రధాన ప్రదేశాలు, ప్లాంట్, సాధనాలు యంత్రాలను ప్రైవేటు రంగానికి ఉచితంగా ఇవ్వడ మేనని చాలా మంది సైనిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నాలుగు ఎబిడబ్ల్యుల పునర్నిర్మాణంతో పాటు వాటిలోని రెండు వర్క్‌షాపులను, నారాంగి (గౌహతి) ఉధంపూర్ (జమ్మూ కాశ్మీర్) పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించారు. ఢిల్లీ వద్ద ఒక స్టాటిక్ వర్క్ షాప్, మూడు ఆర్డినెన్స్ డిపోలు షకుర్బాస్టి (ఢిల్లీ), చోకీ, కాన్పూర్ (ఉత్తర్ ప్రదేశ్‌లో రెండూ), పనాగర్ (పశ్చిమబెంగాల్) వద్ద ఒక వాహన డిపో. జబల్పూర్, అలహాబాద్, మీరట్, కిర్కీలలో బేస్ వర్క్‌షాప్‌లు ఏప్రిల్ 2019 నాటికి ప్రైవేటు రంగానికి అప్పగించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. మిగిలిన నాలుగు, 505 ఎబిడబ్ల్యు ఢిల్లీ, 507 ఎబిడబ్ల్యు కంకినారా, 509 ఎబిడబ్ల్యు ఆగ్రా, బెంగళూరు వద్ద ఉన్న 515 ఎబిడబ్ల్యును రెండవ దశలో 2019 డిసెంబరు నాటికి కార్పొరేటీకరణ చేయాలని భావించారు.

2016 లో అప్పటి రక్షణ మంత్రి మనోహర్ పారికర్ నియమించిన లెఫ్టినెంట్ జనరల్ డి.బి. షెకాట్కర్ (రిటైర్డ్) అధ్యక్షతన గల నిపుణుల కమిటీ చేసిన సిఫారసులు గోకో నమూనాలో భాగమే. సైనికుల నిష్పత్తిని కుదించాలని, ఎబిడబ్ల్యుల నిర్వహణను ప్రైవేటుపరం చేయాలని కమిటి సిఫారసు చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆ నివేదిక బహిరంగపరచలేదు. దాంతో మోడీ ప్రభుత్వ ఉద్దేశాలపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి.

విడిభాగాల సరఫరాను క్రమబద్ధీకరిస్తే 90 శాతం ఎబిడబ్ల్యుల కష్టాలు పరిష్కార మవుతాయని అధికారులు భావిస్తున్నారు. అనుభవజ్ఞుడైన ఇఎంఇ అధికారి కల్నల్ వినోద్ తివారీ (రిటైర్డ్) ఇలా అన్నారు: 'ఎబిడబ్ల్యులు పని చేయకపోతే అది వాటి స్వాభావిక తప్పు కాదు. విడిభాగాల కొరతనుండి లోపం ఏర్పడు తుంది. ఆర్మీ ఆర్డినెన్స్ డైరెక్టరేట్ ఎబిడబ్ల్యులకు అవసరమైన విడిభాగాల కొరతను తీర్చలేక పోయింది. ఆర్డినెన్స్ డైరెక్టరేట్ ఆర్డినెన్స్ కర్మాగారాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఎబిడబ్ల్యులకు అవసరమైన విడిభాగాల పరిమాణం ముందుగానే అంచనా వేస్తారు. ఆర్డినెన్స్ కర్మాగారాలకు వాటిని అందించినప్పటికీ అవి సరఫరా చేయడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే ఉన్న విక్రేతలు అన్ని ఆర్డర్‌లలో 50 శాతం మాత్రమే సరఫరా చేస్తూ వారి అంతర్గత అవసరాల కోసం విడిభాగాలను అమ్ముకోవడం వల్ల ఎలాంటి మేలు కలుగదు."

రక్షణ మంత్రిత్వ శాఖ కొత్త వనరులను, కొత్త విక్రేతలను సృష్టించాలని సైనిక నిపుణులు గట్టిగా నమ్ముతున్నారు. కానీ సాధ్యమా? రక్షణ మంత్రిత్వ శాఖను సాంకేతిక నైపుణ్యం లేని వ్యక్తులు నిర్వహిస్తున్నారని అధికారులు చెప్పారు.

"మంత్రిత్వశాఖలోని అనేకమంది యుద్ధ ట్యాంక్‌కు, బంగాళాదుంపల చిప్స్‌కు మధ్య వ్యత్యాసం తెలియని వారిగా ఉన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖకు వృత్తి నైపుణ్యం లేదు. కాబట్టి ఎబిడబ్ల్యులను ఎందుకు నిందించాలి? విధాన నిర్ణేతలు, నిబంధనల మధ్య మేం చిక్కుకున్నాం" అని కొందరు అధికారులు వెల్లడించారు. ❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

# వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న పర్యావరణ విధ్వంసం



రచయిత పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా (పారీ) ఎగ్జిక్యూటివ్ ఎడిటర్

**షామిలా జోషి**

**2019** జూన్‌లో రాజస్థాన్‌లోని చురులో నమోదైన ఉష్ణోగ్రత 51 డిగ్రీల సెల్సియస్. వేసవి కాలం ఎక్కువ రోజులు ఉండటం కారణంగా వాతావరణంలో సంభవించిన మార్పుల్లో ఇదొకటి. "ఎండకు వీపు కాలిపోతోంది" అని గజువాస్ గ్రామ శివారులో అక్కడక్కడా పరుచుకున్న ఖేజ్రీ చెట్లనీడలో కూర్చున్న భజరంగ్ గోస్వామి అంటున్నాడు. "ఎండ పెరిగిపోతోంది, పంట తరిగిపోతోంది" అని కోసిన సజ్జపంట వేపు చూస్తూ చెప్పాడు. అక్కడకు దగ్గర్లో ఒక ఒంటె ఎండిన గడ్డి తింటోంది. రాజస్థాన్‌లోని చురు జిల్లా తారానగర్ తహసిల్ పరిధిలో అతను, అతని భార్య రాజ్‌కౌర్‌లు కలిసి 22 భీగాల–15 ఎకరాలు–వ్యవసాయభూమి సాగుచేసుకుంటున్నారు.

"తలపై ఎండ మాడిపోతుంటే కింద ఇసుకలో కాళ్లు కాలిపోతున్నాయి'' అని తారానగర్ దక్షిణ ప్రాంతం సుజాన్‌ఘర్ తహసిల్‌కు చెందిన గీతాదేవి నాయక్ అంటోంది. భూస్వామి భగవానీ దేవి చౌదరి కుటుంబానికి చెందిన భూమిలో భూమిలేని వితంతువు గీతాదేవి పని చేసుకుంటోంది. ఆ ఇద్దరూ ఆ రోజు సాయంత్రం 5 గంటలకు గుడవారి గ్రామంలో పని ముగించుకుని వస్తుండగా భగవానీదేవి "ఈ రోజుల్లో మండే ఎండ రోజురోజుకు పెరిగిపోతున్నది" అని అంటోంది.

రాజస్థాన్ ఉత్తరాన గల చురు జిల్లాలో మే, జూన్ నెలల్లోని వేసవిలో ఇసుక నేలలు మంటెక్కిస్తే, వేడిగాలి వలన కుంపట్లో కూర్చున్నట్టు అనిపిస్తుందని ఎండవేడి గురించి మాట్లాడుకుంటున్నారు. ఇక్కడి ఎండ తీవ్రత ఇలా ఉండడం సర్వసాధారణం. ఆ నెలల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పై మాటే. 2020 మేలో ఉష్ణోగ్రత 50 డిగ్రీలను తాకింది, అది ప్రపంచంలోనే అత్యధికం అని మే 26న పత్రికల్లో ప్రచురితమైంది.

2019 జూన్ తొలిరోజుల్లో చురులో ఎండ వేడిమి నీరు ఆవిరయ్యేందుకు అవసరమైన వేడిలో సగానికి, అంటే 51 డిగ్రీలకు చేరింది. "నాకు గుర్తున్నంతవరకు 30 యేళ్ళ క్రితం దాదాపు 50 డిగ్రీలకు చేరింది" అని 75 సంవత్సరాల రిటైర్డ్ స్కూలు టీచరు హరదయాళ్‌జీ సింగ్ గుర్తుచేసుకున్నాడు. ఆయన కొద్దిపాటి భూమి యజమాని, గజువాస్ గ్రామంలో నివసిస్తాడు.

ఆరు నెలల క్రితం, అంటే డిసెంబరు–జనవరి నెలల్లో చురులో ఉష్ణోగ్రత సున్నా కంటే తక్కువగా ఉంది. 2020 ఫిబ్రవరిలో భారతదేశంలో 4.1 డిగ్రీలతో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతం చురు అని భారత వాతావరణ శాఖ తెలియజేసింది. జిల్లాలోని ప్రజలు ఈ ప్రాంతంలో ఒక్క డిగ్రీ నుంచి 51 డిగ్రీల వరకు పెరిగే ఉష్ణోగ్రత గురించే చెప్పుకుంటారు. 2019 జూన్‌లో 50 డిగ్రీలను దాటిన వేడిమి కంటే వేసవి కాలం రోజులు మరింతగా పెరిగి మిగిలిన కాలాల్ని మింగేయడం గురించే ముచ్చటించుకుంటారు. "గతంలో ఎండవేడి ఒకటి రెండు రోజులే ఉండేది" అని చురు పట్టణవాసి, సమీపంలోని సికార్ జిల్లా ఎస్.కె. ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్ హెచ్.ఆర్.ఇస్రాన్ అంటూ "ఇప్పుడు ఆ వేడి మరిన్ని రోజులు సాగుతోంది. దాంతో వేసవి పెరుగుతోంది."అన్నారు. "మిట్టమధ్యాహ్నం రోడ్డు మీద నడిస్తే కాళ్లకున్న చెప్పులకు తారు అంటుకునేది" అని అమృతా చౌదరి 2019 జూన్ నాటి రోజులను గుర్తు చేసుకుంది. సుజాన్‌ఘర్ పట్టణంలో దుస్తులు తయారుచేసే దిశ షెఖావతి సంస్థలో పనిచేస్తున్న చౌదరి వేసవి పెరగడం పట్ల ఇతరుల్లాగే ఆందోళన పడేది. "ఈ ప్రాంతంలో వేడి మరింతగా పెరగడమే కాక తొందరగా మొదలవుతున్నది" అని అభిప్రాయపడింది.

గుదావరి గ్రామంలోని భగవానీ దేవి "ఈ వేసవి నెలన్నర పాటు పెరిగింది" అంటే చురు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందినవారు వేసవి పెరగడంతో రుతువులు మారుతున్నా యనే అభిప్రాయంతో ఉన్నారు. పెరిగిన వేసవితో వర్షాకాలం, చలికాలం కుంచించుకుపోతున్నాయి. వాతావరణంలో వచ్చిన ఈ మార్పులతో కేవలం యేడాదిలో వారంకన్నా ఎక్కువరోజులు 50 డిగ్రీలు, అంతకుపైగా ఉండడమే వారిని బాధిస్తోంది. చురులో 2019 జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 లోపల 369 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది ఆ ప్రాంతంలో వర్షాకాలంలో సాధారణంగా కురిసే సగటు వర్షపాతం 314 కంటే కొంచెం ఎక్కువ. భారతదేశంలో అతిపెద్ద ఎడారితో కూడిన రాజస్థాన్ విస్తీర్ణం దేశ విస్తీర్ణంలో 10.4 శాతంగా ఉంది. ఇక్కడ అధికారిక లెక్కల ప్రకారం సగటు వర్షపాతం 574 మిల్లీమిటర్లు.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు దాదాపు 7 కోట్లమంది వ్యవసాయం, పాడిపరిశ్రమపై ఆధారపడితే మిగిలినవారు ఇతర వ్యాపకాల్లో ఉన్నారు. చురు జిల్లాలో 25 లక్షల మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అక్కడ వారి వ్యవసాయం వర్షాధారమే. కాలం గడిచేకొద్దీ వర్షాలపై ఆధారపడేవారి సంఖ్య తగ్గుతున్నది. "1990 నుంచి బోరుబావుల (500–600 అడుగుల లోతువరకు) తవ్వకం మొదలయింది. కానీ ఉప్పదనం కారణంగా అవి అంతగా విజయవంతం (భూగర్భజలాలు) కాలేదు" అని ప్రొఫెసర్ ఇస్రాన్ చెప్పారు. జిల్లాలోని ఆరు తహసీళ్ల పరిధిలోని 899 గ్రామాల్లో "కొందరు రైతులు రెండో పంటగా వేరుశనగ (బోర్‌బావుల నీటిని వినియోగించి) వేశారు. "దాంతో కొన్ని గ్రామాల్లో తప్ప భూమి మరింతగా ఎండడంతో పాటు అనేక బోరుబావులు వట్టిపోయాయి" అని ఆయన చెప్పారు.

రాజస్థాన్ రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక (ఆర్ఎస్ఎపిసిసి, 2010) ప్రకారం రాష్ట్రంలో 38 శాతం (లేదా 62,94,000 హెక్టార్లు) నీటి సదుపాయం ఉన్న పంట భూమి. చురులో అది అతి తక్కువ అంటే 8 శాతం మాత్రమే. త్వరలో పూర్తికానున్న చౌదురి కుంభరం ఎత్తిపోతల జిల్లాలోని కొన్ని గ్రామాలకు, కొంతభూమికి మాత్రమే నీటి సదుపాయం కల్పిస్తుంది. చురులో ఖరీఫ్‌లో సాగుచేసే నాలుగు వ్యవసాయ పంటలు సజ్జలు, పెసలు తదితరాలు అధికంగా వర్షాధారాలే. గడిచిన 20 సంవత్సరాల కాలంలో వర్షం పడే తీరు మారింది. చురులో ఉన్న ప్రజలు రెండు రకాలుగా ప్రస్తావిస్తారు. వర్షాకాలం నెలలు మారిపోయాయి, వర్షం చెదురుమదురుగా

కురుస్తుంది, కొన్ని చోట్ల తీవ్రంగా, మరికొన్ని చోట్ల కొద్దిగా కురుస్తుంది.

పాతరోజుల్లో వర్షం పడే తీరు ఎలా ఉండేదో పెద్దవాళ్లయిన రైతులు తమ అనుభవాలను చెబుతారు. "జూన్, జులై నెలల్లో మెరుపులు మెరిస్తే, వాన వస్తుందనుకుని పొలాల్లో ఉన్నవాళ్లు త్వరత్వరగా రొట్టెలు చేసుకునేవాళ్ళు" అని జాట్ కులానికి చెందిన గోవర్ధన్ సహారాన్ అనే 59 యేళ్ల రైతు గతాన్ని గుర్తు చేసుకున్నాడు. ఆయన ఉమ్మడి కుటుంబానికి 180 భీగాల (అంటే దాదాపు 120 ఎకరాలు) భూమి ఉది. ఆయన గజువాస్ గ్రామస్థుడు. జాట్‌లు, చౌదరీలు ఒబిసి కులాలకు చెందినవారు చురులో వ్యవసాయం చేసేవారిలో అధికం. " ఇప్పుడు కూడా అప్పుడప్పుడు మెరుపులు వస్తాయి, అక్కడితోనే నిలిచిపోతాయి, వానలు రావు" అని సహారాన్ జోడించాడు.

జూన్ నెలాఖరులో సజ్జ వేసే సమయానికి తొలివాన పడితే కొన్ని వారాల పాటు లేదా ఆగస్టు చివరికి కూడా వాన పడని పరిస్థితి ఉన్నదని కొందరు రైతులు చెప్పారు. అలాంటి పరిస్థితిలో ఏ సమయంలో పంట వేయాలో నిర్ణయించుకోవడం కష్టమవుతుంది. " గాలివాలు, నక్షత్రాల స్థితి, పిట్టల అరుపుల ఆధారంగా మా పెద్దవాళ్ల కాలంలో సాగు చేయడానికి కావలసిన నిర్ణయాలు తీసుకునేవారు" అని అమృతా చౌదురి వివరించారు. "ఇప్పుడా పరిస్థితి మొత్తం మారిపోయింది" అని తారానగర్ బ్లాక్‌లోని భారంగ్ గ్రామనివాసి, 200 భీగాలు సాగుచేస్తున్న రైతు, రచయిత దులారాం సహారాన్ చెప్పారు.

ఆర్ఎస్ఎపిసిసి 1951 నుంచి 2007 వరకు అత్యధికంగా రికార్డయిన వర్షపాతాలను నమోదు చేసింది. సమాచారాన్ని అధ్యయనం చేస్తే మొత్తంగా వర్షపాతం తగ్గడానికి పర్యావరణ మార్పు కారణమని స్పష్టమౌతున్నది. చురులోని రైతులు వర్షాకాలం అనంతరం అప్పుడప్పుడు అక్టోబరులో రబీపంటలైన వేరుశనగ, బార్లీ కోసం జనవరి-ఫిబ్రవరి నెలల్లో పడే వానజల్లులపై ఆధారపడతారు. "ఈ వానలు ఐరోపా, అమెరికా సముద్రాల మీదుగా పాకిస్తాన్ సరిహద్దులను దాటి వస్తాయి" అని చెప్పిన హర్‌దయాళ్ ఆ వానలు ఇప్పుడు పూర్తిగా కనుమరుగైనాయన్నారు.

జమ్ము కాశ్మీర్ తరువాత చలిగాలులు అధికంగా ఉండేది రాజస్థాన్‌లోనే అని 1901 నుంచి 1999 వరకు ఆర్ఎస్ఎపిసిసి నివేదికలోని వందేళ్ల సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. (1999 తరువాత సమాచారం లేదు) రాజస్థాన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలకు వేడిగాలులు, చురు లాంటి ప్రాంతాల్లో అ 4.1 డిగ్రీలకు పరిమితమైన అత్యల్ప ఉష్ణోగ్రతలకు చలిగాలులు కారణమని నివేదికలో పేర్కొన్నారు. చురు ఇప్పటికీ చల్లగా ఉన్నా గతంలోలా మాత్రం లేదని అంటూ " నేను పిల్లవాడిగా ఉన్నప్పుడు (50 యేళ్ల క్రితం) నవంబరు ఆరంభంలో వంటికి దుప్పటి చుట్టుకుని, రజాయి కప్పుకొని ఉదయం 4 గంటలకు పొలానికి వెళ్లేవాడిని" అని గజువాస్ గ్రామవాసి గోవర్ధన్ సహారాన్ చెప్పాడు. అదే ఇప్పుడు సజ్జచేలో లదా ఖేజ్రీ చెట్ల మధ్య "నవంబరు నెలలో నేను కేవలం బనియన్ మాత్రమే వేసుకుంటున్నా" అన్నాడు. మొత్తంగా చూస్తే వేసవి కాలం రోజులు పెరిగాయి, వేడిమి కూడా పెరిగిందనేది వాస్తవమని వారందరూ చెప్పారు.

సుజాన్‌ఘర్ పట్టణంలో అంగన్‌వాడీగా పనిచేసే పురోహిత్ 3-5 సంవత్సరాలలోపు ఉండే చిన్న పిల్లల బృందం వైపు చూపిస్తూ "వారందరూ చలికాలం బట్టలు వేసుకున్నారు. కానీ నవంబరులో కూడా వేడిగా ఉంది. వారేమి వేసుకోవాలో చెప్పలేకపోతున్నాం" అని మారిన వాతావరణం గురించి ప్రస్తావించారు. చురులో అందరికీ తెలిసిన మంచి కాలమిస్టు, 83యేళ్ల మాధవశర్మ "నవంబరులో కంబళ్లు, కోట్లు వేసుకునే కాలం వెళ్లిపోయింది" అని ముగించారు. కంబళ్లు, కోట్లు వేసుకునే కాలాన్ని విస్తరించిన వేసవి మింగేసింది. గతంలో వసంతంతో సహా నాలుగు విభిన్నమైన కాలాలుండేవి. ఇప్పుడు ఒకటే పెద్దకాలం. అది వేసవి. దాదాపు ఎనిమిది నెలలుంటుంది. చాలాకాలంగా ఇదే కొనసాగుతోంది అని మాధవ్‌జీ జోడించారు.

గతంలో మార్చి కూడా చల్లగా ఉండేది. ఇప్పుడు కొన్నిసార్లు ఫిబ్రవరి చివర్లోనే వేడి మొదలవుతోంది. అది అగస్టు వరకు ఉండాల్సింది అక్టోబరు వరకు కొనసాగుతోంది అని తారానగర్‌లో వ్యవసాయక్షేత్రంలో పనిచేసే నిర్మల్ ప్రజాపతి చెప్పారు. చురులోని వ్యవసాయ క్షేత్రాల్లో మండించే ఎండతో పనిగంటలు కూడా మార్చుకోవలసి వస్తున్నది.

వేడి పెరగటం వల్ల వేసవి మరింతగా మండిస్తున్నది. రాజస్థాన్‌లో వేడిమితో కూడిన వేసవులు మాకు సర్వసాధారణం కానీ వేసవి వేడి అంటే తొలిసారిగా భయపడుతున్నామని తారానగర్‌కు చెందిన రైతు కార్యకర్త హర్‌దయాళ్ కుమారుడు ఉమ్రావ్ సింగ్ చెప్పారు. రాజస్థాన్‌లో 2019 జూన్‌లో మాత్రమే ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు చేరుకోలేదు. చురులో మండు వేసవిలో 1993లో 49.8 డిగ్రీలకు చేరింది.

పరిసరాల కాలుష్యం వల్ల వేడి పెరగడంతో పాటు వాతావరణంలో మార్పులు సంభవించి భూతాపం అధికమవుతున్నదని ప్రొఫెసర్ ఇస్రాన్, మాధవశర్మలు అంటున్నారు. "భూతాపం పెరగడానికి కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, అడవులు తగ్గిపోవడం, వాహనాలు పెరగడం కారణం'' అని తారానగర్ తహసీల్‌లోని భలేరి గ్రామంలోని మాజీ ప్రిన్సిపాల్, రైతు రామ్‌స్వరూప్ సహారాన్ చెబుతున్నారు. "పరిశ్రమలు పెరుగుతున్నాయి. ఎయిర్ కండిషనర్లు, కార్ల వాడకం పెరుగుతున్నది, దాంతో వాతావరణ కాలుష్యం, భూతాపం పెరుగుతున్నాయి" అని జైపూర్‌లో ఉంటున్న సీనియర్ జర్నలిస్టు నారాయణ్ బరేత్ అంటున్నారు.

చురు థార్ ఎడారికి ముఖద్వారం. సంభవిస్తున్న వాతావరణ మార్పులకు ఇదొక లింకు మాత్రమేనని కొన్ని లెక్కల తెలుపుతున్నాయి. 1970 తరువాత ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ హౌస్ గ్యాసెస్-జిహెచ్‌జి - పెరుగుదల, వాతావరణ మార్పుల గురించి రాజస్థాన్ రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక చర్చించింది. కేవలం రాజస్థాన్‌కు మాత్రమే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో పెద్దఎత్తున జిహెచ్‌జి ఉద్గారాల కారణంగా సంభవిస్తున్న మార్పులను అధ్యయనం చేసింది. విద్యుత్ రంగంలో పెద్దఎత్తున జరుగుతున్న కార్యకలాపాలు, పెరిగిన శిలాజతైలాల వినియోగం, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు, పెరిగిన పారిశ్రామిక ప్రక్రియ, అడవులు, భూమి వినియోగంలో వచ్చిన మార్పులు, వీటన్నింటి ఫలితంగానే వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి.

చురు గ్రామాల్లోని ప్రజలు జిహెచ్‌జి గురించి మాట్లాడరు, వాటి ప్రభావం వల్ల కలిగే ఫలితాల మధ్య వారు జీవిస్తున్నారు. గతంలో ఫ్యాన్లు, కూలర్లు లేకపోయినప్పటికీ కాలం గడిచిపోయేది. కానీ ఇప్పుడలా కాదు. అవి లేకుండా బతకడం సాధ్యం కాదని హర్‌దయాళ్ జీ అన్నారు. నిరుపేద కుటుంబాలు ఫ్యాన్లు, కూలర్లు కొనలేరు. భరించలేని వేడి కారణంగా డయేరియా, వాంతులు (ఇతర ప్రభావాలు) సమస్యలతో డాక్టరు దగ్గరకు వెళ్లాలంటే బోలెడంత ఖర్చవుతుందని అమృత పేదల పరిస్థితిని వివరించింది. ఆ రోజుకు పని ముగించుకుని సాయంత్రం పొలం నుంచి బస్సులో సుజాన్‌ఘర్‌లోని ఇంటికి వెళ్లబోయే ముందు భగవానీ దేవి మాట్లాడుతూ "ఈ వేడిలో పనిచేయడం చాలా కష్టం. మేం అలసిపోతాం, కళ్లు తిరుగుతుంటాయి. అక్కడున్న చెట్ల కింద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని కొన్ని నిమ్మకాయ నీళ్లు తాగితే కానీ మళ్లీ పనిలో అడుగుపెట్టలేం'' అన్నారు. పర్యావరణ విధ్వంసం ఫలితంగా సంభవిస్తున్న పరిణామాలు రాజస్థాన్ ప్రజల జీవితాలపై ఈవ్ర ప్రభావం చూపుతున్నాయి.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# త్రిపుర గిరిజన పోరాటం

(2వ పేజీ తరువాయి)

ప్రబలకుండా, జాతులుగా విడిపోకుండా ఉండడానికి గిరిజనులలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం తీసుకున్నారు. చురుకైన కార్యకర్తలకు కనీసమైన విద్య ఉండాలని నిర్ణయించారు.

త్రిపురలో 1948-50 మధ్యకాలంలో సాయుధ పోరాటాలు జరిగాయి. సాయుధ పోరాటాలు ఉచ్ఛస్థితిలో ఉన్నకాలంలోనే త్రిపుర రైఫిల్స్‌లోని కొందరు సైనికులు సైన్యాన్ని వదిలి ఆయుధాలతో సహా గెరిల్లా పోరాటంలో చేరిపోయారు. ఇటువంటి వారి రాక గెరిల్లా పోరాట యోధులకు, ప్రజలకు మరింత ఆత్మ స్థైర్యాన్ని కలిగించింది. 1949-50ల మధ్య కాలంలో త్రిపురలోని ప్రతి గిరిజన విభాగంలోనూ గణముక్తి పరిషత్ వేళ్లూనుకుంది. ప్రతి గిరిజన ప్రాంతంలో ఒక గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఒక కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారితో సహా తొమ్మిది మంది సభ్యులు ఉంటారు. పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ నిర్మాణ వ్యవస్థ ఎంతగానో తోడ్పడింది.

గణముక్తి పరిషత్ రెండు విభాగాలుగా ఉండేది- రాజకీయ విభాగం, సైనిక విభాగం. దశరథ్ దేవ్ సైనిక విభాగానికి, రాజకీయ విభాగానికి కూడా అధిపతిగా ఉండేవారు. గెరిల్లా దళాలు పటిష్టంగా ఉండడానికి కొన్ని నిబంధనలు రూపొందించారు. క్రమశిక్షణ, సరైన రాజకీయ శిక్షణ తప్పనిసరి అని నొక్కి చెప్పారు.

1. రాజకీయ విభాగానికి సైనిక విభాగం ఒదిగి ఉండాలి. ఎట్టిపరిస్థితులలోనూ రాజకీయ నిర్ణయాలను అనుసరించి తీరాలి.

2. ప్రజలపట్ల, ముఖ్యంగా మహిళల పట్ల ఎంతో గౌరవంతో, అణుకువతో మెలగాలి.

3. రైతుల ఆస్తులను ధ్వంసం చేయకూడదు, కబ్జా చేయకూడదు. రైతులతో మెలిగేటప్పుడు చాలా న్యాయబద్ధంగా ఉండాలి.

4. బంధించబడిన వారిపట్ల అమానుషంగా ప్రవర్తించకూడదు. గెరిల్లాలకు పై అంశాలపై శిక్షణ ఇచ్చేవారు. గెరిల్లా దళాలలోని సభ్యులందరు వారంలో ఒకసారైనా తప్పనిసరిగా రాజకీయ తరగతులకు హాజరు కావాలి. లెనిన్ రచించిన, 'గ్రామీణ పేదలు' వంటి పుస్తకాలు చదవాల్సిన పాఠ్యాంశాలలో భాగాలుగా ఉండేవి. ఆ రకంగా గెరిల్లాలు రాజకీయంగా చైతన్యవంతులయేవారు.

గెరిల్లా దళాలు ఈ నియమాలన్నింటిని తప్పనిసరిగా పాటించడం వలన గణముక్తి పరిషత్ గిరిజన ప్రజలలో అమితమైన ప్రాచుర్యం పొందింది. బెంగాలీ ముస్లింలలో కూడా ఎక్కువమంది దీనికి మద్దతుగా ఉండేవారు. దేశ విభజన సహితం బెంగాలీ ముస్లింలకు గిరిజనులకు మధ్యనున్న సంబంధాన్ని తెంచ లేకపోయింది.

గణముక్తి పరిషత్ అనేక గ్రామాలలో ప్రజాపాలనా యంత్రాంగాన్ని ఏర్పరచింది. తగాదాలు తీర్చడానికి, న్యాయపరమైన పరిపాలన అందించడానికి, మధ్యవర్తిత్వ కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. వెట్టి చాకిరీ రద్దు చేయబడింది. భూ గరిష్ట పరిమితిని నిర్ణయించడం జరిగింది. కౌలుకిచ్చిన యజమాని పొందాల్సిన, కౌలుదారుడు ఇవ్వాల్సిన కౌలును, వడ్డీరేట్లను నిర్ణయించారు. కులవివక్షను నిషేధించారు. బహు భార్యత్వం, మైనారిటీ తీరని పిల్లలకు వివాహాలు, మహిళలపై హింస, తాగుడుకు బానిసలవడం, మహిళలను మంత్రగత్తెలుగా ముద్రవేయడం మొదలైన మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా కఠినమైన నిబంధనలు రూపొందించారు. ఈ నియమాలు విధిగా పాటించబడేవి. ఒక కొత్త సామాజిక జీవనం ప్రారంభించబడింది. ఇది అంతకు ముందున్న భూస్వామ్య, రాచరిక వ్యవస్థలకు పూర్తిగా భిన్నమైనది.

ఈ ప్రజాపోరాటాల ఒత్తిడి ఫలితంగానే 1949 అక్టోబర్‌లో త్రిపుర భారత యూనియన్‌లో చట్టబద్ధంగా విలీనం అయ్యింది. కానీ కొత్తగా ఏర్పడ్డ పెట్టుబడిదారీ వర్గంతో సంబంధాలు ఏర్పరచుకొని పాత ఫ్యూడల్ శక్తులు తమ అధికారాన్ని కాపాడుకున్నాయి.

పెట్టుబడిదారీ, భూస్వామ్యశక్తులకు వ్యతిరేకంగా పోరాడితే తప్ప గిరిజన జాతులను, కార్మిక వర్గాన్ని విముక్తి చేయలేమని జన శిక్షణా సమితి, గణముక్తి పరిషత్ నాయకులు గుర్తించారు.

భారత యూనియన్‌లో త్రిపుర విలీనం అయిన తరువాత గణముక్తి పరిషత్, కమ్యూనిస్టులపై దాడులు మరింత పెరిగాయి. కొండ ప్రాంతాలలో కూడా సైనిక కాంపులు ఏర్పాటు చేసి, కొన్నిప్రాంతాలలో గ్రామాలకు గ్రామాలే తగులబెట్టారు. సైన్యం ఇంతగా భయభ్రాంతులు సృష్టించినా అనేక మంది యువకులు గణముక్తి పరిషత్‌కి అండదండలిచ్చారు. దాని కళ్ళు చెవులుగా పనిచేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రజా ప్రతిఘటనకు నాయకత్వం వహించారు. కొద్దినెలలలోనే గణముక్తి పరిషత్ ఎంతగా విస్తరించిందంటే రహస్య జీవితం గడిపే నాయకులూ, కార్యకర్తలు కూడా పగలే గిరిజన గ్రామాలలో బహిరంగంగా తిరిగేవారు. పోలీసులకు సమాచారాన్నందించే ప్రజలు దాదాపు లేరనే చెప్పవచ్చు. ప్రతి గ్రామంలోను ఒక రహస్య స్థలం ఉండేది. అక్కడే రాజకీయ శిక్షణ తరగతులు జరిగేవి. క్రమం తప్పకుండా సమావేశాలు, రాజకీయ తరగతులు నిర్వహించడం ఈ కాలంలోని ప్రత్యేకత. అందువలనే ప్రజలలో ప్రజాస్వామ్య, రాజకీయ చైతన్యం, ఉద్యమం పట్ల వారి నిబద్ధత పెరిగాయి.

మహిళలు మహిళా సంఘం, గెరిల్లా దళాలలోనూ సంఘటితం చేయబడేవారు. వార్తాహరులుగా, గిరిజన మహిళలు వీరోచిత పాత్ర నిర్వహించారు. నాయకుల అరెస్టులను నిలపగలిగారు. రహస్య స్థావరాలకు వారిని చేర్చి రక్షించేవారు. గిరిజన మహిళలు నారీసమితిగా విభజించబడ్డారు. వారు అనేక ప్రాంతాలకు వెళ్లేవారు. అందులో ఉత్తేజితులైన మహిళలు మహిళా గెరిల్లా దళాలలో చేరేవారు.

ప్రతిఘటన పోరాటం నిర్వహించే కాలంలోనే గణముక్తి పరిషత్ సాంస్కృతిక ఉద్యమంపై కూడా దృష్టి సారించింది. గిరిజన భాష ఐన కోక్‌బోరక్‌లో అనేక పాటలు రాశారు. ఆటపాటలతో గిరిజన యువత వారి సంస్కృతిని అభివృద్ధి చేసుకున్నారు. 'సాయుధ, సాంస్కృతిక పోరాటాలు కలిపిచేద్దాం' అనే నినాదాన్ని తీసుకున్నారు.

1950ల మధ్యకాలంలో గణ ముక్తి పరిషత్ నాయకత్వమంతా కమ్యూనిస్టు పార్టీలో విలీనం కావాలని నిశ్చయించుకుంది. మొదట్లో కొంత అస్పష్టత ఉన్నప్పటికీ గణముక్తి పరిషత్ నాయకులు తమ నిర్ణయానికి గల కారణాలను సమర్ధవంతంగా వివరించి, ప్రజలను ఒప్పించగలిగారు. అప్పటి నుండి త్రిపుర ప్రజలు 'ఎర్ర జండాను' తమదిగా చేసుకున్నారు.

గిరిజనులలో ఉత్సాహం కొరవడడం, చురుకుదనం తగ్గడం గ్రహించి, సాయుధ పోరాట పరిమితులను అర్థం చేసుకున్న పార్టీ 1951లో సైనిక చర్యలను ప్రతిఘటించడం నుండి వెనక్కు తగ్గడం ప్రారంభించింది. అయితే పార్టీ రాజకీయ ఖైదీలను విడిపించుకోగలిగింది. అరెస్టు వారంట్లను ఉపసంహరింప చేసుకుంది. కఠినమైన అణచివేత చర్యలు అడ్డుకోగలిగింది.

ఈ పరిస్థితులలో 1952లో పార్టీ పార్లమెంటు ఎన్నికలలో పాల్గొంది. రెండు లోక్‌సభ స్థానాలలో కూడా విజయం సాధించింది. ఎలక్టోరల్ కాలేజిలో 30కి గాను 21 స్థానాలు సంపాదించుకుంది. ఇది అక్కడున్న ప్రజలు కమ్యూనిస్టు పార్టికి ఇస్తున్న మద్దతుకు అద్దం పడుతుంది.

**(ఆర్. ఉషారాణి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-02-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# సామాజిక సంబంధాలనుండే సెంటిమెంట్లూ, ఆలోచనలూ పుట్టుకొస్తాయి



**– జి. వి. ప్లెఖనోవ్**

....మనిషే చరిత్రను నిర్మిస్తాడు. తన జీవనావసరాలను సంతృప్తి పరుచుకునే క్రమంలో దాన్ని నిర్మిస్తాడు. ఈ జీవనావసరాలు ప్రకృతి సిద్ధంగా ప్రారంభమై తరువాత చాలా మార్పులకు గురవుతాయి. మానవుడు సృష్టించుకునే కృత్రిమ వాతావరణానికి అనుగుణంగా ఈ అవసరాలు కూడా పరిణామాత్మకంగానూ, గుణాత్మకంగానూ మార్పు చెందుతాయి. మానవుడు సమకూర్చుకునే ఉత్పత్తి శక్తులే అన్ని రకాల సామాజిక సంబంధాలనూ నిర్ధారిస్తాయి. మొదటిగా ఉత్పత్తి శక్తుల పరిస్థితి, సామాజిక ఉత్పత్తి క్రమంలో మనుషుల మధ్య సంబంధాలను, అంటే ఆర్థిక సంబంధాలను నిర్ధారిస్తుంది. ఈ సంబంధాలు ఖచ్చితంగా నిర్థిష్ట ప్రయోజనాలు ఏర్పడ్డానికి కారణమవుతాయి. ఈ నిర్థిష్ట ప్రయోజనాలు చట్టంగా రూపొందుతాయి.'ప్రతి న్యాయ వ్యవస్థా ఒక నిర్థిష్ట ప్రయోజనాన్ని కాపాడుతుంది' అని లేబ్రియోలా చెప్పాడు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి సమాజాన్ని వర్గాలుగా విభజించేస్తుంది. ఈ వర్గాల ప్రయోజనాలు విభిన్నంగా ఉండడమే కాదు అనేక ముఖ్యమైన విషయాల్లో ఒకరి ప్రయోజనాలకు విరుద్ధంగా మరొకరివి నిలిచి ఉంటాయి. ప్రయోజనాల మధ్య ఈ వైరుధ్యాలు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలకు దారి తీస్తాయి. ఈ ఘర్షణ వల్లనే గిరిజన వ్యవస్థ స్థానంలో రాజ్య వ్యవస్థ ఏర్పడుతుంది. ఆధిపత్య వర్గం యొక్క ప్రయోజనాలను కాపాడ్డమే ఈ వ్యవస్థ కర్తవ్యం. చివరిగా...నిర్థిష్ట స్థితిలోని ఉత్పత్తి శక్తులచే నిర్ణయించబడిన సామాజిక సంబంధాల నుండి ఉమ్మడి నైతిక విలువలు ఉద్భవిస్తాయి. ఈ విలువలే ప్రజలకు వారి ఉమ్మడి, దైనందిన జీవనంలో మార్గదర్శకత్వం వహిస్తాయి.

అందువల్ల, ఒకానొక ప్రజానీకపు చట్టం, రాజ్య వ్యవస్థ, నైతిక విలువలు...ఇవన్నీ కూడా ఆ ప్రజల ఆర్థిక సంబంధాల చేత తక్షణం, నేరుగా నిర్ధారించబడతాయి. మానవుని మెదడు, ఆలోచనా సృష్టించే ఇతర విషయాలు అంటే కళలు, సైన్సు వగైరాలు కూడా ఈ ఆర్థిక సంబంధాలవల్లనే తక్షణం, పరోక్షంగా నిర్ధారించబడతాయి.

అందువల్ల ఏ దేశంలోనైనా శాస్త్రీయ ఆలోచన యొక్క లేక కళల యొక్క చరిత్రను అర్థం చేసుకోవాలంటే ఆ దేశ ఆర్థికరంగం ఒక్కదాన్ని గురించి తెలుసుకుంటే సరిపోదు. అక్కడి ఆర్థిక రంగంనుండి సామాజిక మానసికస్థితి (సోషల్ సైకాలజీ)లోకి వెళ్లడమెలాగో నేర్చుకోవాలి. దీన్ని (సామాజిక మానసిక స్థితిని) గనక జాగ్రత్తగా అధ్యయనం చేసి, అర్థం చేసుకోకపోతే సిద్ధాంతం యొక్క చరిత్రను భౌతికవాద కోణం నుండి వివరించడం అసాధ్యమైపోతుంది.

...ఒక నిర్థిష్ట సమాజంలో నెలకొన్న సెంటిమెంటూ, ఆలోచనా విధానం కూడా సామాజిక సంబంధాల వల్లనే ఉద్భవిస్తాయి. మనిషి సామాజిక జీవన స్థితిని ఆయన ఆలోచనా విధానం నిర్ణయించదు, దానికి మారుగా మనిషి ఆలోచనా విధానాన్ని అతని సామాజిక జీవన స్థితి నిర్ణయిస్తుంది. కాని ఒక సారి అతని ఆలోచనా విధానం సామాజిక జీవనం నుండి ఉద్భవించిన తరువాత అక్కడి నుండి అది చరిత్రలో ఒక భాగం అయిపోతుంది...అందువల్ల సామాజిక మానసికస్థితికి చాలా ప్రాముఖ్యత ఉంది...

ఈ కళారూపం ఒకానొక సామాజిక కాలపు (ఉదాహరణకు సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు) స్ఫూర్తికి అనుగుణంగా ఉంది అంటే అర్థం ఆ కాలపు సామాజిక జీవనాన్ని నిర్దేశించే వర్గాల సెంటిమెంట్లకు అనుగుణంగా ఉందన్న మాట. సామాజిక సంబంధాలు మారనంత వరకు ఆ సమాజపు మానసిక స్థితి మారదు. ప్రజలు ఆ సమాజంలో ఉన్న నమ్మకాలు, దృక్పథాలు, ఆలోచనా విధానాలకూ, ఆనాటి సౌందర్య అవసరాలను సంతృప్తి పరిచే పద్దతులకూ అలవాటు పడి ఉంటారు. అయితే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్ల సామాజిక ఆర్థిక చట్రంలో గణనీయమైన మార్పు వస్తే సామాజిక వర్గాల సంబంధాల్లో కూడా మార్పులు వస్తాయి. దానికణుంగానే ఈ వర్గాల మానసిక స్థితి కూడా 'ఆ నాటి కాలపు స్ఫూర్తి', 'జాతీయ లక్షణం' మొదలైన వాటికి అనుగుణంగా మారిపోతుంది. ఈ మార్పువల్ల కొత్త మత భావాలు, కొత్త తాత్విక ధోరణులు ఏర్పడతాయి. కొత్త సౌందర్య అవసరాలకోసం కళల్లో కొత్త పద్దతులు పుట్టుకొస్తాయి.

**(ప్లెఖనోవ్ రాసిన చారిత్రక భౌతికవాద వ్యాసాలు, 1897 గ్రంథం నుండి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.9. Published on February 1, 2021